www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 20-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 215 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య మ.12.17 తదుపరి పాడ్యమి, నక్షత్రం: విశాఖ ఉ.10.59 తదుపరి అనూరాధ, వర్జ్యం: మ.3.28-5.16, దుర్ముహూర్తం: ఉ.10.09-10.53, మ.2.36-3.21, అమృతఘడియలు: రా.2.15-4.03, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.26, సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## హంతకుడిని పట్టించిన ల్యాప్‌టాప్

అమెరికాలో ఏపీ మహిళ హత్య కేసులో ట్విస్ట్

2017లో ఆమెతో పాటు కుమారుడి హత్య

తొలుత భర్తపై అనుమానం.. విచారణ.. భర్త సహోద్యోగి హమీద్ హత్య చేసినట్లు తాజాగా గుర్తింపు

ల్యాప్‌టాప్‌పై అతడి డీఎన్‌ఏను కనుగొన్న అధికారులు

హత్య తర్వాత భారత్‌కు వచ్చేసిన హమీద్ 3

అతడిని అప్పగించాలని కోరుతున్న అమెరికా అధికారులు


నర్రా శశికళ, అనీశ్ సాయి


హమీద్

# మరో ఏడుగురు నక్సల్స్ ఎన్‌కౌంటర్

## హిడ్మాను నేలకూల్చిన మారేడుమిల్లిలోనే మళ్లీ ఎదురుకాల్పులు


ఏవోబీ నేత టెక్ శంకర్ మృతదేహం

అంతా హిడ్మా దళ సభ్యులే.. మృతుల్లో ఏవోబీ నేత టెక్ శంకర్

37 ఏళ్ల క్రితం సిక్కోలు నుంచి జోగారావు ఉద్యమబాట

మిలిటరీ, టెక్నికల్ రంగాలపై గట్టిపట్టు.. హిడ్మా దళంలో అత్యంత సీనియర్.. 2 రోజుల్లో 13 మంది ఎన్‌కౌంటర్

హిడ్మా దంపతులకు పోస్టుమార్టం పూర్తి.. స్వగ్రామంలో రాజ్యమేలుతున్న నిశ్శబ్దం.. 45 మంది నక్సల్స్‌కు రిమాండ్

రాజమహేంద్రవరం/మారేడుమిల్లి/రంపచోడవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లిలో బుధవారం ఉదయం మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో మరో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఆంధ్రా-ఒడిశా బోర్డర్ (ఏవోబీ) కమిటీ నేత మెట్టూరి జోగారావు అలియాస్ టెక్ శంకర్ అలియాస్ బాబు అలియాస్ శివ తోపాటు మరో ఆరుగురు ఉన్నారు. వీరంతా మావోయిస్టు పార్టీ మిలిటరీ చీఫ్ హిడ్మా దళ సభ్యులు. టెక్ శంకర్ ఈ దళంలో అత్యంత సీనియర్ నేత అని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు ఇదే ప్రాంతంలో మంగళవారం

మిగతా 14వ పేజీలో...

## నడిచేవారేరీ.. నడిపించేవారేరీ?

కగార్‌తో మావోయిస్టులు కుదేల్

దళ, దిశ నిర్దేశిన నేతల లొంగుబాటు

45 ఏళ్ల తర్వాత మళ్లీ మొదటికి ఉద్యమం

'విముక్తి ప్రాంతాలు' బలగాల చేతిలోకి 14

16 ఏళ్లలో 5,600 మంది నక్సల్స్ మృతి

మావోయిస్టు దళపతి బస్వరాజ్ ఎన్‌కౌంటర్

పార్టీ చీఫ్ దేవ్‌జీ ఉనికిపైనా అనుమానాలు

ప్రతీకార దాడులకు చాన్సు!

పూర్తి అప్రమత్తంగా ఉన్నాం: నిఘా చీఫ్ లడ్డా

దేవ్‌జీ ఎక్కడున్నాడో తెలిదని స్పష్టీకరణ

# సేవే పరమ ధర్మం


ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

సమాజాన్ని, ప్రజలను ఆదుకోవడానికి సత్యసాయి నిరంతరం తపించారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి వైపరీత్యం సంభవించినా సత్యసాయి సేవాదళ్ సభ్యులు బాధితులకు సేవలందిస్తున్నారు. గుజరాత్‌లోని భుజ్‌లో భూకంపం సమయంలో సేవాదళ్ చేసిన సేవలు నాకు బాగా గుర్తున్నాయి. - ప్రధాని మోదీ

## సత్యసాయి.. విశ్వ ప్రేమకు ప్రతిరూపం: ప్రధాని

కోట్ల మందిపై ఆయన ప్రేమ, సేవాభావనల ప్రభావం.. 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అని బోధించారు

ఆయన సంస్థలు అదే పాటిస్తున్నాయి.. 140 దేశాల్లో కోట్ల మందికి బాబా బోధనలు వెలుగుబాట

ఆయన ప్రేరణతో కలిసి పనిచేద్దాం.. పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకల్లో మోదీ పిలుపు


పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ప్రేమ ఒక్కటే మతం.. హృదయం ఒక్కటే భాష.. మానవత్వమే కులం.. అన్నిచోట్లా భగవంతుడు ఉన్నాడని సత్యసాయి బోధించారు. నాస్తికులను సైతం ఆధ్యాత్మికత వైపు నడిపించిన గొప్ప వ్యక్తి. - సీఎం చంద్రబాబు

బాబా స్మారక రూ.100 నాణెం, తపాలా స్టాంపుల ఆవిష్కరణ

సత్యసాయి చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

'మానవ సేవే మాధవ సేవ' అని బోధించారు.. ఆచరించారు: సీఎం

సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు జల్ జీవన్ మిషన్‌కు అంకురం: పవన్

పేద రైతులకు గిర్ ఆవుల పంపిణీ

20 వేల మందికి 'సుకన్య సమృద్ధి'

మరో రెండు సేవా కార్యక్రమాలను ప్రారంభించిన సత్యసాయి ట్రస్టు

అనంతపురం/పుట్టపర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశ్వప్రేమకు ప్రతిరూపం భగవాన్ సత్యసాయిబాబా అని ప్రధాని మోదీ అన్నారు. సేవే పరమ ధర్మమని మన నాగరికత చెప్పిందని.. సత్యసాయి పాటించిన ప్రేమ, సేవాభావనలు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం

మిగతా 13వ పేజీలో...



# చెవిరెడ్డి ఆస్తులు జప్తు

మద్యం స్కామ్‌లో 63.72 కోట్ల స్థిరాస్తులు అటాచ్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి

మద్యం ముడుపుల సొమ్ముతో కొనుగోలు

వైట్ మనీగా మార్చుకోవడానికి కుటుంబ సభ్యులు, అనుచరుల పేర్లతో 9 డొల్ల కంపెనీల సృష్టి!

ఏసీబీ కోర్టులో త్వరలో సిట్ పిటిషన్

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో కీలక నిందితుడు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ ఆస్తులను రాష్ట్రప్రభుత్వం జప్తు చేసింది. మద్యం ముడుపుల సొమ్ముతో అక్రమంగా కూడబెట్టిన ఆస్తులను జప్తు చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇటీవల పంపిన ప్రతిపాదనను ఆమోదించింది. చెవిరెడ్డి

మిగతా 12వ పేజీలో...

## డీఫాల్ట్ బెయిల్ రద్దు

మద్యం కేసులో ధనుంజయ్‌రెడ్డి బ్యాచ్‌కు హైకోర్టు షాక్! 12

26లోగా కోర్టులో లొంగిపోవాలని ముగ్గురు నిందితులకు ఆదేశం

ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు వేసుకునేందుకు వెసులుబాటు

# లాభసాటి సాగుకు పంచ సూత్రాలు

## ప్రతి రైతు మీసం మెలేసేలా చేస్తా: సీఎం


కడప జిల్లా పర్యటన సందర్భంగా పూల తోటలో రైతులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విధ్వంసం, ఆటవిక పాలన చేసేవారు ఇక ఎన్నడూ అధికారంలోకి రాకూడదు

అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది

నాకు సహకరించండి.. రాష్ట్రాన్ని, రైతులను ఆకాశమే హద్దుగా అభివృద్ధి చేసి చూపిస్తా

సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం

కమలాపురం సభలో సీఎం చంద్రబాబు

'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల

46,85,838 మంది రైతుల ఖాతాల్లో 3,135 కోట్లు జమ

ఒకేసారి రూ. 7 వేలు

99% ఖాతాలకు చేరిన సొమ్ము

వ్యవసాయానికి టెక్నాలజీని జోడిస్తా. తెగులు సోకిన మొక్కకే మందు పిచికారీ చేసేలా టెక్నాలజీని అభివృద్ధి చేస్తాం. వాయు నాణ్యత ఎలా ఉంది? తెగుళ్లు, పురుగుల ప్రభావం ఎంత ఉంది? గాలి ఎటు వైపు వీస్తోందో చెప్పే టెక్నాలజీని తీసుకువస్తా. సాంకేతికతను జోడించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతులు మీసం మెలేసేలా చేస్తా. - సీఎం చంద్రబాబు

కడప/అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లాభసాటి సాగుతో ప్రతి అన్నదాతను మీసం మెలేసేలా చేస్తానని సీఎం చంద్రబాబు చెప్పారు. దీనికిగాను 'పంచసూత్రాల'ను పాటించాలని రైతన్నలకు సూచించారు. కులం కాదు, మతం కాదు, ప్రాంతం కాదు అందరి భవిష్యత్తు ముఖ్యమని ఉద్ఘాటించారు. విధ్వంసం, ఆటవిక పాలన చేసే వారిని అధికారంలోకి శాశ్వతంగా రాకుండా చేయాలన్నారు. అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ క్రమంలో తనకు సహకరించాలని ప్రజలను కోరారు. ఆకాశమే

మిగతా 12వ పేజీలో...

## చంద్రబాబు తిరుగులేని వ్యక్తి



పాలసీల రూపకల్పనలో వినూత్న ఆలోచనలకు హ్యాట్సాఫ్

పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర పోస్ట్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం సరికొత్త దారులు వేయడమే నేను చేస్తోంది: చంద్రబాబు 12

## ఫొటో, క్యూఆర్ కోడ్‌తో కొత్త ఆధార్

త్వరలో అందుబాటులోకి.. ఆఫ్‌లైన్ ధ్రువీకరణకు గుడ్‌బై 2

ఎం ఆధార్ యాప్ స్థానంలో త్వరలో సరికొత్తది

చిరునామా, ఫోన్ నంబరు మార్పు ఇక సులభతరం: సీఈవో

## ఈ-పాస్‌పోర్టుతో మోసాలకు చెక్

ఇక అధునాతన టెక్నాలజీతో చిప్ బేస్డ్ ఈ-పాస్‌పోర్టులు 2

## బెంగళూరులో పట్టపగలే 7 కోట్లు దోపిడీ

ఐటీ అధికారులమంటూ ఏటీఎంలలో నగదు నింపే వాహనం లూటీ 2

# హంగామా చేద్దాం!



నేడు హైదరాబాద్ కోర్టుకు జగన్

హడావుడి చేయాలని ప్రణాళిక

తరలి రావాలని కార్యకర్తలకు సంకేతాలు

తానొస్తే భద్రతా సమస్యలు తప్పవంటూ వ్యక్తిగత హాజరుకు డుమ్మా కొట్టే ఎత్తుగడ?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అక్రమాస్తుల కేసులో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరేళ్ల తర్వాత కోర్టు మెట్లు ఎక్కనున్నారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అక్కడ తన పార్టీ శ్రేణుల ద్వారా నానా హడావుడి సృష్టించేందుకు రంగం సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. గురువారం ఉదయం 10.45 గంటలకు బేగంపేట విమానాశ్రయంలో దిగింది మొదలు నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు వెళ్లే దాకా... 'బలప్రదర్శన' చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 'నేను కోర్టుకు ప్రత్యక్షంగా హాజరైతే భద్రతాపరమైన

మిగతా 12వ పేజీలో...

## ఉన్న ఒక్క చెల్లినీ చూసుకోలేరా?

జగన్‌కు నేను దూరం కాలేదు.. అతనే నన్ను, అమ్మను దూరం పెట్టారు

'జగన్, కేటీఆర్ వర్సెస్ షర్మిల, కవిత' చర్చపై ఏపీసీసీ చీఫ్ స్పందన 12



## అల్ ఫలాహ్ నుంచి 10 మంది పరారీ

గాలిస్తున్న దర్యాప్తు సంస్థలు 2

ఫరీదాబాద్ మాడ్యూల్‌తో సంబంధాలపై విచారణ

పాక్‌లో యాప్ ద్వారా విరాళాలు సేకరించిన జైషే

## అల్ ఫలాహ్‌లో రూ.415 కోట్ల అక్రమాలు

నకిలీ గుర్తింపుతో ఫీజు వసూళ్లు.. లెక్కల్లో విరాళాలుగా: ఈడీ

వర్సిటీ వ్యవస్థాపకుడు సిద్దిఖీకి 13 రోజుల రిమాండ్

## తీర్పులకు విరుద్ధంగా చట్టాలా?

అలా చేయడానికి వీల్లేదు 2



కోర్టు తీర్పులను పార్లమెంటు పక్కన పెట్టలేదు

ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం విషయంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి

చట్టంలో కీలక నిబంధనలను కొట్టివేస్తూ తీర్పు

గతంలోనూ కేంద్రంపై జస్టిస్ గవాయ్ ఫైర్

## 'ఇండి' కూటమి విచ్ఛిన్నం?

**» బిహార్ దెబ్బతో కాంగ్రెస్‌తో కొనసాగడంపై పునరాలోచన**

న్యూఢిల్లీ, నవంబరు 19: వరుస పరాజయాలతో కుదేలై పోతున్న ఇండి కూటమి.. తాజాగా బిహార్‌లో ఘోర ఓటమి దరిమిలా విచ్ఛిన్నం అంచుకు చేరింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు సీట్లే దక్కడం, ఆ పార్టీతో కలిసి పోటీచేసిన ఆర్జేడీకి గట్టి ఎదురుదెబ్బ తగలడం ఇండి కూటమిలోని పార్టీలను పునరాలోచనలో పడేసిందని పరిశీలకులంటున్నారు. వచ్చే ఏడాది జరగనున్న వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నాయని చెబుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయేను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సారథ్యంలో ఏర్పాటైన ఇండి కూటమిలో టీఎంసీ, డీఎంకే, ఎస్పీ, ఎన్‌సీపీ, ఆర్జేడీ, ఆప్, శివసేన(యూబీటీ), జేఎంఎం, వామపక్షాలు కీలక భాగస్వామ్య పక్షాలు. వీటిలో ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్ దాదాపు దూరమయ్యాయి. బిహార్ ఫలితాలతో తమిళనాడులో కాంగ్రెస్‌తో కొనసాగే విషయంలో స్టాలిన్ పునరాలోచనలో పడినట్లు సమాచారం. యూపీలోనూ కాంగ్రెస్‌తో కాకుండా ఒంటరిపోరుకే ఎస్పీ అధినేత అఖిలేష్ సన్నద్ధమవుతున్నారని తెలుస్తోంది.

## పదోసారి సీఎంగా నితీశ్.. నేడు ప్రమాణం

పట్నా, నవంబరు19: బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ పదోసారి ప్రమాణం చేయనున్నారు. పట్నా గాంధీ మైదానంలో గురువారం ఉదయం పదకొండున్నర గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు, సీనియర్ నేతలు హాజరుకానున్నారు. మరోవైపు కొత్తగా ఎన్నికైన ఎన్డీయే ఎమ్మెల్యేలు బుధవారం ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా నితీశ్‌ను ఎన్నుకున్నారు.

## ఎన్నికల ఫలితాలతో నిద్రపట్టడం లేదు: ప్రశాంత్ కిశోర్

పట్నా, నవంబరు 19: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి తనకు సరిగ్గా నిద్రపట్టడం లేదని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్(పీకే) పేర్కొన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 3.5% ఓట్లు మాత్రమే సాధించిన జన్ సురాజ్ పార్టీ ఘోరంగా విఫలమైంది. ఈ నేపథ్యంలో ఎన్డీటీవీతో మాట్లాడిన ప్రశాంత్ కిశోర్.. తమ పార్టీకి ఇలాంటి ఫలితం వస్తుందని ఊహించలేదని పేర్కొన్నారు.

## బెంగళూరులో పట్టపగలే 7 కోట్లు దోపిడీ

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే దొంగల ముఠా బరితెగించింది. ఏటీఎంలలో నగదును నింపే సీఎంఎస్ సంస్థ వాహనం నుంచి బుధవారం రూ.7.11కోట్ల నగదును దోచుకుంది. జేపీ నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి నగదు తీసుకుని సీఎంఎస్ సంస్థ (జీజే01హెచ్‌టీ 9173) వాహనంలో సిబ్బంది వెళుతుండగా జయనగర్ సౌత్ ఎండ్ సర్కిల్‌లో 'గవర్నమెంట్ ఆఫ్ ఇండియా' అనే స్టిక్కర్ అతికించి ఉన్న కేఏ03 ఎన్‌సీ 8052 నంబరు ఇన్నోవా కారు వచ్చి అడ్డగించింది. తాము ఐటీ అధికారులమని బెదిరించి, డ్రైవర్ మినహా గన్‌మన్, మరో ఉద్యోగిని వాహనం నుంచి దించేశారు. ముఠాలోని ఇద్దరు వ్యక్తులు నగదు ఉన్న సీఎంఎస్ వాహనంలోకి ఎక్కి డెయిరీ సర్కిల్‌లోని జయదేవ ఆసుపత్రి వైపు మళ్లించారు. అక్కడి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై సీఎంఎస్ వాహనాన్ని ఆపి, అందులోని నగదును ఇన్నోవా కారులోకి మార్చారు. తర్వాత తమ కారులో ఆ ముఠా పారిపోయింది.

## రాష్ట్రాభివృద్ధిని ఎవరూ ఆపలేరు: భువనేశ్వరి



శిక్షణ పొందిన పారిశ్రామికవేత్తకు యూనిట్ స్థాపనకు అవసరమైన భూమి మంజూరు పట్టా అందజేస్తున్న భువనేశ్వరి

కుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఇది సన్ రైజ్ ఏపీ. ఎవరెన్ని అడ్డంకులు పెట్టాలని చూసినా జరుగుతున్న అభివృద్ధిని ఎవరూ ఆపలేరు' అని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం పర్యటనలో తొలి రోజైన బుధవారం ఆమె ద్రావిడ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో సమావేశమయ్యారు. 'సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ అభివృద్ధిని ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు. పోలవరం ప్రాజెక్టు 2027లో, అమరావతి సంపూర్ణ నిర్మాణం 2029లో పూర్తవుతుంది. గడిచిపోయిన ప్రభుత్వం గురించి మాట్లాడడం దండగ. అది మూసివేసిన పేజీ. విద్యార్థులు దేశం కోసం, రాష్ట్రం కోసం శ్రమించాలి' అని భువనేశ్వరి పిలుపునిచ్చారు. అనంతరం ఆమె ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలోనే 'అలీప్' ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. బుధవారం సాయంత్రం గుడుపల్లె మండలం మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామివారి ఆలయంలో జరిగిన దీపారాధనలో భువనేశ్వరి పాల్గొన్నారు. కార్తీక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు.

## కల్తీ నెయ్యి కేసులో నేడు వైవీ విచారణ

తిరుపతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో దేవస్థానం మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని గురువారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రశ్నించనుంది. ఇందుకోసం బుధవారం తిరుపతి నుంచి దర్యాప్తు బృందం హైదరాబాద్ బయల్దేరి వెళ్లింది. ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి పీఏ కడూరు చిన్న అప్పన్న సిట్ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. మూడు విడతలుగా విచారించిన సిట్ అధికారులు అతడి నుంచి రాబట్టిన సమాచారంతో పాటు ఇదివరకూ దర్యాప్తులో వెల్లడైన ఇతర ఆధారాలతో సుబ్బారెడ్డిని ప్రశ్నించేందుకు సన్నద్ధమయ్యారు.

## శబరిమల దర్శనానికి పాస్ తప్పనిసరి: డీజీపీ

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శబరిమలలో పెరుగుతోన్న రద్దీ దృష్ట్యా అయ్యప్ప భక్తులు దర్శనానికి పాస్ తప్పనిసరిగా తీసుకోవాలంటూ ఏపీ డీజీపీ కార్యాలయం ఒక ప్రకటనలో సూచించింది. కేరళ హైకోర్టు తీర్పు మేరకు అక్కడి ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను మన రాష్ట్ర పోలీస్ బాస్ వెల్లడించారు. 'శబరిమల ఆలయంలో ప్రతి రోజూ 70 వేలకు మించి భక్తులు దర్శనం చేసుకోవడం సాధ్యం కాదు. దీంతో స్పాట్ బుకింగ్స్ చేయించుకుని క్యూ పాస్ తీసుకున్న వారికి మాత్రమే దర్శనం కల్పిస్తున్నారు. స్పాట్ బుకింగ్ కేంద్రాల్లో రోజుకు ఐదు వేల పాసులు మాత్రమే ఇస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఏపీ భక్తులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి' అని సూచించారు. పూర్తి వివరాలకు శబరిమల హెల్ప్‌లైన్ 14432 లేదా 04735-14432కు ఫోన్ చేయవచ్చన్నారు.

### సీఐ సతీశ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి: కుమ్మరి యువత

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీఐ సతీశ్ కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలంటూ కుమ్మరి యువసేన నేతలు మంగళవారం ఏపీ డీజీపీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం డీజీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

## మదీనాకు గవర్నర్ నజీర్ బృందం



(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన 45 మంది భారతీయ కుటుంబాలకు అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించడానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పంపిన అత్యున్నత స్థాయి బృందం బుధవారం సౌదీకి చేరుకుంది. మదీనాలోని ప్రిన్స్ మహమ్మద్ బిన్ అబ్దుల్ అజీజ్ విమానాశ్రయంలో ఈ బృందానికి సౌదీలో భారత రాయబారి సొహైల్ అహ్మద్ ఖాన్, కాన్సుల్ జనరల్ ఫహాద్ ఖాన్ స్వాగతం పలికారు. ఇదే విమానంలో హైదరాబాద్ నుంచి మృతుల కుటుంబాలకు చెందిన 39 మంది బంధువులు కూడా మదీనాకు చేరుకున్నారు. వారి నుంచి డీఎన్ఏ శాంపిల్స్ సేకరించారు. కాగా, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌తో పాటు సౌదీలోని టీడీపీ నాయకులు జానీ బాషా, ఖలీద్ సైఫుల్లా కూడా పార్టీ తరఫున అంత్యక్రియల్లో పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# అల్ ఫలాహ్ నుంచి 10 మంది పరారీ




**వారికోసం గాలిస్తున్న దర్యాప్తు సంస్థలు**

**» వర్సిటీ వ్యవస్థాపకుడు సిద్ధిఖీకి 13 రోజుల రిమాండ్**

న్యూఢిల్లీ, నవంబరు 19: ఫరీదాబాద్ జైషే మహ్మద్ ఉగ్ర మాడ్యూల్‌కు స్థావరంగా మారిన అల్ ఫలాహ్ యూనివర్సిటీ, దాని సమీప గ్రామం నుంచి 10 మంది వ్యక్తులు కనిపించకుండా పోయారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడి జరిగినప్పటి నుంచి వీరి ఆచూకీ లభించటం లేదని ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. అజ్ఞాతంలోకి వెళ్లినవారిలో వర్సిటీ బోధనా సిబ్బందితోపాటు పలువురు విద్యార్థులు, సమీప గ్రామస్తులు ఉన్నట్లు వెల్లడించాయి. వీలైనంత త్వరగా వీరిని వెతికి పట్టుకోవాలని హరియాణా పోలీసులకు ఆ రాష్ట్ర డీజీపీ ఓపీ సింగ్ ఆదేశాలు జారీచేశారు. వీరికి ఫరీదాబాద్ ఉగ్ర వైద్యుల ముఠాతో సంబంధాలు ఉన్నాయా? అన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు, భారత్‌లో ఆత్మాహుతి దాడులు జరిపేందుకు పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ విరాళాలు సేకరించినట్లు వెల్లడైంది. పాక్‌కు చెందిన 'సదా' యాప్ ద్వారా ఈ విరాళాలు సేకరించినట్లు గుర్తించారు. మరింత మంది ఆత్మాహుతి బాంబర్లను తయారుచేసేందుకు ఒక్కొక్కరు రూ.20,000 పాకిస్థానీ రూపాయలు ఇవ్వాలని జైషే మహ్మద్ సంస్థ పెద్దలు పాక్‌లో పిలుపునిచ్చినట్లు పోలీసుల అదుపులో ఉన్న అల్ ఫలాహ్ వైద్యురాలు షాహీన్ వెల్లడించినట్లు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. కాగా, ఢిల్లీ బాంబు దాడిపై వార్తలు ప్రసారం చేసేటప్పుడు స్వీయ నియంత్రణ, విచక్షణ పాటించాలని టీవీ చానళ్లకు కేంద్ర ప్రసార శాఖ సూచించింది. కొన్ని చానళ్లు ఈ దాడిని సమర్థించేలా వార్తలు ప్రసారం చేస్తున్నాయని, బాంబులు ఎలా తయారు చేయాలనే అంశాలను కూడా చూపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేసింది.ఇలాంటి వార్తలు ప్రసారం చేయొద్దని కోరింది.

### అల్ ఫలాహ్‌లో రూ.415 కోట్ల అక్రమాలు

అల్ ఫలాహ్ యూనివర్సిటీ యాజమాన్యం 2014-15 నుంచి 2024-25 వరకు అక్రమంగా రూ.415 కోట్లు సంపాదించిందని అల్ ఫలాహ్ గ్రూప్ చైర్మన్ జావేద్ అహ్మద్ సిద్దిఖీ రిమాండ్ రిపోర్టులో ఈడీ కోర్టుకు తెలిపింది. వర్సిటీకి గుర్తింపు రాకముందే నకిలీ గుర్తింపుతో విద్యార్థులను చేర్చుకొని భారీగా ఫీజులు వసూలు చేసిందని, వాటిని విరాళాలుగా లెక్కల్లో చూపిందని వెల్లడించింది. ఈ అంశంలో మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు సిద్దిఖీని తమకు అప్పగించాలని కోరింది. దీంతో ఆయనను కోర్టు 13 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించింది. ఇదిలా ఉండగా, ఎర్రకోట వద్ద కారుబాంబు దాడికి పాల్పడిన ఉమర్ నబీ.. కారులోనే బాంబును అసెంబుల్ చేసినట్లు దర్యాప్తు వర్గాలు అనుమానిస్తున్నాయి. అతడు దాడికి ముందు ఎర్రకోట పార్కింగ్ కాంప్లెక్స్‌లో మూడు గంటలపాటు ఉన్నట్లు సీసీకెమెరాల్లో రికార్డయ్యింది. ఆ సమయంలో ఒక్కసారి కూడా అతడు కారు దిగలేదు. ఆ మూడు గంటలు అతడు విడిభాగాలను కలిపి బాంబును తయారుచేశాడని అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

### పాక్ నేత ప్రేలాపనలు

ఎర్రకోట బాంబు దాడిపై పాకిస్థాన్‌కు చెందిన రాజకీయ నాయకుడు చౌదరి అన్వరుల్ హక్ అవాకులు చెవాకులు పేలాడు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'మీరు బలూచిస్థాన్‌లో రక్తపుటేరులు పారిస్తే, మేము ఎర్రకోట నుంచి కశ్మీర్ అడవుల వరకు దాడులు చేస్తామని నేను గతంలోనే చెప్పాను. మన యోధులు ఆ పని చేసి చూపారు. వాళ్లు (భారత్) ఇప్పటికీ శవాలను లెక్కబెట్టుకోలేకపోతున్నారు' అని పేర్కొన్నాడు.

### పాక్, బంగ్లాదేశ్, యూఏఈ, చైనాల్లో వైద్య విద్య అభ్యసించిన వారిపై దృష్టి

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఇటీవల కారు పేలుడు సంభవించడం, దీని వెనుక కొందరు వైద్యుల హస్తం ఉందని గుర్తించిన కేంద్రదర్యాప్తు సంస్థలు మరింత అప్రమత్తమయ్యాయి. చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, యూఏఈలలో వైద్య విద్య అభ్యసించిన వారిని విచారించాలని, నిఘా పెట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఆయా దేశాల్లో వైద్య విద్య అభ్యసించిన వారికి డాక్టర్ టెర్రర్ మాడ్యూల్ పరిజ్ఞానం ఉందా?.. ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు సంస్థలు విచారించనున్నాయి. సీబీఐ, ఢిల్లీ పోలీసులు సహా ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, యూఏఈలలో వైద్య విద్య అభ్యసించిన వారి వివరాలను కొంత మేరకు సేకరించారు. అదేవిధంగా అన్ని వైద్యశాలలు, నర్సింగ్ హోమ్‌లు మరిన్ని వివరాలను అందించాలని కోరినట్టు దర్యాప్తు సంస్థ అధికారి ఒకరు తెలిపారు. ఆయా దేశాల్లో వైద్య పట్టాలు పొందిన వారి ప్రవర్తన, అందిస్తున్న సేవలు వంటివాటిని తమకు అత్యవసరంగా ఇవ్వాలని ఆయా సంస్థలను కోరినట్టు చెప్పారు. "ఆ నాలుగు దేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన వారి నేర చరిత్ర, వారి ఆర్థిక లావాదేవీలను కూడా నిశితంగా పరిశీలిస్తాం" అని సదరు అధికారి చెప్పారు.

## ఫొటో, క్యూఆర్ కోడ్‌తో కొత్త ఆధార్

న్యూఢిల్లీ, నవంబరు 19: 'ఆధార్ కార్డుదారుని ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉండేలా ఆధార్ కార్డును రూపొందించాలన్న ఆలోచన చేస్తున్నాం. ఇది కార్డుదారుని వ్యక్తి సమాచార దుర్వినియోగాన్ని అరికడుతుంది' అని ఉడాయ్ సీఈఓ భువనేశ్ కుమార్ తెలిపారు. "కార్డు మీద ఏ వివరాలైనా ఎందుకు ఉండాలి? అన్నది ఒక ఆలోచన. దానిలో భాగంగానే కార్డుపై ఫొటో, క్యూఆర్ కోడ్. ఆఫ్‌లైన్ ధ్రువీకరణ పద్ధతిలో ఆధార్ నంబరును, బయోమెట్రిక్ వివరాలను అట్టిపెట్టుకోవడాన్ని ఆధార్ చట్టం నిరోధిస్తుంది. అయినప్పటికీ అనేక సంస్థలు ఆధార్ కార్డు ఫొటో కాపీని దాచిపెట్టుకుంటూనే ఉన్నాయి. అయితే డిసెంబరు 1నుంచి ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ పద్ధతులను నిరోధించే దిశగా ఉడాయ్ పనిచేస్తుంది. ఆధార్‌ని ఒక డాక్యుమెంటులా ఉపయోగించడం కుదరదు. ధ్రువీకరణను క్యూఆర్ కోడ్‌తో కానీ, ఆధార్ నంబరుతో కానీ చేయాలి. ఉడాయ్ తీసుకువస్తున్న కొత్త యాప్‌తో చిరునామా, ఫోన్ నంబరు మార్పులు చేర్పులను స్వయంగా చేసుకోవచ్చు. ఎం ఆధార్ యాప్ స్థానంలో ఈ సరికొత్త యాప్ తెస్తున్నాం" అని భువనేశ్ వివరించారు.

## ఈ-పాస్‌పోర్టుతో మోసాలకు చెక్

న్యూఢిల్లీ, నవంబరు 19: ఫోర్జరీ, డూప్లికేట్ వంటి మోసాలను కట్టడి చేయడానికి భారత ప్రభుత్వం అధునాతన టెక్నాలజీతో ఈ-పాస్‌పోర్టులను రూపొందిస్తోంది. ఇంటర్‌లాకింగ్ మైక్రోలెటర్స్, ఉబ్బెత్తుగా ఉండి కాపీ చేయడానికి వీలులేని అక్షరాలతో పాటు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) చిప్‌ను ఈ-పాస్‌పోర్టుల్లో ఏర్పాటు చేశారు. 2035 జూన్‌లోగా పూర్తిగా ఈ-పాస్‌పోర్టులు మాత్రమే ఉండేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే జారీ చేసిన నాన్ ఎలక్ట్రానిక్ పాస్‌పోర్టులు గడువు ముగిసే వరకు పనిచేస్తాయి. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏవో) ప్రమాణాల ప్రకారం డిజిటల్ సైన్ రూపంలో కొత్త పాస్‌పోర్టులో డేటా నిక్షిప్తమై ఉంటుంది. తాకనవసరం లేకుండా డేటాను పొందే వీలున్న ఈ చిప్‌తో వేగంగా, సమర్థవంతంగా ఇమ్మిగ్రేషన్ కౌంటర్లలో గుర్తింపు ప్రక్రియ పూర్తవుతుంది. దీనితో మోసపూరిత చర్యలకు చెక్ పడుతుంది. పాస్‌పోర్టు పరిశీలన ప్రక్రియ సులభతరమవుతుంది.

## లోకం తీరు




## ప్రపంచ ప్రకృతి సాగు కేంద్రంగా భారత్: మోదీ

చెన్నై, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రకృతి వ్యవసాయ కేంద్రంగా భారత్ ఉద్భవిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వ్యవసాయాన్ని ఆధునిక, విస్తృత అవకాశంగా యువత గుర్తిస్తోందని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటైన మూడు రోజుల సదస్సును బుధవారం మధ్యాహ్నం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, రైతు సంఘాల సమాఖ్య నాయకుడు పీఆర్ పాండ్యన్ తదితరులు పాల్గొన్న ఈ సదస్సులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటైన 17 స్టాళ్లను మోదీ ప్రారంభించారు. అనంతరం 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' కింద రైతులకు 21వ విడతగా రూ.18 వేల కోట్లు విడుదల చేశారు. ప్రకృతి వ్యవసాయంలో విశిష్ట సేవలందించిన 10మంది రైతులకు ప్రధాని అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం మన సంప్రదాయంలో పాతుకుపోయిందని, ఇది పర్యావరణానికి అనుకూలమని వ్యాఖ్యానించారు. 'కిసాన్ క్రెడిట్ కార్డ్' (కేసీసీ) పథకం ద్వారా ఈ ఏడాది రైతులకు రూ10 లక్షల కోట్లకు పైగా సహాయం అందిందని చెప్పారు. పీఎం-కిసాన్ పథకం కింద ఇప్పటి వరకూ 4 లక్షల కోట్లు నేరుగా చిన్న రైతుల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణ 21వ శతాబ్దపు వ్యవసాయ ఆవశ్యకత అని నొక్కిచెప్పారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, నేలను ఆరోగ్యంగా ఉంచడానికి, హానికరమైన రసాయనాల నుంచి ప్రజలను రక్షించడానికి ప్రకృతి వ్యవసాయం సహాయపడుతుందని ప్రధాని వివరించారు. దక్షిణ భారతదేశం వ్యవసాయానికి ఒక సజీవ విశ్వవిద్యాలయం అని, ఈ ప్రాంతం ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన కొన్ని ఆనకట్టలకు నిలయంగా ఉందన్నారు. 'ఒక ఎకరం- ఒక సీజన్' విధానంలో రైతులు ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాలని మోదీ పిలుపునిచ్చారు.

## నాగరిక సమాజంలో ఇలాంటివి అనుమతిస్తామా?

**» 'తలాఖ్-ఎ-హసన్'పై జస్టిస్ సూర్యకాంత్**

న్యూఢిల్లీ, నవంబరు 19: తలాఖ్ ప్రక్రియలో ఒక విధానమైన 'తలాఖ్-ఎ-హసన్'ను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా ఆక్షేపించారు. '2025లో ఇలాంటి దానిని ఎలా అనుమతిస్తారు? మతం ఎంత మంచిదైనా ఈ రకమైన దానిని ఎలా అంగీకరిస్తారు? మహిళల ఆత్మగౌరవాన్ని దీని ద్వారా కాపాడగలమా? ఒక నాగరిక సమాజంలో ఇటువంటి ధోరణులు ఉండవచ్చా? తీవ్రమైన వివక్షాపూరిత విధానాలు కొనసాగుతున్నప్పుడు కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుంది' అని పేర్కొన్నారు. నెలకొకమారు చొప్పున మూడు నెలలపాటు వరుసగా తలాఖ్ చెప్పి భార్యకు భర్త విడాకులు ఇవ్వటాన్ని 'తలాఖ్-ఎ-హసన్' అని అంటారు. ఇస్లామిక్ పర్సనల్ లా దీనికి అనుమతిస్తోంది. ఈ ప్రక్రియను రద్దు చేయాలన్న పిల్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫారసు చేసే అంశాన్ని పరిశీలిస్తామని, ఈలోపు సంబంధిత భాగస్వామ్యపక్షాలు ముఖ్యమైన వాదనలతో కూడిన నోట్స్‌ను సమర్పించాలని తెలిపింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ 'తలాఖ్-ఎ-హసన్'ను తీవ్రంగా తప్పుపట్టారు. కాగా, జర్నలిస్టు బెనజీర్ హీనా 2022లో ఈ పిల్‌ను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. తన భర్త ఈ విధంగానే విడాకులు ఇచ్చి మరో పెళ్లి చేసుకున్నారని.. అయితే, విడాకులు ఇచ్చినట్లుగా ఎటువంటి పత్రాలు లేకపోవటంతో పిల్లల స్కూల్ అడ్మిషన్లతోపాటు పలు సందర్భాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. విడాకులకు లింగం, మతంతో సంబంధం లేని తటస్థ నిబంధనలు రూపొందించాలని కోరారు. తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 26వ తేదీకి వాయిదా వేస్తూ.. హీనా భర్త కూడా హాజరు కావాలని ఆదేశించింది.

## పోక్సో కేసులో యడియూరప్పకు సమన్లు

బెంగళూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పకు ప్రజా ప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం సమన్లు జారీ చేసింది. డిసెంబరు 2న కేసు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సాయం కోరి ఇంటికి వచ్చిన బాలికను లైంగికంగా వేధించారని ఆయనపై కేసు నమోదైంది. 2024 ఫిబ్రవరి 2న జరిగిన సంఘటనకు సంబంధించి బాలిక తల్లి సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో యడియూరప్పతోపాటు అరుణ, ఎం.రుద్రేశ్, మరిస్వామికి సమన్లు జారీ అయ్యాయి. ఫిర్యాదిదారుల తరఫున ప్రత్యేక ప్రాసిక్యూటర్ అశోక్ ఎస్. నాయక్ వాదనలు వినిపించారు. దీంతో 30 రోజుల్లోగా సాక్షులను విచారించే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి సుజాత సమన్లు జారీ చేశారు. పోక్సో కేసును కొట్టివేయాలని, ఎఫ్‌టీఎస్ జారీ చేసిన సమన్లను రద్దు చేయాలని యడియూరప్ప తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం ఇటీవల కొట్టివేసింది. కోర్టుకు హాజరు కావాలని యడియూరప్పను ఆదేశించింది.

## రాష్ట్రపతి, గవర్నర్లకు గడువుపై నేడు సుప్రీం స్పష్టత!



న్యూఢిల్లీ, నవంబరు 19: చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించడం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు నిర్దేశించడంపై ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం స్పష్టత ఇవ్వనుంది. గడువు నిర్దేశించడం సబబేనంటూ ఓ వైపు.. అది రాజ్యాంగానికి విరుద్ధమనే వాదనలు మరోవైపు ముసురుకున్న నేపథ్యంలో ధర్మాసనం ఏం చెబుతుందన్నది ఆసక్తిగా మారింది. కోర్టు ఇచ్చే స్పష్టత మేరకు భవిష్యత్తులో దేశ రాజకీయాలు కూడా ప్రభావితమయ్యే అవకాశాలు ఉన్నాయి.

### తమిళనాడు ప్రభుత్వ పిటిషన్‌పై..

అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి సుదీర్ఘకాలం జాప్యం చేయడంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దానిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్లు మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. ఒకవేళ ఆ గడువులోగా నిర్ణయం వెలువరించకుంటే.. ఆ బిల్లులకు ఆమోదం లభించినట్టే భావించవచ్చని పేర్కొంది. దీనితో గవర్నర్ ఆమోదించకుండా పక్కనపెట్టిన పది బిల్లులను చట్టాలుగా నోటిఫై చేస్తూ తమిళనాడు ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. అయితే రాజ్యాంగ బాధ్యతల్లో ఉండే రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సరికాదంటూ సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలయ్యాయి. కానీ తాము అప్పీళ్లను విచారించబోమని, ఈ అంశంలో సలహాలు, సూచనలకే పరిమితం అవుతామని ఆగస్టులో చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. దీంతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 కింద తనకు సంక్రమించిన అధికారాల మేరకు సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించి.. వివరణ, సలహాలు కోరారు. 'బిల్లులకు ఆమోదం అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు రాజ్యాంగం కల్పించిన అధికారాలను కాదని న్యాయవ్యవస్థ గడువులు నిర్దేశించవచ్చా' అని స్పష్టత కోరారు.

### పరస్పర భిన్న వాదనల మధ్య..

రాష్ట్రపతి అడిగిన అంశాలకు సంబంధించి జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాదన వినిపించాయి. రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయవ్యవస్థ గడువు విధించడం సరికాదని అటార్నీ జనరల్ ఆర్.వేంకటరమణి కోర్టుకు వివరించారు. ఇక కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. గవర్నర్లకు కోర్టులు గడువు విధించలేవని, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారి అధికారాల్లో జోక్యం చేసుకోవడం వివిధ వ్యవస్థల మధ్య రాజ్యాంగం చేసిన అధికారాల విభజనను ఉల్లంఘించడమేనని వాదించారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కేంద్ర వాదనను సమర్థించాయి. మరోవైపు ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలు గవర్నర్లకు గడువు పెట్టడం సరైనదేనంటూ సుప్రీం తీర్పును సమర్థించాయి. వాదనలన్నీ విన్న ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం సెప్టెంబరు 11న తమ నిర్ణయాన్ని రిజర్వు చేసింది.

### ఆదివారం రిటైర్ కానున్న చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్

*సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం (ఈ నెల 23న) పదవీ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి గవర్నర్లకు గడువు నిర్దేశిస్తూ ఈ ఏడాది మేలో తీర్పు ఇచ్చిన ఇద్దరు సభ్యుల సుప్రీం ధర్మాసనంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ఒకరు. ఇప్పుడీ అంశంపై రాష్ట్రపతి కోరిన మేరకు స్పష్టత ఇవ్వనున్న ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి ఆయనే నేతృత్వం వహిస్తుండటం గమనార్హం. నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేయనుండటంతో.. ఈ అంశంలో ఆయన చరిత్రాత్మక నిర్ణయం వెలువరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.*

## కోర్టు తీర్పులకు విరుద్ధంగా చట్టాలా?

**» అలా చేయడానికి వీల్లేదు: జస్టిస్ గవాయ్**

న్యూఢిల్లీ, నవంబరు 19: కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ట్రైబ్యునల్ సభ్యులు, ప్రిసైడింగ్ అధికారుల నియామకాలు, పదవీకాలం, సర్వీసు షరతులకు సంబంధించి ఈ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం రద్దు చేసింది. అవన్నీ పాతవేనని, చిన్నచిన్న మార్పులతో కేంద్రం వాటిని మళ్లీ ప్రవేశపెట్టిందని పేర్కొంది. చట్టంలో చిన్న చిన్న మార్పులు చేయడం ద్వారా కోర్టు తీర్పులను పార్లమెంటు పక్కనపెట్టడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. కోర్టు వరసగా ఇచ్చిన తీర్పుల అమలు విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరు సరికాదంది. 'ట్రైబ్యునళ్ల స్వతంత్రతకు సంబంధించి కోర్టు రూపొందించిన సూత్రాలను అమలు చేయకపోగా.. వాటిలో స్వల్ప మార్పులు చేసి, చట్టాన్ని అమలు చేయాలనుకోవడం దురదృష్టకరం' అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం 137 పేజీల తీర్పులో వ్యాఖ్యానించింది. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా గతంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై సీజేఐ జస్టిస్ గవాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేసు విచారణను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని అటార్నీ జనరల్ అభ్యర్థించగా.. సీజేఐ తీవ్రంగా స్పందించారు. కేసు విచారణ తుది దశలో ఉండగా, ఇలా అడగడమంటే తన బెంచ్ నుంచి తప్పించుకొనే ఎత్తుగడేనని అన్నారు. అనంతరం విచారణను వాయిదా వేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ కోరగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'నేను పదవీ విరమణ చేసేవరకు ఈ కేసులో తీర్పు రాకూడదని కోరుకుంటున్నారా?. అటార్నీ జనరల్‌కు చివరి అవకాశం ఇస్తాం. ఆ రోజు రాకపోతే కేసును ముగించేస్తాం' అని కూడా హెచ్చరించారు. ఈ క్రమంలో బుధవారం ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021లోని కీలక నిబంధనలను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. ఈ చట్టంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు న్యాయవ్యవస్థ స్వతంత్రతతో పాటు అధికార వికేంద్రీకరణ సూత్రాలను ఉల్లంఘించేలా ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. అలాంటి నిబంధనలను తిరిగి ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ట్రైబ్యునళ్ల సభ్యుల పదవీకాలాలకు సంబంధించి గతంలో ఇచ్చిన న్యాయపరమైన ఆదేశాలను కోర్టు పునరుద్ధరించింది. ఆదాయపు పన్ను అప్పీలేట్ ట్రైబ్యునల్, కస్టమ్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రైబ్యునల్ సభ్యులు 62 ఏళ్లు వచ్చేవరకు.. ఛైర్‌పర్సన్లు/అధ్యక్షులు 65 ఏళ్ల వయసు వచ్చే వరకు పదవిలో కొనసాగవచ్చని స్పష్టం చేసింది.

### ఇదీ కేసు..

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం-2021తో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పీలేట్ ట్రైబ్యునల్‌తో సహా కొన్ని అప్పీలేట్ ట్రైబ్యునళ్లు రద్దయ్యాయి. వీటితోపాటు పలు ట్రైబ్యునళ్ల జ్యుడీషియల్, ఇతర సభ్యుల నియామక నిబంధనల్లో పలు సవరణలు జరిగాయి. అయితే, దీనిని సవాలు చేస్తూ మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.


బుధవారం ఉదయం 8.30 గంటలకు పాడేరు మెయిన్‌రోడ్డుపై కమ్మేసిన పొగమంచు

## పొంచి ఉన్న మరో తుఫాన్ ముప్పు!

- 22న బంగాళాఖాతంలో అల్పపీడనం
- తుఫాన్‌గా బలపడే అవకాశం
- దక్షిణ కోస్తాలోనే తీరం దాటుతుందంటున్న నిపుణులు

విశాఖపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరి పంట కోతల దశకు వచ్చిన తరుణంలో..తుఫాన్ ముప్పు ఉందన్న సమాచారం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 22వ తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి 24వ తేదీ కల్లా దక్షిణ బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో వాయుగుండంగా బలపడనుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఈ క్రమంలో అది తుఫాన్‌గా మారుతుందా? లేదా? అన్నది ఐఎండీ నిర్ధారించలేదు. కానీ ఈనెల 25వ తేదీ తరువాత బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడుతుందని ఇది దక్షిణ కోస్తాలోనే తీరం దాటుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఉత్తరాది నుంచి వస్తున్న గాలులతో రాష్ట్రంలో అనేకచోట్ల చలి తీవ్రత కొనసాగుతోంది. అల్లూరి జిల్లా జి.మాడుగులలో 4.6 డిగ్రీలు, ముంచంగిపుట్టు మండలం కిలగాడలో 5.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రెండు, మూడు రోజులు చలి ప్రభావం కొనసాగి ఆ తరువాత స్వల్పంగా తగ్గుతుందని పేర్కొంది.

### మన్యం గజగజ

**జి.మాడుగులలో 4.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత**

పాడేరు/అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఏజెన్సీలో ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లోని జి.మాడుగులలో బుధవారం 4.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది ఇప్పటివరకూ నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే.

### రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

రాష్ట్రంలో రానున్న రెండు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలు, శుక్రవారం కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈనెల 22 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, తదుపరి 48గంటల్లో అది పశ్చిమ-వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని తెలిపింది.


విశాఖపట్నం జిల్లా పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో దీపోత్సవం బుధవారం సాయంత్రం కన్నులపండువగా జరిగింది. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున నిర్వహించే ఈ ఉత్సవానికి ఈ ఏడాది భక్తులు భారీగా తరలివచ్చారు.



### నేడు తిరుమలకు రాష్ట్రపతి

న్యూఢిల్లీ/తిరుమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం తిరుమలకు రానున్నారు. మధ్యాహ్నం 3.25 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి తిరుచానూరు వెళ్లి పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. 11 గంటలకు తిరుమల నుంచి రాష్ట్రపతి తెలంగాణ పర్యటనకు వెళ్లనున్నారు. బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటుచేసే భారతీయ కళా మహోత్సవ్ 2025ను ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. శనివారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరిగే శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు రాష్ట్రపతి హాజరవుతారు.

## 'ఉద్దానం'పై రంగంలోకి ఐసీఎంఆర్

- కిడ్నీ వ్యాధి మూలాలు గుర్తించే పరిశోధనకు ఆమోదం
- ఆంధ్రా మెడికల్ కాలేజీలో ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు
- రూ.6.2 కోట్ల నిధులు కేటాయించనున్న కేంద్రం
- మూడు విడతల్లో.. మూడేళ్ల పాటు పరిశోధనలు

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు అధికంగా ప్రబలడానికి కారణాలేమిటో అంతు చిక్కడం లేదు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పరిశోధనలు చేసినప్పటికీ సమస్యకు ప్రధాన కారణాలు మాత్రం బయటపడలేదు. ఈ నేపథ్యంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) రంగంలోకి దిగింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో 'శ్రీకాకుళం కిడ్నీ రిసెర్చ్ ప్రాజెక్ట్' పేరిట ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల మూలాలపై పరిశోధనలు చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. ఐసీఎంఆర్ బృందం మూడేళ్ల పాటు ఇక్కడే ఉండి కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేయనుంది. ఇందుకోసం ఆంధ్రా మెడికల్ కాలేజీలో ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేయనున్నారు. మూడేళ్లలో పరిశోధనలు పూర్తిచేసేందుకు ఐసీఎంఆర్‌కు మూడు దశల్లో రూ.6.2 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వమే అందిస్తుంది. ఈ ప్రాజెక్టు కింద నిర్వహించే పరీక్షల ద్వారా ఆరోగ్యశాఖ.. ఒకటి లేదా రెండేళ్లలో కిడ్నీ వ్యాధి బారినపడే అవకాశం ఉన్న వారిని గుర్తించి వారికి ముందస్తు చికిత్స అందిస్తుంది. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో త్వరలోనే ఈ ప్రాజెక్టు ప్రారంభంకానుంది. వాస్తవానికి గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి నుంచీ ఉద్దానంలో పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ వ్యాధి మూలాలను మాత్రం గుర్తించలేకపోయారు. దీంతో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ ఉద్దానంలో పరిశోధనలు జరపాలని ఈ ఏడాది మార్చి నుంచి ఐసీఎంఆర్‌ను కోరుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విన్నపం మేరకు ఐసీఎంఆర్ పూర్తిస్థాయిలో రంగంలోకి దిగనుంది.

### 5,500 మంది నుంచి శాంపిల్స్ సేకరణ..

ఉద్దానంలో ఇప్పటివరకూ జరిపిన పరిశోధనలను కూడా ఐసీఎంఆర్ పరిగణనలోకి తీసుకోనుంది. 18 ఏళ్లకు పైబడిన వారిలో 5,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలు సేకరించి ఆధునిక బయోమార్కర్స్ విధానంలో పరీక్షిస్తారు. దీనికి హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ రవిరాజు నేతృత్వం వహించనున్నారు. ఈ పరిశోధనల వల్ల ఒకటి, రెండేళ్లలో కిడ్నీల వ్యాధి బారిన పడే వారిని ముందే గుర్తించవచ్చు. ముందుగానే మేల్కొని చికిత్స అందించవచ్చు. అలాగే ఆర్ఎన్ఏ సీక్వెన్సింగ్ విధానంలో జన్యు పరీక్షలు కూడా చేస్తారు.

> **మూలాలపై పరిశోధనలు**
>
> డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రిసెర్చ్ కింద ఐసీఎంఆర్ ఈ పరిశోధనలకు ఆమోదం తెలపడాన్ని స్వాగతిస్తున్నామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఐసీఎంఆర్ పరిశోధనల వల్ల కిడ్నీ సమస్యలకు మూలాలు బయటకు వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై భారం లేకుండా నిధులు కూడా ఐసీఎంఆర్ భరిస్తుందని చెప్పారు. కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. - మంత్రి సత్యకుమార్

### మట్టి, నీరు, గాలి, పంటల నమూనాలు పరీక్ష

రక్త, మూత్ర నమూనాలను పరీక్షించేందుకు ఐసీఎంఆర్ ఆంధ్రా మెడికల్ కాలేజీలో ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేయనుంది. కొత్తగా సాంకేతిక, పరిశోధన నిపుణులను నియమిస్తారు. తొలి ఏడాది రూ.3.04 కోట్లు, రెండో ఏడాది రూ.1.75 కోట్లు, మూడో ఏడాది రూ.1.21 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేస్తారు. పరిశోధనల్లో భాగంగా ఉద్దానంలోని వేర్వేరు ప్రాంతాల్లో మట్టి, నీరు, గాలి, వరి, చేపలు, కూరగాయల నమూనాల సేకరించి కూడా పరీక్షిస్తారు. వీటి ఫలితాలనుబట్టి తదుపరి చర్యలు ఉంటాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆస్ట్రేలియాకు చెందిన భారత్‌లోని జార్జ్ ఇనిస్టిట్యూట్‌కు పరిశోధన బాధ్యతలు అప్పగించారు. కానీ.. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల పరిశోధన పూర్తిస్థాయిలో జరగలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనిపై తిరిగి శ్రద్ధ పెట్టడంతో ఉద్దానంపై మళ్లీ కదలిక వచ్చింది. ఉద్దానం ప్రాంతంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, ఇతర మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో విడతల వారీగా పరిశోధనలు చేయనున్నారు.

### ఉద్యాన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతేడాది మే, అక్టోబరు నెలల్లో ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోయిన ఉద్యాన రైతులకు ఎస్డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.4.82 కోట్లు విడుదలకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2024 మే నెలలో వడగండ్ల వానలు, గాలులు, అకాల వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి 2,856 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా చెల్లించేందుకు రూ.4,31,93,300 మంజూరు చేసింది. అక్టోబరులో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలకు ఉద్యాన పంటలు నష్టపోయిన 501 మంది రైతులకు రూ.50,16,700 మంజూరు చేసింది. కాగా ఉద్యాన తోటల రైతులకు సూక్ష్మనీటిపారుదల వ్యవస్థ ఆధారంగా ఆటోమేటేషన్ అమలుకు ప్రభుత్వం అనుమతించింది. యూనిట్ ఖర్చు, కార్యాచరణ విధానంపై బుధవారం మార్గదర్శకాలు జారీ చేసింది.

### డిసెంబరు 30 నుంచి దివ్యానుగ్రహ హోమం రద్దు

తిరుమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30 నుంచి వైకుంఠద్వార దర్శనాలు జరిగే పది రోజులూ అలిపిరిలో నిర్వహించే దివ్యానుగ్రహ హోమాన్ని రద్దు చేస్తున్నట్టు టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.









### పీ4 సభ వ్యయం విడుదల

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జీరో పావర్టీ-పీ4 పాలసీ ప్రారంభించే సందర్భంగా ఈ ఏడాది మార్చి 30న నిర్వహించిన సీఎం సభకు సంబంధించిన వ్యయం రూ.5.61 కోట్లను విడుదల చేశారు. ఈ మేరకు బుధవారం ప్రణాళిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఆ కార్యక్రమానికి జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ రూ.54.86 లక్షలు, గుంటూరు జిల్లా రూ.3.23 కోట్లు, ఏపీఎస్ఆర్టీసీ రూ.1.07 కోట్లు, ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ రూ.75 లక్షలు వ్యయం చేశాయి.

## హంతకుడిని పట్టించిన ల్యాప్‌టాప్

- అమెరికాలో ఆంధ్రా మహిళ హత్య కేసులో ట్విస్ట్

న్యూఢిల్లీ/పర్చూరు, నవంబరు 19: అమెరికాలో ఎనిమిదేళ్ల క్రితం హత్యకు గురైన ఆంధ్రప్రదేశ్ మహిళ నర్రా శశికళ, ఆమె కుమారుడి హత్య కేసులో ట్విస్ట్ చోటుచేసుకుంది. శశికళ భర్తతో కలిసి పనిచేసే నజీర్ హమీదే అసలు హంతకుడని తాజాగా గుర్తించారు. అతని ల్యాప్‌టాపే అతన్ని పట్టించింది. బాపట్ల జిల్లా తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన నర్రా హనుమంతరావు కాగ్నిజెంట్‌లో పనిచేస్తూ నూజెర్సీలో భార్య శశికళ (38), కుమారుడు అనీశ్ సాయి (6)తో కలసి నివసించేవారు. 2017 మార్చి 23న శశికళ, అనీశ్ హత్యకు గురయ్యారు. పోలీసులు.. తొలుత భర్తనే అనుమానించారు. కానీ ఆధారాలేకపోవడంతో విడిచిపెట్టారు. అయితే, హత్య జరిగిన ప్రదేశంలో వేరొకరి రక్తం, డీఎన్ఏను అధికారులు కనిపెట్టారు. దర్యాప్తు క్రమంలో హనుమంతరావుకు, కాగ్నిజెంట్ సహోద్యోగి నజీర్ హమీద్‌కు బేదాభిప్రాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. హత్య జరిగిన 6నెలల తర్వాత హమీద్ అమెరికా వదిలి భారత్‌కు వచ్చేశాడు. అప్పటి నుంచి ఇక్కడే నివసిస్తూ కాగ్నిజెంట్‌లో ఉద్యోగం కొనసాగిస్తున్నాడు. హత్య కేసులో విచారించేందుకు హమీద్ డీఎన్ఏ నమూనా సేకరించడానికి అమెరికా అధికారులు భారత అధికారులను సంప్రదించారు. కానీ హమీద్ నిరాకరించాడు. అయితే అతని ల్యాప్‌టాప్ నుంచి డీఎన్ఏ నమూనా సేకరించడానికి 2024లో కోర్టు నుంచి అనుమతి పొందింది.. హమీద్ ల్యాప్‌టాప్‌ను పంపాలని కాగ్నిజెంట్‌ను కోరారు. ల్యాప్‌టాప్ ఆధారంగా హమీద్ డీఎన్ఏను, హత్య ప్రదేశంలో కనుగొన్న నెత్తుటి నమూనాలను సరిపోల్చారు. ఆ గుర్తుతెలియని నెత్తురు నమూనా హమీద్‌దేనని గుర్తించారు. దీనితో తాజాగా అతనిపై కేసు నమోదు చేశారు. విచారణ కోసం హమీద్‌ను తిరిగి అమెరికా తీసుకుని వెళ్లేందుకు పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## రైలు పట్టాలపై ఒరిగిన విద్యుత్ స్తంభం

- గుర్తించి రైలును నిలిపేసిన లోకో పైలట్
- టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు
- పెందుర్తి రైల్వేస్టేషన్ వద్ద ఘటన

పెందుర్తి(విశాఖపట్నం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టాటానగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు పెనుప్రమాదం తప్పింది. విశాఖపట్నం జిల్లా పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలో నిర్వహణ పనులు చేస్తుండగా విద్యుత్ స్తంభం ఒక్కసారిగా ఒరిగిపోయింది. పక్కనే ఉన్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ (ఓహెచ్‌ఈ) వైర్లపై ఆ స్తంభం పడింది. ఆ సమయంలో అదే ట్రాక్‌పై వస్తున్న టాటానగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ ప్రమాదాన్ని పసిగట్టి సమయస్ఫూర్తితో వ్యవహరించి రైలును ఆపారు. పెద్ద కుదుపుతో రైలు ఆగడంతో భీతిల్లిన ప్రయాణికులు చివరికి విషయం తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి రైల్వేస్టేషన్ వద్ద కొన్నిరోజులుగా విద్యుత్ స్తంభాల నిర్వహణ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఒక స్తంభం పక్కకు ఒరిగి ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ విద్యుత్ వైర్లపై పడింది. దీంతో రైల్వే ఉద్యోగులు ఎం.సంతోష్(38) ఎం.దాసు(54) విద్యుదాఘాతానికి గురికాగా, మరో కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని పెందుర్తి సీహెచ్‌సీకి తరలించారు. స్తంభం ఒరిగిన సమయంలో ఎర్నాకులం నుంచి టాటానగర్ వెళుతున్న (నంబర్ 1819) టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. లోకోపైలట్ అప్రమత్తమై రైలును నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. దాదాపు గంటపాటు ట్రాక్‌పై రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, ట్రాక్‌పై ఒరిగిన స్తంభాన్ని సరిచేశారు. విద్యుత్ ఓహెచ్‌ఈ నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. అనంతరం గంట ఆలస్యంగా టాటానగర్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ పెందుర్తి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. స్తంభం ఒరిగిన విషయాన్ని లోకోపైలట్ గుర్తించి రైలును ఆపకుంటే బోగీలకు మంటలు అంటుకుని తీవ్ర ప్రాణనష్టం జరిగేదని పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

పాకిస్థాన్‌కు సైనిక పాలకులు కొత్త కాదు. ఆ మాటకొస్తే గతంలో పాకిస్థాన్ గడ్డపై విలసిల్లిన రాజ్యాలు చాలవరకు సైనికాధిపత్యంలో ఉత్థాన పతనాలకు లోనైనవేనని పాకిస్థాన్ చరిత్ర కారుడు ఒకరు పేర్కొన్నారు. ఆ చిన్న రాజ్యాల పాలనా సంప్రదాయాల వారసత్వం ఆధునిక పాకిస్థాన్‌లో సైతం కొనసాగుతున్న దృష్ట్యా ప్రస్తుత పాక్‌ను 'ది ఫీల్డ్ మార్షల్ నేషన్' అనడం సత్యదూరం కాదు.

జనరల్ ఆసీమ్ మునీర్ ఈనాటి పాకిస్థాన్ సరికొత్త కథా పురుషుడు. పాకిస్థాన్ రాజ్యాంగానికి ఇటీవల జరిగిన 27వ సవరణ ఆయన 'ఫీల్డ్ మార్షల్' హోదాను ఒక రాజ్యాంగబద్ధ పదవిగా మార్చివేసింది. త్రివిధ సాయుధ బలగాలపై ఆయనకు సర్వోన్నత అధికారాలను అప్పగించింది. గత వంద సంవత్సరాల కాలంలో ఏ ఆర్మీ జనరల్‌కు లభించని అపార అధికారాలు ఆయన చేతుల్లో కేంద్రీకృతమయ్యాయి. ఈ అపూర్వ అధికార లబ్ధిని 'ప్రజాస్వామ్య బద్ధం'గా సాధించుకోవడం మునీర్ ప్రత్యేకత. జనరల్ జియా స్వప్నించిన, జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ సాధించలేకపోయిన– పౌర పాలనపై సంపూర్ణ సైనిక నియంత్రణను సాధించిన ఘనత ఈ ఫీల్డ్ మార్షల్‌ది. పాక్‌లో అధికారాన్ని కైవసం చేసుకున్న ఏ జనరల్ కూడా ప్రతిష్ఠాత్మకంగా రంగం నుంచి నిష్క్ర మించలేదు. మునీర్ కథ కూడా అప్రతిష్ఠాత్మకంగా పూర్ణ విరామానికి చేరవచ్చు. అయితే ఆ లోగా ఈ కొత్త పాక్ సైనిక నియంత నుంచి ఎదురయ్యే హానిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండి తీరాలి.

పాక్ రాజ్యాంగానికి 27వ సవరణ సర్వోన్నత అధికారాలను సైన్యానికి కట్టబెట్టడమే కాకుండా న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తినీ సమాధి చేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టుల స్వరూపస్వభావాలను పూర్తిగా మార్చివేసింది. రాజ్యాంగ సంబంధిత వివాదాలపై విచారణాధికారాలను సుప్రీంకోర్టు పరిధి నుంచి తొలగించారు. ఆ విషయాలపై విచారణకు ప్రత్యేక అధికారాలతో ఫెడరల్ కానిస్టిట్యూషనల్ కోర్టు

## ధిక్కార ధర్మం

అనే ప్రత్యేక సర్వోన్నత న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరిణామంతో హతాశులైన న్యాయవాదులు, న్యాయకోవిదులు 'ఇలాగే అంత మొందుతుంది ప్రపంచం/ దభేల్మని కాదయ్యా/ కిర్రుమని మూలుగుతూ' అన్న టి.ఎస్.ఎలియట్ మాటలను ఉటంకిస్తూ సుప్రీంకోర్టుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు! న్యాయమూర్తుల నియామకాల బాధ్యత కార్యనిర్వాహక వర్గానిదే అయినప్పటికీ సంబంధిత నిర్ణయాలను నామమాత్ర పౌర ప్రభుత్వం వెనుక సమస్త అధికారాలను చెలాయించే సైనిక పాలకుడే ప్రభావితం చేస్తాడనడంలో సందేహం లేదు.

పాకిస్థాన్ సమాజంలో మొదటి నుంచీ సైనిక పాలకులను ధైర్యంగా ధిక్కరించి, ఎదిరించి న్యాయవ్యవస్థ స్వతంత్రతను, పౌర హక్కులను కాపాడిన ప్రశస్త చరిత్ర న్యాయవాదులు, న్యాయమూర్తులకు ఉన్నది. ఆ సమున్నత ధిక్కార సంప్రదాయాన్ని పాటిస్తూ ప్రస్తుత సందర్భంలోనూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ సయ్యద్ మన్సూర్ అలీ షా, జస్టిస్ అథర్ మినల్లాలు రాజీనామా చేశారు. ఇంకా వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు కూడా రాజీనామా చేశారు. ముఖ్యంగా సీనియారిటీ దృష్ట్యా చీఫ్ జస్టిస్ అయ్యే అవకాశమున్న జస్టిస్ మన్సూర్ అలీ షా తన రాజీనామా లేఖలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు పాక్ ప్రజల మనోభావాలను ప్రతిబింబిస్తున్నాయి. '27వ రాజ్యాంగ సవరణ పాకిస్థాన్ రాజ్యాంగంపై తీవ్రమైన దాడి. అది సుప్రీంకోర్టు సర్వోన్నత ప్రాధాన్యాన్ని తీసివేసింది. న్యాయవ్యవస్థను కార్యనిర్వాహకవర్గ నియంత్రణలోకి నెట్టివేసింది. మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య హృదయాన్ని చీల్చివేసింది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఔన్నత్యానికీ, అంతిమ నిర్ణయాధికారానికీ విఘాతం కలిగించడం ద్వారా న్యాయవ్యవస్థ స్వేచ్ఛ, సమగ్రతను కాలరాచివేసి దేశాన్ని దశాబ్దాల వెనక్కి తీసుకువెళ్లింది' అని జస్టిస్ మన్సూర్ అలీ షా గర్హించారు. మన దేశంలో ఎమర్జెన్సీ సమయంలో ఒక కేసులో 'వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కు'ను కాపాడే విషయమై నిర్భయంగా మైనారిటీ తీర్పు వెలువరించి ఇప్పటికీ మన న్యాయ వ్యవస్థకు ఒక నైతిక దీపస్తంభంగా వెలుగొందుతున్న జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నాతో జస్టిస్ మన్సూర్ అలీ షాను పోల్చవచ్చు.

ధిక్కారం నేటి చైతన్య మంత్రం. ప్రపంచవ్యాప్తంగా జెన్ జడ్ తిరుగుబాట్లు, పాక్ న్యాయ వ్యవస్థలో పరిణామాలపై ఉధృతమవుతున్న పోరు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అప్రజాస్వామిక, అమానుష సంకుచితత్వాలు ప్రబలిపోతున్న నేటి ప్రపంచంలో అధికార వ్యవస్థల నిరంకుశపోకడలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం అవ్వాల్సిన కాలమిది. ధర్మాగ్రహం పునాదిగా ఎగసే ధిక్కారం నిర్మాణాత్మకంగా ఉండేలా జాగ్రత్త వహించడం ప్రజలందరి విధి.

# బిహార్ తీర్పు ఏ మార్పులకు సంకేతం?

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మీరు ఎలా పరిగణిస్తున్నారు? దేశ రాజకీయాలలో రాబోయే మార్పుల స్వరూప స్వభావాలకు చిహ్నంగానా? బిహార్ ఓటర్ల తీర్పును మీరు అలా చూడాలనే మీడియా అభిలషిస్తోంది సుమా! చకితపరిచిన, అదరగొట్టిన ఆ ప్రజా తీర్పు కేవలం ఒక రాష్ట్ర ప్రజల తీర్పు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ జైత్రయాత్ర పునరారంభానికి ఒక నాంది కూడా. ఇదిగో, ఈ సానుకూల కథనానికి ఒక విరుద్ధ దృక్కోణం కూడా ఉన్నది: ఎన్నికలు అర్థం పర్థం లేనివి. ఎన్నికలలో పాల్గొని, దగాకోరు ఎన్నికలకు శాసనసమ్మతి కల్పించడం ద్వారా ఎన్డీఏ ప్రభుత్వ నిరంకుశాధికార పాలనను మీరు సవాల్ చేయలేరని బిహార్ నిరూపించింది. ఈ రెండు అభిప్రాయాలలో సత్యమూ ఉన్నది, కట్టుకథా ఉన్నది. రాజకీయ వాస్తవికత గురించి విస్తృత, దీర్ఘకాలిక, లోతైన అవగాహనపైనే ఈ సత్యాసత్యాలు ఆధారపడి ఉన్నాయి.



■ యోగేంద్ర యాదవ్

2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశ రాజకీయ ప్రస్థానంలో 'బిహార్ అసెంబ్లీ ఎన్నికల తీర్పు ఒక ముఖ్యమైన మలుపు' అన్న భావనకు మూడు అంచనాలు ప్రాతిపదికగా ఉన్నాయి: ఒకటి– ఆ తీర్పు అనూహ్యమైనది; రెండు– ప్రబల రాజకీయ ధోరణులను విచ్ఛిన్నం చేసింది; మూడు– ఆగామి రాజకీయ పరిణామాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ మూడూ సందేహాస్పదమైనవే. నిశితంగా పరిశీలిద్దాం. తొట్ట తొలుత మనం గుర్తించవలసిన వాస్తవం: బిహార్ రాజకీయ ప్రస్థానం విశాల భారతదేశానికి కాదు కదా, ఇరుగు పొరుగు హిందీ రాష్ట్రాల రాజకీయ ప్రస్థానానికి కూడా ప్రాతినిధ్యం వహించదు. ఉత్తర భారతావనిలో ఒక సమస్థాయి భాగస్వామితో పొత్తు పెట్టుకోవడానికి బీజేపీకి తప్పనిసరి అయిన ఏకైక రాష్ట్రం బిహార్. ఆ రాష్ట్రంలోని రాజకీయాల వైచిత్రి పొరుగు రాష్ట్రమైన జార్ఖండ్‌లోనే ఏ మాత్రమూ ప్రతిబింబించదు. ఇక బెంగాల్‌ను బిహార్ ధోరణులు ప్రభావితం చేయడమనేది జరగని మాట; రెండు– బిహార్ అసెంబ్లీ ఎన్నికల తీర్పు గత ఏడాది లోక్‌సభ ఎన్నికల ఫలితాలను తారుమారు చేయలేదు. బిహార్‌లో ఎన్డీఏ తన ప్రాబల్యాన్ని కొనసాగించింది. 174 అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్డీఏ, ప్రత్యర్థి కూటమి మహాగఠ్ బంధన్ (ఎమ్‌జీబీ)పై 8 శాతం ఓట్ల ఆధిక్యతతో తిరుగులేని ముందంజలో ఉన్నది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాలు ఆ ఆధిక్యతను మరింతగా పెంచాయేకానీ ఏ మాత్రమూ తగ్గించలేదు. రాష్ట్ర శాసనసభలోని 243 సీట్లలో 202 సీట్లను కైవసం చేసుకోవడమనేది నమ్మశక్యంగా కనిపించనప్పటికీ ఎమ్‌జీబీపై 1.2 శాతం పాయింట్ల అదనపు ఓట్ల ఆధిక్యత మూలంగానే అంత అత్యధిక సంఖ్యలో సీట్లను ఎన్డీఏ గెలుచుకోగలిగింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం జరిగిన హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్షాలు ఘోరంగా ఓడిపోయాయి. ఈ దృష్ట్యా బిహార్‌ను ఆ రాష్ట్రాల సరసన చేర్చకూడదు.

బిహార్ రాజకీయాల మౌలిక వాస్తవాలను అర్థం చేసుకున్నవారికి అసెంబ్లీ ఎన్నికల తీర్పు ఊహించనిదేమీ కాదు. 2005 నుంచీ మూడు ప్రధాన పార్టీల– ఆర్‌జేడీ, జేడీ(యూ), బీజేపీ– లలో రెండు పార్టీల సంకీర్ణం, (2020లో మినహా) మంచి మెజారిటీతో గెలుస్తూ వస్తున్నది. సాధారణ వాస్తవం ఏమిటంటే ప్రత్యర్థి ఎమ్‌జీబీ కంటే ఎన్డీఏ చాలా పెద్ద రాజకీయ సంకీర్ణం. గత అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల శాతాన్ని బట్టి చూస్తే ఎన్డీఏకు 5 పాయింట్ల ఆధిక్యత ఉన్నది. ఎన్డీఏ సామాజిక సంకీర్ణం కూడా ఎమ్‌జీబీ సామాజిక సంకీర్ణం కంటే చాలా పెద్దది. 32 శాతంగా ఉన్న ఎమ్‌జీబీ ప్రధాన మద్దతుదారులు (ముస్లిం+యాదవ్), ఎన్డీఏకు 28 శాతం ప్రధాన మద్దతుదారులైన (అగ్రకులాలు+ కుర్మీ+కుష్వాహ+బనియా/ తెలి+పాశ్వాన్) సామాజిక వర్గాల కంటే అధికమే. అయితే ఎమ్‌జీబీకి సహాయక మద్దతుదారులుగా 10శాతం (మల్లా+రవిదాసి+తన్తి / పాన్) సామాజిక శ్రేణుల జన సంఖ్య, ఎన్డీఏ వైపు మొగ్గే 20 శాతం హిందూ ఈబీసీల కంటే తక్కువ. అంతేకాకుండా ఆ పదిశాతం సామాజిక శ్రేణులలో విధిగా ఎమ్‌జీబీకే ఓటు వేసే నిబద్ధత కూడా తక్కువే.

ఎన్డీఏకు మొదటి నుంచీ అనుకూలతలు ఉన్నాయనేది స్పష్టం. సామాజిక సమీకరణాలను మార్చడం లేదా సమస్త కులాల వారినీ ఆకట్టుకునే విధంగా ప్రభావదాయక ప్రచారాన్ని నిర్వహించడం ద్వారా పరిస్థితులను తనకు అనుకూలం చేసుకునే విషయంలో ఎమ్‌జీబీకి మరింత బరువు బాధ్యతలు ఉన్నాయి. ఈ దిశగా ప్రతిపక్ష కూటమి కొన్ని ప్రయత్నాలు చేయక పోలేదు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వోద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే చాలా ఆలస్యంగా ఇచ్చిన ఆ హామీలు చాలా స్వల్ప ప్రభావాన్ని మాత్రమే చూపాయి. వివిధ పెన్షన్ పథకాల కింద చెల్లించే మొత్తాలను పెంచడమే కాకుండా విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు ప్రతి మహిళకు రూ.10 వేలు చెల్లించడం ఎన్డీఏ విజయానికి విశేషంగా దోహదం చేసింది. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ తొలుత అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళా ఓటర్లను తిరుగులేని మద్దతుదారులుగా చేసుకోవడానికి చేసిన వివిధ ప్రయత్నాలు కూడా బాగా కలిసివచ్చాయి. ఈ వాస్తవాలతో పాటు నితీశ్‌కుమార్ విషయంలో ప్రభుత్వ వ్యతిరేకత తక్కువగా ఉండడం కూడా ఎన్డీఏ ఘన విజయానికి దోహదం చేసింది.




> బిహార్‌లో ప్రతిపక్షాలు ఘోరంగా ఓడిపోయాయి. భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ఆరాటపడుతున్నవారికి ఇది ఒక పెద్ద విఘాతమే. అయితే భవిష్యత్తు నిరాశాజనకంగా ఉన్నదని భావించనవసరం లేదు. పశ్చిమ బెంగాల్లో జరగనున్న ఎన్నికలు ఎన్నికల నైతికతకు మెరుగైన పరీక్షగా భావించవచ్చు. దేశ రాజకీయాలలో రాబోయే మార్పులకు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిజమైన సంకేతాలు.

రాష్ట్రీయ జనతాదళ్, కాంగ్రెస్ ప్రతి విషయంలోనూ విఫలమయ్యాయని, బీజేపీ చాలా నైపుణ్యంతో వ్యవహరించిందని మనం భావించనవసరంలేదు. తీర్పు కలిగించిన విస్మయం, దిగ్భ్రాంతి మీడియా కల్పించినవే. ఎన్డీఏ సర్కార్ మళ్లీ గెలవడంపై పలువురు విమర్శకులకు కలిగిన దిగ్భ్రాంతి సరైన ప్రతిస్పందన కాదని నేను భావిస్తున్నాను. బిహార్ పరిణామాలను సుదూర ప్రదేశాలలో ఉండి, సామాజిక మాధ్యమాల ద్వారా గమనిస్తున్న వారికి ఎమ్‌జీబీ ముందంజలో ఉన్నదనేది తప్పుడు భావనే అని చెప్పి తీరాలి. సరే, బిహార్ ఎన్నికల అంతిమ ఫలితం అనుమానాలకు తావిచ్చింది. ఈసీఐ తీరుతెన్నులలో లోపించిన విశ్వసనీయత, పాలక కూటమికి సానుకూలంగా ఎన్నికల ఫలితం ఉండేలా చేసేందుకు ప్రయత్నించడం మొదలైన కారణాలు ఆ అనుమానాలకు తావిచ్చాయి. ఆ సందేహాలతోనే కొన్ని వర్గాలు ఇప్పటికే ఎన్నికల బాయ్‌కాట్‌కు పిలుపునిచ్చాయి.

నిష్పాక్షికత లోపించిన ఎన్నికలు, మోసపూరిత ఎన్నికల మధ్య భేదాన్ని చూడవలసిన అవసరమున్నది. మన దేశంలో ఎన్నికలు ఇంకెంత మాత్రం నిష్పాక్షికంగా జరగడం లేదనడంలో సందేహం లేదు. ఎన్నికలలో పోటీ చేస్తున్న వారందరికీ సమాన అవకాశాలు కల్పించడం జరగడమే లేదు అందుకు బిహార్ ఎన్నికలే సమృద్ధమైన రుజువులు సమకూరుస్తున్నాయి. వ్యవస్థీకృత పక్షపాతం, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణతో తొలుత 68 లక్షల ఓటర్ల పేర్లు, ఆ తరువాత అదనంగా మరో 24 లక్షల మంది ఓటర్లను తొలగించడమే అందుకు నిదర్శనం. ఎన్నికల నిబంధనావళిని పాలక కూటమి భాగస్వామ్య పక్షాలు ఉల్లంఘిస్తున్నప్పటికీ ఈసీఐ ఏ విధంగానూ ఆక్షేపించలేదు. మతతత్వ ప్రచారం, అక్రమ వలసదారుల స్వాభిప్రాయ బద్ధమైన ఆరోపణలు, పోలింగ్‌కు ముందు ప్రతి మహిళా ఓటరుకు రూ.10వేలు ఇవ్వడం, ఓటర్లను తీసుకురావడానికి ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లను బీజేపీ నడపడం మొదలైన వాటిని ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. పత్రికలు, ప్రసార సాధనాలపై పాలక కూటమికి అసాధారణ నియంత్రణతో పాటు అపార ఆర్థిక వనరులు ఉండడం చూస్తే ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎందుకు జరగడం లేదో అర్థమవుతోంది. ఇటువంటి పరిస్థితులలో కూడా ప్రతిపక్షాలకు అసలు విజయావకాశాలు లేవని చెప్పలేం. అయితే అవి దుస్సాధ్యమైన కార్యాన్ని సాధించేందుకు కృతనిశ్చయంతో పూనుకోవలసి ఉన్నది. ఓటింగ్ సరళిని నేర్పుగా అనుకూలం చేసుకోవడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో జోక్యం చేసుకోవడం మొదలైనవన్నీ ఎన్నికల వంచనే. పోలింగ్‌లో పాల్గొన్న మొత్తం ఓటర్ల సంఖ్యను ఆలస్యంగా వెల్లడించడం, పోస్టల్, ఈవీఎమ్ ఓట్ల మధ్య వ్యత్యాసాలు, ఓటర్ జాబితాల నుంచి అత్యధిక ఓటర్ల తొలగింపు మొదలైనవాటిని అందుకు రుజువులుగా చూపవచ్చు. అయితే ఈ అక్రమాలకు గట్టి సాక్ష్యాధారాలు లేవు. ఈ కారణంగా ఎన్నికల వంచన జరిగిందని ఘంటాపథంగా చెప్పేందుకు బిహార్‌ను నిదర్శనంగా చెప్పలేము. ప్రతిపక్షాలు ఘోరంగా ఓడిపోయాయి. భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని ఆరాటపడుతున్నవారికి ఇది ఒక పెద్ద విఘాతమే. అయితే భవిష్యత్తు నిరాశాజనకంగా ఉన్నదని భావించనవసరం లేదు. పశ్చిమ బెంగాల్లో జరగనున్న ఎన్నికలు ఎన్నికల నైతికతకు మెరుగైన పరీక్షగా భావించవచ్చు. దేశ రాజకీయాలలో రాబోయే మార్పులకు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిజమైన సంకేతాలు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

## గ్రంథాలయాలు డిజిటల్ మెట్టు ఎక్కాల్సిందే!

ప్రతి ఏటా నవంబర్ 14 నుంచి 20 వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ, దేశంలోని పౌర గ్రంథాలయాలు నిధుల కొరత, మౌలిక సదుపాయాల లోపం, పాలనాపరమైన నిర్లక్ష్యం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. భారతదేశంలో సుమారు 6.65 లక్షల గ్రామాలు ఉన్నప్పటికీ, రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ (RRLF) లెక్కల ప్రకారం కేవలం 47,000 పబ్లిక్ లైబ్రరీలు మాత్రమే అధికారికంగా నమోదు అయ్యాయి. ఈ సంఖ్య దేశంలోని విశాలమైన జనాభాకు సమాచార, విద్యా సేవలను అందించడానికి ఏ మాత్రం సరిపోదు.

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం, 2022 IFLA–UNESCO పబ్లిక్ లైబ్రరీ మేనిఫెస్టో కనీసం ప్రతి వెయ్యిమందికి ఒక గ్రంథాలయం అవసరం. ఈ నిష్పత్తిని భారతదేశ జనాభా నేపథ్యంలో పరిశీలిస్తే, దేశానికి కనీసం 13 లక్షలకు పైగా పబ్లిక్ లైబ్రరీలు అవసరం. ప్రస్తుతం ఉన్న గ్రంథాలయాల సంఖ్యతో పోలిస్తే ఈ పరిమాణం దాదాపు 13 రెట్లు ఎక్కువ. సమాచార సమానత్వ లక్ష్యాన్ని చేరుకోవడానికి దేశం ఎంత దూరంలో ఉందన్నది ఈ వ్యత్యాసాన్ని బట్టి అర్థమవుతున్నది.

పలు ప్రపంచ దేశాలు గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని గుర్తించాయి. అమెరికా, ఫిన్లాండ్, సింగపూర్, యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు గ్రంథాలయాలను సమాజ అభ్యాస, సృజనాత్మకత కేంద్రాలుగా అభివృద్ధి చేశాయి. ఈ దేశాలలో ప్రభుత్వ బడ్జెట్‌లో గ్రంథాలయాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆ దేశ ప్రజలు లైబ్రరీలను సామాజిక పెట్టుబడిగా భావించి, వాటిని చదువుకోవడానికేగాక, విశ్రాంతి నిలయంగాను, సామాజిక చర్చా కేంద్రంగాను, సమాచారం ఇచ్చిపుచ్చుకునే స్థావరంగాను ఉపయోగిస్తారు. కానీ భారతదేశంలో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధం. ప్రజల్లో చదివే అలవాటు తగ్గి, స్మార్ట్‌ఫోన్లపైనా ఆన్‌లైన్ మీడియాపైనా ఆధారపడే సంస్కృతి పెరుగుతోంది. ముఖ్యంగా యువత పుస్తకాల కంటే ఆడియో విజువల్ కంటెంట్, యూట్యూబ్ పాఠాలు, ఇ-పుస్తకాలు వంటి డిజిటల్ వనరులను ఎక్కువగా ఆశ్రయిస్తున్నది. చాలా లైబ్రరీలు ఈ మార్పుకు సాంకేతికంగా సిద్ధంగా లేవు. ఇంటర్నెట్ సదుపాయం, వై-ఫై లేదా ఇ-రిసోర్స్ యాక్సెస్ లేకపోవడం వాటి ఆకర్షణను తగ్గిస్తోంది. దీనితో పఠన సంస్కృతి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా మాయమవుతోంది. కాబట్టి గ్రంథాలయాలు ఇప్పుడు డిజిటల్‌గా అనుసంధానం కావించబడటం చాలా ముఖ్యం.




> నేటి యువత పుస్తకాల కంటే ఆడియో విజువల్ కంటెంట్, యూట్యూబ్ పాఠాలు, ఇ-పుస్తకాలు వంటి డిజిటల్ వనరులను ఎక్కువగా ఆశ్రయిస్తున్నది. చాలా లైబ్రరీలు ఈ మార్పుకు సాంకేతికంగా సిద్ధంగా లేవు. ఇంటర్నెట్ సదుపాయం, వై-ఫై లేదా ఇ-రిసోర్స్ యాక్సెస్ లేకపోవడం వాటి ఆకర్షణను తగ్గిస్తోంది. దీనితో పఠన సంస్కృతి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా మాయమవుతోంది. కాబట్టి గ్రంథాలయాలు ఇప్పుడు డిజిటల్‌గా అనుసంధానం కావించబడటం చాలా ముఖ్యం.

2022 IFLA–UNESCO పబ్లిక్ లైబ్రరీ మానిఫెస్టో గ్రంథాలయాల కొత్త విధిని నొక్కి చెబుతూ, అవి ఆవిష్కరణ, సృజనాత్మకత, సామాజిక భాగస్వామ్యం, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో కొనసాగాలని సూచించింది. కోవిడ్-19 మహమ్మారి తర్వాత, రిమోట్ యాక్సెస్ సేవలకు, డిజిటల్ సేవలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రతి వర్గానికి సమాచార సేవలు అందించడం కీలకంగా మారింది. అయితే, భారతదేశంలోని గ్రామీణ పౌర గ్రంథాలయాలలో ఈ రకమైన దూరప్రవేశ సేవలు ఇంకా జనజీవనంలో భాగం కాలేదు.

పౌర గ్రంథాలయాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ (RRLF) నిధుల కేటాయింపులను పరిశీలిస్తే– 2019 నుంచి 2024 వరకు రూ.662 కోట్లు కేటాయించినప్పటికీ, రాష్ట్రాలు వాటిని పూర్తిగా ఉపయోగించుకోలేకపోయాయి. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్ (NML) మోడల్ లైబ్రరీ ప్రాజెక్ట్ కింద కేటాయించిన దాదాపు రూ.952 కోట్లలో రాష్ట్రాలు కేవలం రూ.405 కోట్లు మాత్రమే ఉపయోగించుకున్నాయి. అనేక రాష్ట్రాలు గ్రంథాలయ చట్టాల ద్వారా ప్రజల నుంచి గ్రంథాలయ పన్నును వసూలు చేస్తున్నప్పటికీ, ఆ నిధులను గ్రంథాలయాలకు కేటాయించడంలో విఫలమవుతున్నాయి. ఉదాహరణకు, తెలంగాణ రాష్ట్రం దాదాపు రూ.1000 కోట్లు, కర్ణాటక రూ.300 కోట్లు, మహారాష్ట్ర రూ.800 కోట్లు గ్రంథాలయాలకు బాకీ ఉన్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో పౌర గ్రంథాలయాలు సంక్షోభ స్థితికి చేరుకున్నాయి.

ఈ సమస్యలకు పరిష్కారంగా బహుముఖ ప్రయత్నాలు అవసరం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, సంస్కృతి, సమాచార శాఖల బడ్జెట్‌లో కనీసం 1 శాతాన్ని గ్రంథాలయ అభివృద్ధికి కేటాయించాలి. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (PPP) నిధులు, CSR నిధుల ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధిని, సాంకేతిక అప్‌గ్రేడ్‌లను చేపట్టాలి. ప్రతి జిల్లా లైబ్రరీని ఒక డిజిటల్ హబ్‌గా మార్చి, ఆన్‌లైన్ లెర్నింగ్‌ను ఏర్పాటు చేయాలి. స్థానిక భాషా వనరులను అందుబాటులో ఉంచాలి. బుక్ క్లబ్‌లు, రచయితలతో చర్చలు, కెరీర్ మార్గదర్శకత్వం వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా గ్రంథాలయాలను సమాజ కేంద్రాలుగా మార్చాలి. తగిన వెలుతురు, సౌకర్యవంతమైన కుర్చీలు, ఎయిర్ కండీషనింగ్, వేగవంతమైన వై-ఫైతో కూడిన ఆధునిక భవనాలను ఏర్పాటు చేయాలి. గ్రంథాలయాలు మల్టీపర్పస్ సెంటర్లుగా (బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, బీచ్‌లలో) కూడా విస్తరించాలి.

"పుస్తకాలు మనిషి శక్తిని, స్వేచ్ఛను పెంచే ఆయుధాలు" అంటారు బి.ఆర్ అంబేడ్కర్. ఈ దృక్పథంతో, భారతదేశం తన గ్రంథాలయ వ్యవస్థను పునరుద్ధరించుకోవాలి. ప్రజా గ్రంథాలయాల పునరుద్ధరణ కేవలం విద్యాపరమైన అవసరం మాత్రమే కాదు, సమాన అభ్యాస అవకాశాలపై ఆధారపడిన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అత్యవసరం.

• రవి కుమార్ చేగొని
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం

(జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా)

## నైపుణ్యం కలిగిన వృత్తులకే భవిష్యత్తు

'దశాబ్దాలుగా మన సమాజం 'డెస్క్ ఉద్యోగాలే గొప్పవి' అనే భ్రమలో జీవించింది. కానీ ఇప్పుడు ఏఐ తెచ్చిన మార్పులు ఆ భ్రమను చెరిపేస్తున్నాయి' అంటూ ఆనంద్ మహీంద్రా తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఏఐతో భర్తీ చేయడం సాధ్యం కానివి నైపుణ్యం కలిగిన వృత్తులు. ప్లంబర్ చేతితో సరిచేసే లీకేజీలు, ఎలక్ట్రీషియన్ పరిష్కరించే వైరింగ్ సమస్యలు, మెకానిక్ స్వయంగా గుర్తించే లోపాలు... వంటివి పుస్తకాల్లో నేర్చుకునే సిద్ధాంతాలు కావు. ఇవి ఏఐ ఆల్గారిథమ్‌లు పరిష్కరించలేని పనులు! 'చూడగానే సమస్యను అర్థం చేసుకోవడం, దానికి తక్షణ పరిష్కారం కనుగొనడ'మనే ఈ సహజ బుద్ధి, అనుభవశక్తి, హస్త కౌశలం యాంత్రీకరణకు సాధ్యం కాదు.

ఫోర్డ్‌లో ప్రస్తుతం 5వేల మెకానిక్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో ఉద్యోగానికి సంవత్సరానికి 1,20,000 డాలర్ల వరకు జీతం ఇస్తున్నా, సరైన నైపుణ్యం కలిగినవారు దొరకడం లేదు' అని ఫోర్డ్ మోటార్స్ సీఈఓ జిమ్‌ఫార్లీ అనడం చూస్తే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. '2030 నాటికి కేవలం తయారీ రంగంలోనే 21 లక్షల ఉద్యోగాలు భర్తీ కాకుండా మిగిలిపోతాయి' అంటూ డెలాయిట్– మాన్యుఫ్యాక్చరింగ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం ఇప్పటికే హెచ్చరించింది. దాంతో వచ్చే ఆర్థిక నష్టం 1 ట్రిలియన్ డాలర్లు అని తెలిపింది. ఇది కేవలం అమెరికాకు మాత్రమే కాదు, ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన సంకేతం.

ఈ పరిస్థితిని అధిగమించడానికి మన దేశంలో చేయాల్సినవి: ప్రైమరీ నుంచి యూజీ వరకూ అన్ని స్థాయిల్లో వృత్తి శిక్షణను తప్పనిసరి చేయాలి. ఐటీఐలు, పాలిటెక్నిక్‌లలో ప్రపంచ స్థాయి ప్రమాణాలు వృద్ధి చేయాలి. జర్మనీ, జపాన్ వంటి దేశాల వలే నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని గౌరవించడం మనమూ నేర్చుకోవాలి. నైపుణ్యం కలిగిన కార్మికులను ప్రోత్సహించేందుకు మెరుగైన వేతనాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, కెరీర్ గ్రేడేషన్.. వంటివి అందించడం ద్వారా యువతను ఈ రంగం వైపు ఆకర్షించాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఏఐ ఒక పెద్ద సవాల్. కానీ నైపుణ్య వృత్తులకు కాదు. వృత్తి నైపుణ్యం గలవారు లేకుండా ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగదు. విద్యా వ్యవస్థ, ప్రభుత్వం, తల్లిదండ్రులు.. అందరూ ఒక కొత్త దృక్పథాన్ని స్వీకరించాల్సిన సమయం ఇది.

– ముద్దం నరసింహస్వామి

# అమెరికాలో మొలకెత్తిన సోషలిస్ట్ ఆశలు

పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకు ప్రపంచ రాజధానిగా భావించే న్యూయార్క్ నగరానికి మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ విజయఢంకా మోగించడంతో ప్రపంచ పెట్టుబడిదారుల ఆశలు అడియాశలయ్యాయి. ఆయన తనను తాను డెమొక్రటిక్ సోషలిస్టును అని ముందుగానే ప్రకటించుకుని ఎన్నికల రణరంగంలోకి రావడంతో పెట్టుబడిదారులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ సహా వేలాది కార్పొరేట్ శక్తులు జోహ్రాన్‌కు వ్యతిరేకంగా నిలబడ్డాయి. జోహ్రాన్ గెలిస్తే నగరాన్ని వదిలేసి వెళ్లిపోతామని వేలమంది పెట్టుబడిదారులు ఉక్రోషం వెళ్లగక్కారు.

పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ వేళ్లూనుకున్న అమెరికాలో తనను తాను సోషలిస్ట్ అని జోహ్రాన్ ప్రకటించుకోవటం ఆషామాషీ కాదు. ఇటువంటి నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితికి అక్కడి సమాజమే పురిగొల్పింది. ట్రంప్ పరిపాలన దేశంలో తీవ్ర అసమానతలకు దారితీసింది. దేశంలోని అధిక సంపన్నులకు అనుకూలంగా పన్ను సంస్కరణలను ట్రంప్ మొదలుపెట్టారు. వీటి ఫలితంగా 2027 నాటికి అత్యధిక ఆదాయం ఉన్న 0.1శాతం మంది చెల్లించే పన్నుల్లో నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంలో 3,11,000 యూఎస్ డాలర్లు తగ్గుతాయి. ఈ లోటు తీరేందుకు నెలకు 15వేల డాలర్ల కన్నా తక్కువ ఆదాయం గల కుటుంబాలపైనే పన్ను భారం పడుతుంది. ఇదంతా ఒక శాతం బిలియనీర్లను మరింత సంపన్నులుగా మార్చే ప్రక్రియలో భాగమే. ఈ అంశం కష్టించి పనిచేసే శ్రామిక వర్గంపై పెద్ద ప్రభావాన్ని చూపింది.

సామాజిక భద్రతకు పెట్టాల్సిన ఖర్చుల్లోనూ ట్రంప్ ప్రభుత్వం భారీ కోత విధించింది. ప్రజల సంక్షేమం కంటే లాభాలకే ట్రంప్ ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. కార్పొరేట్ కాలుష్య కారకాల నియంత్రణను తొలగించారు. ప్రజా సేవలను ప్రైవేటీకరిస్తున్నారు. ఈ విధానాల కారణంగా అమెరికాలోని పదిమంది అత్యంత ధనవంతులైన బిలియనీర్లు 698 బిలియన్ డాలర్ల సంపదను పొందారు. ట్రంప్ విధానాలతో పాటు దశాబ్దాలుగా అమెరికా ఇతర పాలకులు అనుసరించిన పెట్టుబడిదారీ విధానాలపట్ల కూడా అక్కడి యువతలో నిరాసక్తత వ్యక్తమవుతూనే వస్తున్నది. 'ఫ్రీ మార్కెట్‌కు మద్దతు' పేరుతో పాలకులు అనుసరిస్తున్న విధానాల కారణంగా అమెరికా సమాజంపైనా, పాలకులపైనా కొద్దిమంది కార్పొరేట్ పెట్టుబడిదారులు ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారన్న సంగతిని అక్కడి ప్రజలు గ్రహించారు.

తమ దేశంలో కొనసాగుతున్న ఆర్థిక మాంద్యాన్ని నివారించడం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని అమ్ముకునేందుకు యుద్ధాలను ప్రోత్సహిస్తున్నారన్న నిజాన్ని అమెరికా పౌరసమాజం గ్రహించింది. తన మాట వినని దేశాలపై భారీగా సుంకాలు విధించటాన్ని అక్కడి పౌర సమాజం బహిరంగంగానే వ్యతిరేకించింది. సరిగ్గా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు అమెరికాలోని పేదల ఆకలి కేకలు మిన్నంటాయి. ట్రంప్ విధానాల కారణంగానే ప్రభుత్వం నుంచి తమకు అందే సంక్షేమ పథకాల నిధులు నిలిచిపోయాయన్న ఆగ్రహం పేదల్లో వ్యక్తమైంది. అమెరికాలో 'సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్' (ఎస్ఎన్ఏపీ) కింద ప్రభుత్వం నుంచి సుమారు 4.2 కోట్ల మంది ప్రతి నెల 200 నుంచి 900 డాలర్ల వరకూ ఆర్థిక సాయం అందుకుంటున్నారంటే ఆ దేశంలో పేదరికం ఏ స్థాయిలో ఉన్నదో గ్రహించవచ్చు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన బడ్జెట్‌ను అక్కడి చట్టసభ ఆమోదించకపోవడంతో ప్రభుత్వంలో ప్రతిష్టంభన (షట్‌డౌన్) పరిస్థితి నెలకొన్నది. లోపభూయిష్టంగా ఉన్న బడ్జెట్‌లోని వివిధ అంశాలను మార్పు చేయాల్సిన పరిస్థితి ఉండడంతో, అత్యవసర ఖర్చులకు మినహా ప్రభుత్వం ఎలాంటి వ్యయం చేసే వీల్లేకుండా పోవడంతో అమెరికన్ పేదల ఆకలి కేకలు ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఎన్నికల ఫలితాల అనంతరం డొనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని బహిరంగంగానే అంగీకరించారు.


> పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు తమను ఆర్థిక సంక్షోభాల నుంచి గట్టెక్కించే స్థితిలో లేవని అమెరికాలోని కొత్త తరం గ్రహించింది. నిరుద్యోగం, పేదరికం తీవ్రమయ్యాయి, ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయి, వేతనాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిస్టు విధానాలే ప్రత్యామ్నాయమని గుర్తించి అమెరికా యువత సోషలిజం వైపు మొగ్గు చూపడం ప్రారంభించింది. ఇదే తరుణంలో జరిగిన ఎన్నికల్లో సోషలిస్టునని చెప్పుకున్న జోహ్రాన్ పట్ల అనూహ్యమైన సానుకూలత వ్యక్తమైంది.



పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు తమను ఆర్థిక సంక్షోభాల నుంచి గట్టెక్కించే స్థితిలో లేవని అమెరికాలోని కొత్తతరం గ్రహించింది. నిరుద్యోగం, పేదరికం తీవ్రమయ్యాయి, ఉపాధి కోసం వలసలు పెరుగుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూ ఉంటే కార్మిక వర్గానికి దక్కుతున్న వేతనాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు సోషలిస్టు విధానాలే ప్రత్యామ్నాయమని గుర్తించి అమెరికా యువత సోషలిజం వైపు మొగ్గు చూపడం ప్రారంభించింది. ఇదే తరుణంలో జరిగిన ఎన్నికల్లో సోషలిస్టునని చెప్పుకున్న జోహ్రాన్ పట్ల అనూహ్యమైన స్పందన వ్యక్తమైంది.

జోహ్రాన్ తన ప్రచారంలో ప్రజలకు అత్యవసరమైన అంశాలపైనే దృష్టి పెట్టారు. తక్కువ ఖర్చుతో గృహవసతి, ప్రజా ఆరోగ్యం, కార్మిక హక్కులు, వలసదారుల రక్షణ, ఆర్థిక అసమానతల నిర్మూలన, విద్యలో సమాన అవకాశాలు... అంటూ తన ప్రచారాన్ని నిర్వహించారు. డెమొక్రటిక్ పార్టీ గతంలో ఎన్నడూ లేవనెత్తని అంశాలను ప్రచారానికి వాడుకున్నారు. కార్పొరేట్ వ్యవస్థకు భజన చేయకుండా సోషలిజం ఆలోచనా స్రవంతిలోని అందరికీ విద్య, ఉపాధి, నివాసం, ఆరోగ్యం కల్పిస్తూ; అసమానతలు, అణచివేత, జాత్యాహంకారం లేని వ్యవస్థ నిర్మాణానికి సిద్ధమని ప్రకటన చేశాడు. అత్యంత సంపన్నుల సంపదపై పన్నులు వేయడం ద్వారా తన హామీలను అమలు చేస్తాననీ పేర్కొన్నాడు. ఇవన్నీ సోషలిస్టు ఆలోచనలే కావడంతో న్యూయార్క్ పౌరులు జోహ్రాన్ వైపు నిలబడ్డారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయమే లేదని ఆ వర్గానికి చెందిన ఆర్థికవేత్తలు, మేధావులు ఢంకా బజాయిస్తున్న తరుణంలో సోషలిజం అనే ఒక బలమైన ప్రత్యామ్నాయం ఉందని జోహ్రాన్ ఎన్నిక నిరూపించింది. కారుచీకటిలో వెలుగు రేఖలా అమెరికాలో ఆశాకిరణాలు ప్రసరించాయి. జోహ్రాన్ చేతల్లో నిరూపించుకుంటే, అమెరికా వ్యాప్తంగా సోషలిస్టు వ్యవస్థలు బలపడటం తథ్యం!


■ సి.ఎన్. క్షేత్రపాల్‌రెడ్డి



# ఆ కాంట్రాక్టర్ ఎవరు?

కానూరు కొత్త ఆటోనగర్‌లోని భవనంలో మావోయిస్టులకు ఆశ్రయం కల్పించింది ఎవరు? కూలీల కోసమని మూడో అంతస్తును అద్దెకు తీసుకున్న ఆ వ్యక్తి ఎవరు? సదరు కాంట్రాక్టర్‌కు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయా? అనే అనేక సందేహాలు కలుగుతున్నాయి. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్ పరారీలో ఉండగా, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టు షెల్టర్ ఏర్పాటులో కొత్తకోణం



## భవనం మూడో అంతస్థును అద్దెకు తీసుకున్న ఓ కాంట్రాక్టర్

- కన్‌స్ట్రక్షన్ పనికోసం కూలీలు వస్తున్నారని మేనేజర్‌కు సమాచారం
- అడ్వాన్స్ కూడా అతడే చెల్లింపు.. ప్రస్తుతం పరార్
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

**(ఆంధ్రజ్యోతి-విజయవాడ) :** కానూరులోని కొత్త ఆటోనగర్‌లో జీప్లస్‌త్రీ భవనంలో మావోయిస్టులు ఆశ్రయం పొందిన వ్యవహారంలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. ఖాళీగా ఉన్న మూడో అంతస్తును ఓ కాంట్రాక్టర్ అద్దెకు తీసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు ఆ కాంట్రాక్టర్ ఎవరన్న విషయాన్ని వెలుగులోకి తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం 28 మంది మావోయిస్టులు ఈ భవనం మూడో అంతస్తులో ఆశ్రయం పొందిన విషయం తెలిసిందే. అసలు వారంతా ఈ భవనంలోకి ఎలా వచ్చారన్న దానిపై భిన్నవాదనలు వినిపించాయి. తొలుత కూలీలు వాచ్‌మన్‌తో మిలాఖత్ అయి ఇక్కడ ఆశ్రయం ఇప్పించారన్న వాదనలు వినిపించాయి. దీనిపై లోతుగా పరిశీలించిన పోలీసులు ఒక కాంట్రాక్టర్ 20 రోజుల క్రితం మూడో అంతస్తును అద్దెకు తీసుకున్నట్టు తేలింది. తాను త్వరలో ప్రారంభించబోయే కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టులో పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారని.. భవన బాధ్యతలను చూస్తున్న మేనేజర్‌కు చెప్పినట్టు తెలిసింది. దీంతో ఇదంతా వాస్తవమేనని మేనేజర్ భావించారు. దీనికి అడ్వాన్స్ ఆ కాంట్రాక్టరే మిగతా 6లో..

### ప్రసాదంపాడు షెల్టర్ వెనుక సానుభూతిపరుడు?

పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రసాదంపాడులో ఓ ఇంట్లో మావోయిస్టులు తలదాచుకోవడం వెనుక సానుభూతిపరుడు ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. అదే గ్రామానికి చెందిన రవి అనే సానుభూతిపరుడు పొడియా భీమా, మడకం లక్మ, మడవి చిన్మయ్, మంగి డొక్కుపాడి అనే మావోయిస్టులను ఇక్కడికి తీసుకొచ్చినట్టు తెలిసింది. వారికి విజయ ఆగ్రో మిల్లు రోడ్డులో ఇంట్లో పెట్టాడు. వారికి ఇంటిని అద్దెకు ఇప్పించడంలో రవి కీలకంగా వ్యవహరించినట్టు తేలింది. ఈ నలుగురు మావోయిస్టులను అదుపులోకి తీసుకోగానే రవి పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### షాక్‌లోనే న్యూ ఆటోనగర్!

- మా సెల్‌ఫోన్లు తీసుకున్నారు.. ఏం జరుగుతుందో అర్థం కాలేదు
- తేరుకునేలోపే.. మావోయిస్టులను కిందకు తీసుకొచ్చారు
- మా చెంతనే మావోయిస్టులు ఉన్నారంటే.. నమ్మలేకపోతున్నాం..
- 'ఆంధ్రజ్యోతి'తో న్యూ ఆటోనగర్ కార్మికుల అంతరంగం

6

# ప్రతిఘటించి ఉంటే..

## కొత్త ఆటోనగర్‌లో భయాందోళనలు

- తుపాకులు, ఆయుధాలతో మావోలు
- ఎదురుగా బంకు, పక్కనే ఆయిల్ కంపెనీ
- ప్రతిఘటించి ఉంటే భారీ నష్టమే..
- లొంగిపోవడంతో తప్పిన ప్రమాదం

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) :** అరెస్టు సమయంలో మావోయిస్టులు పోలీసులను ప్రతిఘటిస్తే పెద్ద విధ్వంసమే జరిగేదా? అంటే.. అవుననే సమాధానమే వస్తుంది. కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందిన మారుతి బిల్డింగ్ చుట్టూ అనేక కంపెనీలు ఉన్నాయి. రోడ్డుకు పడమర దిక్కున ఉండే ఈ భవనాన్ని ఆనుకుని ఎడమవైపు ఏసీ బాక్సుల తయారీ యూనిట్, కుడివైపు మౌల్డింగ్ యూనిట్ ఉన్నాయి. రోడ్డుకు అవతలి వైపున, భవనానికి ఎదురుగా మౌల్డింగ్ యూనిట్ ఉంది. ఈ యూనిట్‌ను ఆనుకునే పెట్రోల్ బంక్ ఉంది. భవనానికి కొంచెం దూరంలో మిగతా 6లో..

# పోలీస్ పహారా

## కొత్త ఆటోనగర్‌లో రెండోరోజూ గస్తీ

- నిర్మానుష్యంగా రోడ్లు.. స్థానికుల భయాందోళన
- ఇండస్ట్రియల్ ఏరియాలో సీసీ కెమెరాలు నిల్

**కానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :** కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకున్న జీప్లస్‌త్రీ భవనం బుధవారం కూడా పోలీస్ పహారాలోనే ఉండిపోయింది. ఒక ఏఎస్‌ఐ పర్యవేక్షణలో సుమారు 15 మంది సిబ్బంది గస్తీ కాస్తున్నారు. భవనం పరిసరాలకు ఎవరినీ రానివ్వలేదు. దీంతో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది.

**ఇలా నిఘా నేత్రాలు ఎక్కడ?**

సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటైన కానూరు న్యూఆటోనగర్‌లో నేటి వరకు ఐలా సర్వీస్ సొసైటీ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటుచేయలేదు. 744 వరకు వివిధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్న కార్మికవాడలో మిగతా 6లో..

నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలోని ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఆఫ్ అవుట్‌సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్) కారుణ్య నియామకాల్లో అవినీతి జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. కాసులిచ్చిన వారికి కొత్తగా నియామకాలు ఇచ్చారని ఫిర్యాదులు అందుతున్నాయి.

# కారుణ్య నియామకాల్లో కనికట్టు

## ప్రజారోగ్య విభాగంపై ఫిర్యాదులు.. అవినీతి ఆరోపణలు

- నిబంధనలను ఉల్లంఘించి కొత్తవారికి ఉద్యోగాలు
- మరణించిన వారి కుటుంబాలకు కాకుండా..
- వారి దగ్గరి బంధువులకు, ఇంటి పేరు ఉన్నవాళ్లకు విధులు
- రూ.లక్షల్లో వసూలు చేసిన ఉద్యోగులు
- కారుణ్య నియామకాల అక్రమాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదులు



**కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :** నగరపాలక సంస్థలోని ఆప్కాస్‌లో పనిచేస్తూ విధినిర్వహణలో మరణిస్తే కారుణ్య నియామకం కింద ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తారు. కానీ, ప్రజారోగ్య విభాగంలోని అధికారులు కాసులకు కక్కుర్తిపడి మరణించిన వారి కుటుంబ సభ్యులకు కాకుండా వారి బంధువులకు ఉద్యోగాలు ఇప్పించి రూ.లక్షల్లో దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏప్రిల్‌లో 36 మందిని, సెప్టెంబరులో 39 మందిని కారుణ్య నియామకాల కింద తీసుకున్నారు. వాటిలో సుమారు 10 నుంచి 15 మందిని బంధువులు, చనిపోయినవారి ఇంటిపేరుకు దగ్గర ఉన్న వారిని నియమించినట్లు తెలిసింది. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందాయి.

**ఆ సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి : విజిలెన్స్‌కు ఫిర్యాదు**

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడుతున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మిగతా 6లో..

### ప్రతి పనికీ ఓ రేటు

ప్రజారోగ్య విభాగంలో ఏ పని కావాలన్నా పైసలు ఇవాల్సిందేనని వీఎంసీలో బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. నగరపాలక సంస్థలో సుమారు 3,400 మంది ఆప్కాస్ సిబ్బంది పారిశుధ్య విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో నిత్యం వందలాది మంది ఏదో ఒక పనిపై ప్రజారోగ్య విభాగానికి వస్తుంటారు. కానీ, ఈ విభాగంలో పైసలిస్తేనే ఏ పనైనా అవుతుందని, లేకపోతే సెక్షన్ చుట్టూ తిప్పుకొంటారనే ఆరోపణలు ఉన్నాయి. పర్మినెంట్ ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణం. ఉద్యోగ విరమణ చేసినా, ఇతర ఏ ప్రయోజనం పొందాలన్నా ఫైల్ కదలాలంటే పైసలు ఇవ్వాల్సిందే. ఈ విభాగంపై ఎన్ని విమర్శలు వచ్చినా కమిషనర్, పైస్థాయి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆటోనగర్‌లో అరాచకాలు సాగుతున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద ఆటోనగర్‌గా ఖ్యాతికెక్కిన జవహర్ ఆటోనగర్, ఆ తర్వాత ఏర్పడిన కానూరు ఆటోనగర్ (కొత్త)లో సంఘ వ్యతిరేక కార్యక్రమాలు ఎక్కువవుతున్నాయి. వాహనాల ట్యాంపరింగ్‌తో పాటు భారీ కుంభకోణాలు, అక్రమాలు, తాజాగా మావోయిస్టుల కదలికలతో ఈ ప్రాంత ఖ్యాతి నానాటికీ దిగజారిపోతోంది.

# ఆటోనగర్‌లో అరాచకాలు

## వాహనాల బాడీబిల్డింగ్‌లో నిబంధనల ఉల్లంఘన

- ఇప్పటికే వాహనాల ట్యాంపరింగ్ ఆరోపణలు
- సాధారణ బస్సులకు స్లీపర్‌గా మార్పులు చేర్పులు
- టిప్పర్లలో రహస్య చాంబర్లు.. డ్రగ్స్ రవాణాకు ఊతం
- ఆయిల్ ట్యాంకర్లనూ మార్చేస్తున్నారు
- తాజాగా కొత్త ఆటోనగర్‌లో మావో కదలికలు
- నానాటికీ దిగజారుతున్న ఆటోనగర్ ఖ్యాతి

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** జవహర్ ఆటోనగర్, కానూరు ఆటోనగర్ (కొత్త) రెండూ ఒకదానిని ఒకటి ఆనుకుని ఉంటాయి. పాత ఆటోనగర్ చుట్టూ జనావాస ప్రాంతాలు విస్తరించటంతో కానూరువైపు కొత్త ఆటోనగర్ విస్తరించింది. ఈ రెండు ఆటోనగర్‌లలో వాహనాల బాడీబిల్డింగ్ ప్రధానమైనది. లారీలు, బస్సుల చాసిస్‌లకు ఇక్కడ బాడీబిల్డింగ్ జరుగుతుంది. బాడీబిల్డింగ్ జరిగే క్రమంలో మోటారు వాహనాల చట్టాన్ని అనుసరించి నిర్దేశించిన విధంగానే మార్పులు చేయాలి. కానీ, కాసులకు కక్కుర్తి పడిన కొందరు వ్యాపారులు బాడీబిల్డింగ్ అర్థాన్నే మార్చేశారు.

**బాడీబిల్డింగ్‌లో రహస్య చాంబర్లు**

బాడీబిల్డింగ్ నిబంధనలను ఉల్లంఘించి రహస్య చాంబర్లను ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. ట్యాంకర్ల బాడీబిల్డింగ్‌ను కూడా రహస్య చాంబర్లతో మార్చేస్తున్నారు. ఆయిల్ కంపెనీలు కూడా తనిఖీలు చేసిన ఉదంతాలు ఉన్నాయి. టిప్పర్లలో రహస్య చాంబర్లు ఏర్పాటుచేసి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఘటన గత మంగళవారం బయటపడింది. నేరగాళ్లకు కానూరు ఆటోనగర్‌లోని ఓ బాడీబిల్డింగ్ యూనిట్ సహకరించిందని తెలుస్తోంది. దీనిద్వారా రెండేళ్లుగా ఎవరికీ అనుమానం రాకుండా అక్రమ రవాణా సాఫీగా సాగిపోతోంది.



**సాధారణ బస్సులను స్లీపర్లుగా..**

ఆటోనగర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా బాడీబిల్డింగ్ చేస్తున్నారు. సాధారణ బస్సులను స్లీపర్ బస్సులుగా మారుస్తున్న ఘటనలు ఇటీవల బయటపడ్డాయి. కరోనా సమయంలో ప్రైవేట్ బస్సులకు అనుమతి లేని సందర్భంలో కొన్ని బస్సులకు సెమీ స్లీపర్‌గా, పూర్తి స్లీపర్‌గా బాడీబిల్డింగ్‌ను మార్చారు. సాధారణ బస్సులను స్లీపర్లుగా మార్చటం ద్వారా ప్రైవేట్ ఆపరేటర్లు లాభాలను ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

**చాసిస్ నెంబర్ల ట్యాంపరింగ్.. లేని వాహనాలు ఉన్నట్టుగా..**

వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరానికి చెందిన రవాణా మాఫియా కేంద్ర ప్రభుత్వ వాహన్ పోర్టల్‌ను ట్యాంపరింగ్ చేసింది. అరుణాచల్‌ప్రదేశ్ వంటి ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ అయినట్టుగా వాహన్ మిగతా 6లో..

# రెచ్చిపోతున్న రేషన్ డాన్



## నియోజకవర్గానికో డాన్‌తో రేషన్ మాఫియా

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీగా బియ్యం వ్యాపారం
- డీలర్లంతా డాన్లకే అమ్మాలి.. లేకపోతే దాడులే
- కొందరు ప్రజాప్రతినిధులకు రూ.లక్షల్లో మామూళ్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ రాజకీయ రేషన్ డాన్‌ల చేతుల్లోకి వెళ్లింది. నియోజకవర్గానికో డాన్ ఎదుగుతున్నాడు. పేదలకిచ్చే నిత్యావసరాలను గద్దల్లా తన్నుకుపోతున్నారు. విజయవాడ, మచిలీపట్నం సహా జయంతి, విస్సన్నపేట, తిరువూరు, గన్నవరం, గుడివాడలోని సిండికేట్ వ్యాపారులు ఈ డాన్‌లకు భయపడి వ్యాపారాలను తగ్గించుకునే పరిస్థితికి వచ్చారు.

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక రాజకీయ రేషన్ డాన్ ఆధీనంలో పేదల బియ్యం వ్యాపారం నడుస్తోంది. ఈ వ్యాపారం ఏ స్థాయిలో నడుస్తోందంటే.. నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధులకూ నెలవారీగా ఫిక్స్‌డ్ రేటు చెల్లించి వ్యాపారాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా నడిపిస్తున్నారు. నెలవారీగా రూ.ఏడు లక్షల నుంచి రూ.తొమ్మిది లక్షల చొప్పున రేషన్ డాన్లు కొందరు ప్రజాప్రతినిధులకు వాటాలు చెల్లిస్తున్నారంటే ఏ మేరకు వ్యాపారం జరుగుతుందో అర్థమవుతుంది. ప్రజాప్రతినిధులకు వాటాలు ఇవ్వటం ద్వారా సివిల్ సప్లయిస్ అధికారులు నోరు మెదపలేరు. పోలీసులు కన్నెత్తి చూడరు. విజిలెన్స్ అంతకన్నా పట్టించుకోదని తెలుసుకుని అడిగినంత ముట్టజెబుతున్నారు. మిగతా 6లో..

**సరిహద్దులు దాటిపోతున్న సరుకు**

పేదల బియ్యాన్ని డీలర్ల నుంచి కొన్నాక వ్యవస్థలను అడ్డం పెట్టుకుని అవలీలగా సరిహద్దులు దాటించేస్తున్నారు. కాకినాడ పోర్టుకు కొంత, ముంబయి పోర్టుకు కొంతమేర తరలిస్తున్నారు. ఫిలిప్పైన్స్ దేశంలో పీడీఎస్ బియ్యానికి ధర ఎక్కువగా పలుకుతుండటంతో డాన్లు స్వేచ్ఛగా పోర్టులకు తరలిస్తున్నారు. పెద్దమొత్తంలో రేషన్ బియ్యాన్ని ఇటీవల కాలంలో పట్టుకోకపోవటం వెనుక డాన్లు వ్యవస్థలను చేతుల్లోకి తీసుకోవడమే కారణం. కేసుల కోసం చిన్నాచితకా వ్యాపారులపై దాడులు చేయటం తప్ప, అసలైన డాన్ల జోలికి వెళ్లట్లేదు.

అన్నదాత సుఖీభవ లబ్ధి పొందిన రైతులతో దేవినేని ఉమా



# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఆర్థిక భరోసాగా అన్నదాత సుఖీభవ
- మాజీ మంత్రి దేవినేని ఉమా

**విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :** రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు రైతులకు భరోసా కల్పిస్తున్నాయని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ఏ ఒక్క రైతూ నష్టపోకూడదనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పించడమే కాకుండా, వారి కష్టాలను తగ్గించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ రెండో విడతలో భాగంగా 46.85 లక్షల మంది రైతులకు రూ.3,135 కోట్లు సాయంగా జమ చేశామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్)తో కలిపి అమలు చేస్తున్నామన్నారు.

**ప్రభుత్వ కేంద్రాలు ఉపయోగించాలి**

రైతులు ఆరు నెలలు కష్టపడి పండించిన పంటలు దళారుల చేతిలో మోసపోకూడదని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనాలని మిగతా 6లో..

ఉచిత బస్సులో టికెట్ అడుగుతావా?

- ఎస్ఎం పేటలో ఆర్టీసీ కండక్టర్‌పై దాడి
- నేడు డిపోలో కార్మికుల ఆందోళన

6

కొండపల్లి ఎర్రబ్రిడ్జి విస్తరణ ప్రారంభం

- నాలుగు లైన్లుగా అభివృద్ధి
- దశాబ్ద కాలం తర్వాత రెండోవైపు ఎత్తు పెంపు
- కొండపల్లి రైల్వేస్టేషన్‌కు అండర్‌పాస్‌ల ఏర్పాటు

6

కొరియాను ఓడించడం భారత ఆర్చరీ చరిత్రలో మైలురాయి

- భారత్ ఆర్చర్ బొమ్మదేవర

8



మహామండపం దిగువన, కనకదుర్గానగర్‌లో భవానీదీక్షల విరమణల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో, ఏడీసీపీ, అధికారులు

## ఇంద్రకీలాద్రిపై హోమగుండాల పరిశీలన

» భవానీల దీక్ష విరమణకు అన్ని వసతులు కల్పిస్తాం : ఈవో

ఇంద్రకీలాద్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో డిసెంబరు 11 నుంచి 15వరకు జరగనున్న భవానీదీక్షల విరమణలను పురస్కరించుకుని భవానీలకు ఏర్పాటు చేయనున్న హోమగుండాలు, ఇరుముడుల పాయింట్ కౌంటర్లను బుధవారం ఈవో శీనానాయక్, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణలు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహామండపం దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం ఎదురుగా ఒక హోమగుండం, నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ ప్రసాదం తయారీ భవనం పక్కన మరొక హోమగుండం, కనకదుర్గానగర్‌లో ఉన్న షాపులు ఎదురుగా ఇంకొక హోమగుండం ఏర్పాటు చేయనున్నట్టు ఈవో, ఇంజనీరింగ్ అధికారులు ఏడీసీపీకి వివరించారు. ఇరుముడుల పాయింట్ల కౌంటర్లను మహామండపం దిగువన రేకుల షెడ్డు కింద ఏర్పాటు చేస్తున్నట్టు పోలీసు అధికారులకు తెలిపారు. భక్తులు, భవానీలకు ఎలివేటెడ్ క్యూలైన్ల కింద బఫే విధానంలో అన్న ప్రసాదం పంపిణీ ఏర్పాటు చేయనున్నట్టు ఈవో ఏడీసీపీకి వివరించారు. అనంతరం ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటును అధికారులు పరిశీలించారు. ఈనెల 20న గురువారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, మునిసిపల్ ఉన్నతాధికారులు, ఇతర విభాగాల అధికారులతో కలిసి భవానీదీక్షల విరమణల ఏర్పాట్లను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నట్టు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇంజనీరింగ్ అధికారులు వెస్ట్ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ తదితరులు ఉన్నారు.

## అమ్మ సన్నిధిలో ఇష్టారాజ్యానికి చెక్!

» విధుల నుంచి నాయక్ సోదరుల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



రమేష్ నాయక్



రాజేష్ నాయక్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తు భక్తులపై దాడికి పాల్పడుతున్న, సెక్యూరిటీ సిబ్బంది అటెండెన్స్‌లో అవకతవకలకు పాల్పడుతన్న నాయక్ సోదరులను ఈవో శీనానాయక్ మంగళవారం విధుల నుంచి తొలగించారు. వీరి వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణ అధికారులుగా ఏసీ రంగారావు, ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, వాసులను నియమించారు. దుర్గగుడి ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న రాజేష్ నాయక్ గత కొద్ది రోజుల క్రితం కనకదుర్గానగర్‌లో భక్తులతో గొడవపడి కొట్టాడు. ఈ ఘటనపై భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇతని సోదరుడు రమేష్ నాయక్ సెక్యూరిటీ గార్డుల అటెండెన్స్ పుస్తకంలో విధులకు హాజరుకాని ఉద్యోగులను వచ్చినట్టుగా నమోదుచేసి ప్రతినెలా జీతాలలో కొంత మేరకు స్వాహా చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. నాయక్ సోదరుల వ్యవహారంపై నాలుగు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో 'నాయక్ సోదరుల ఇష్టారాజ్యం' కథనం రావటంతో స్పందించిన ఈవో సంబంధిత విభాగం ఏఈవో రమేష్ బాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై విచారణ చేసి పూర్తి నివేదిక అందచేయాలని ఆదేశించారు.



పాత వంతెన తొలగించేందుకు తెచ్చిన భారీ క్రేన్, వంతెన శిథిలాలను పక్కన వేస్తున్న ఎక్స్‌కవేటర్

## కొండపల్లి ఎర్ర బ్రిడ్జి విస్తరణ పనులు ప్రారంభం

» నాలుగు లేన్లుగా అభివృద్ధి

» దశాబ్ద కాలం తర్వాత రెండో వైపు ఎత్తు పెంపు

» కొండపల్లి రైల్వేస్టేషన్‌కు అండర్‌పాస్‌ల ఏర్పాటు

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి 30పై కొండపల్లి ఎర్రబిడ్జ్‌ని నాలుగు లైన్లుగా విస్తరణ పనులను ఎన్‌హెచ్ అధికారులు ప్రారంభించారు. గతంలో ఎర్రబ్రిడ్జి ఎత్తును పెంచి రెండు లైన్లు చేసిన అధికారులు దానిని నాలుగు లైన్ల విస్తరణకు శ్రీకారం చుట్టారు. దశాబ్దకాలం క్రితం ఇబ్రహీంపట్నం నుంచి జి.కొండూరు వరకు జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించారు. ఆ సమయంలో కొండపల్లి ఎర్రబ్రిడ్జి వద్ద రహదారిని డబుల్ లైన్ వేశారు. ఈ నేపథ్యంలో ఎన్.హెచ్ అధికారులు గతంలో డబుల్ లైన్‌గా ఏర్పాటు చేసిన ఎర్రబ్రిడ్జ్‌కి సమాంతరంగా ఉన్న వంతెనను ఎత్తు పెంచి మరో రెండు లైన్లను వాహనచోదకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. పాతవంతెన తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు ఎర్రబ్రిడ్జ్ ఎత్తు పెరగడం, కొండపల్లి గ్రామంలోకి అండర్ పాస్‌ల ద్వారా రహదారి సౌకర్యం రావటంతో వాహన చోదకులకు, కొండపల్లి ప్రాంత వాసులకు శుభవార్తే అని చెప్పాలి.

## ఉచిత బస్సులో టికెట్ అడుగుతావా?

» ఎస్‌ఎం పేటలో ఆర్టీసీ కండక్టర్‌పై వ్యక్తి దాడి

» నేడు డిపో ఎదుట కార్మికుల ఆందోళన

జగ్గయ్యపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉచితం అని ప్రభుత్వం చెబుతుంటే మమ్మల్నే టికెట్ అడుగుతావా.. అంటు జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో కండక్టర్‌పై షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో ఓవ్యక్తి దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై కండక్టర్ ఫిర్యాదు చేయడంతో ప్రతిగా అధికార పార్టీనేతలు మహిళలతో ప్రతి ఫిర్యాదు చేయించారు. ఆర్టీసీ కార్మికసంఘాలు ఆందోళనకు పిలుపునివ్వటంతో బుధవారం సాయంత్రం పోలీసులు ఇరుపక్షాలతో రాజీచేసి క్షమాపణ చెప్పించారు. ఫ్రీ బస్సుపథకం కండక్టర్లు, డ్రైవర్లకు ఇబ్బందిగా మారిందని తమకు రక్షణ కల్పించాలని ఆర్టీసీ యూనియన్లు గురువారం డిపో ఎదుట ఆందోళనకు ఉపక్రమించాయి. వివరాల్లోకి వెళితే.. జగ్గయ్యపేట నుంచి కోదాడకు తిరిగే షటిల్ సర్వీసులు ఆంధ్రా, తెలంగాణా మధ్య అంతర్రాష్ట్ర సర్వీసుగా ఉండటంతో ప్రయాణికులకు చార్జీలు వసూలు చేస్తున్నారు. సోమవారం షేర్‌మహ్మద్‌పేటలో వనభోజనాల సందర్భంగా పెద్దఎత్తున మహిళలు జగ్గయ్యపేట క్రాస్ రోడ్డుకు ఎక్కారు. కండక్టర్ వారిని మినిమం టికెట్ రూ.10లు తీసుకోవాలని చెప్పగా గ్రామానికి చెందిన అధికార పార్టీనేత కండక్టర్‌తో వాదనకు దిగాడు. ప్రభుత్వం ఫ్రీబస్సు పెడితే మహిళల వద్ద టికెట్ అడుగుతావా అంటు నిలదీశాడు. ఈ బస్సుకు అది వర్తించదని చెబుతున్నా వినకుండా ఘర్షణకు దిగాడు. దీనిపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ కార్మికసంఘాలు కండక్టర్‌పై దాడిని సీరియస్‌గా తీసుకుని గురువారం డిపో ఎదుట ధర్నాకు పిలుపు ఇవ్వటంతో బుధవారం రెండువర్గాలను పిలిపించి దాడిచేసిన వ్యక్తితో కండక్టర్‌కు క్షమాపణ చెప్పించి సర్దుబాటు చేశారు. కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిని పిలిపించి క్షమాపణ చెప్పించామని చిల్లకల్లు ఎస్సై శ్రీనివాస్ చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిపో ఎదుట ఆందోళన చేస్తామని కార్మికనేత కల్యాణం కృష్ణారావు చెప్పారు. ఉచిత బస్సు పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించకపోవటం వల్ల సమస్య వస్తున్నదని చెప్పారు.

# షాక్‌లోనే న్యూ ఆటోనగర్!

» మా సెల్‌ఫోన్లు తీసుకున్నారు.. ఏం జరుగుతుందో అర్థం కాలేదు

» తేరుకునేలోపే.. మావోయిస్టులను కిందకు తీసుకువచ్చారు

» మా చెంతనే మావోయిస్టులు ఉన్నారంటే.. నమ్మలేకపోతున్నాం..

» 'ఆంధ్రజ్యోతి'తో న్యూ ఆటోనగర్ కార్మికుల అంతరంగం







(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

మావోయిస్టుల మకాంపై న్యూ ఆటోనగర్ ఇంకా షాక్‌లోనే ఉంది. తమ చెంతనే మావోయిస్టులు ఉన్నారంటే నమ్మలేకపోకపోతున్నామని అక్కడి కార్మికులు చెబుతున్నారు. కూలీల ముసుగులో దాదాపు 15 రోజుల పాటు వారి మధ్యనే ఉన్న మావోయిస్టులను అరెస్టు చేసేందుకు పోలీసు బలగాలు మోహరించిన దృశ్యం ఇంకా కార్మికుల కళ్లెదుటే మెదులుతోంది. కొద్దిసేపట్లో అత్యంత చాకచక్యంగా పోలీసులు ముగించిన ఆపరేషన్ న్యూఆటోనగర్ చర్చ కార్మికుల మధ్య కొనసాగుతూనే ఉంది. పోలీసులు రావడం, మావోలను అరెస్ట్ చేయడం అంతా క్షణాల్లోనే జరిగిపోయిందని చెబుతున్నారు. ఆపరేషన్ న్యూఆటోనగర్‌పై 'ఆంధ్రజ్యోతి'తో పలువురు కార్మికుల అంతరంగం..

### ఒక్కసారిగా ఖంగుతిన్నా..

\- రత్నం, న్యూ ఆటోనగర్ కార్మికురాలు



చాలా సంవత్సరాలుగా ఇదే కంపెనీలో పనిచేస్తున్నాను. ఈ ప్రాంతంలో చిన్నచిన్న దొంగతనాలు తప్ప పెద్ద నేరాలు ఏమీ జరగవు. అలాంటిది మా కంపెనీ ఎదురు బిల్డింగ్‌లోనే ఉంది. మావోయిస్టులు అంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. పోలీసులు వచ్చి వారిని తీసుకెళ్తుంటే ముందుగా వారంతా దొంగలేమోనని అనుకున్నాం. తరువాత వారంతా మావోయిస్టులని చెప్పగానే ఒక్కసారిగా భయం వేసింది.

### షాక్ నుంచి తేరుకునే లోగానే..

\- నరసమ్మ, కార్మికురాలు



ఉదయం తొమ్మిది గంటలకు పనిలోకి వచ్చాను. కంపెనీలో ఎవరిపని వారు చేసుకుంటున్నాం. అయితే ఉదయాన్నే కొందరు కొత్తవాళ్లు ఇక్కడ తిరగడం గమనించాను. సుమారు 10.30 గంటలకు నాలుగు బస్సులు వచ్చి ఆగాయి. మేము ఎటూ కదలకుండా, ఎవరితోనూ మాట్లాడకుండా చేశారు. ఏంజరుగుతోందో తెలియక అయోమయంలో ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం. షాక్ నుంచి తేరుకునే లోగానే అంతా జరిగిపోయింది.

### పోలీసుల మోహరింపుతో భయపడ్డా

\- సత్యవతి, కార్మికురాలు



ఇక్కడ ఎవరెవరో వచ్చి వారివారి కంపెనీల్లో పని చేసుకుంటారు. ఎవరు, ఎంటీ అనే ఆరా ఇక్కడ ఎవరూ తీయరు. మా కంపెనీ ఎదురుగా ఉన్న భవనంలో మావోయిస్టులు ఉన్నారన్న విషయం ఎలా తెలుస్తుంది. ఒక్కసారిగా 50 మందికి పైగా పోలీసులు రావడంతో భయపడ్డాను. వారు వచ్చీ రావడంతోనే కొందరు పోలీసులు నక్సలైట్‌లు ఉన్న భవనంలోకి వేగంగా వెళ్లారు. కొందరు పోలీసులు మమ్మల్ని చుట్టుముట్టారు.

### తెల్లకారులో ప్రతిరోజూ వారికి భోజనం..

\- వెంకటేశ్వరరావు, సెక్యూరిటీ గార్డ్



మావోయిస్టులు తలదాచుకున్న భవన యజమాని ఇక్కడ ఉండడు. ఇక్కడ వ్యవహారాలన్నీ సూపర్‌వైజర్ చూసుకుంటాడు. మావోయిస్టులు ఇక్కడకు రావడానికి ఒకరోజు ముందు సూపర్‌వైజర్ నన్ను కలిశారు. రోడ్డు పనులు చేసుకునే కూలీలకు మూడో ఫ్లోర్ అద్దెకు ఇచ్చానని, కాస్త చూస్తుండమని చెప్పి వెళ్లిపోయాడు. వారంతా కూలీలనే అనుకున్నాం. అయితే నెంబర్ ప్లేట్‌లేని తెల్లని మహీంద్రా కారులో ప్రతిరోజూ వచ్చి వారికి భోజనం అందించి వెళ్లేవారు. భోజనం వాహనం రాగానే ముగ్గురు మాత్రమే కిందకు వచ్చి తీసుకెళ్లే వారు. మిగిలిన వారు ఎప్పుడూ బయటకు వచ్చేవారు కాదు. వారిని పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్తుంటేనే అందరం చూశాం. అప్పటి వరకు వారిని ఇక్కడ ఎవరూ చూడలేదు.

### సీసీ కెమెరాలను పక్కకు తిప్పేశారు

\- సుందరరావు, ఏసీ బాక్స్‌ల తయారీ కంపెనీ కార్మికుడు



మావోయిస్టులు ఉన్న భవనానికి ఆనుకునే మా కంపెనీ ఉంటుంది. ఎప్పటిలాగానే ఉదయం ఎనిమిది గంటలకే పనిలోకి వచ్చాను. 10.30 తరువాత పోలీసులు ఒక్కసారిగా మా కంపెనీలోకి వచ్చారు. పెద్ద గన్స్ పట్టుకుని వచ్చిన పోలీసులను చూసి భయపడ్డాం. వచ్చీ రావడంతోనే మా కంపెనీ, మావోలు తలదాచుకున్న బిల్డింగ్ సీసీ కెమెరాలను పక్కకు తిప్పేశారు. మా కంపెనీలో అందరినీ ఒకచోట కూర్చోబెట్టారు. కొన్ని గంటల పాటు కాలు కూడా కదలనివ్వలేదు.

### మా ఫోన్‌లు తీసుకుని చుట్టుముట్టారు

\- శ్రీనివాసరావు, న్యూ ఆటోనగర్ కార్మికుడు



24 గంటలు పనిచేసే కంపెనీ మాది. ఇక్కడ కూడా ఒడిసా రాష్ట్రానికి చెందిన వారు పనిచేస్తుంటారు. వారికి తెలుగురాదు. పోలీసులు రాగానే మా కంపెనీలో ముగ్గురు వ్యక్తులు టీ తాగుతూ రోడ్డుపై ఉన్నారు. పోలీసులు వచ్చీరాగానే వారిని ప్రశ్నించి, అనుమానించి వెంటనే చేతులు వెనక్కి విరిచి కట్టేశారు. ఇంతలో మావోయిస్టులు ఉన్న బిల్డింగ్‌లోకి కొందరు వెళ్లారు. కొందరు మా కంపెనీలోకి వచ్చి మమ్మల్ని రౌండప్ చేశారు. మా ఓనర్ దగ్గర, మా దగ్గర ఫోన్లను లాగేసుకున్నారు. మమ్మల్ని ఒక చోట కూర్చుబెట్టి కదలనివ్వలేదు. అడిగే అవకాశం సైతం ఇవ్వలేదు. చేతులు కట్టేసిన కూలీలు మావాళ్లేనని మా ఓనర్ చెప్పడంతో వారిని విడిచిపెట్టారు. సాయంత్రం నాలుగు గంటల తరువాత మా ఫోన్‌లు మాకు ఇచ్చారు.

### జగ్గయ్యపేటలో కలకలం..!

జగ్గయ్యపేట రూరల్ : జిల్లాలో మావోయిస్టుల ఉనికి బయటపడిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు నియోజకవర్గ పరిధిలో హైఅలెర్ట్ ప్రకటించారు. మండల పరిధిలోని పలుప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా జల్లెడ పట్టారు. విజయవాడలో మావోయిస్టులు పట్టుబడటంతో జగ్గయ్యపేటలో కలకలం మొదలైంది. ఈప్రాంతంలో సిమెంట్ కర్మాగారాలు, బల్క్‌డ్రగ్, అల్యూమినియం, ప్లాస్టిక్ డోర్‌లు, ఆక్సిజన్ ప్లాంట్, దాబా హోటళ్లలో, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆటోనగర్, రైల్వే పనుల్లో వేలసంఖ్యలో ఇతర కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికుల వివరాలు నమోదు చేసేలా స్పష్టమైన ఆదేశాలివ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# పత్తి చిత్తు!



ట్రాక్టర్‌తో పత్తి పంటను దున్నేస్తున్న రైతు



పంటను పీకి కుప్పలు, సీసీఐ తిరస్కరించిన పత్తి

» పంట ఉండగానే చేలు దున్నేస్తున్న రైతులు

» తీతల కూలీ రాదని పొలాల్లోనే వదిలేస్తున్న వైనం

» ప్రత్యామ్నాయ సాగుకు సాయం అందించాలి

» పండిన పంటను కొనుగోలు చేయని సీసీఐ

» కమర్షియల్ కార్పొరేషన్.. పట్టని పాలకులు!

నందిగామ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతు గతంలో ఎన్నడూ ఎదుర్కోని కష్టాన్ని చవిచూశాడు. చెట్లకు ఉన్న పత్తి తీయకుండా దున్నివేసిన ఘటనలు ఇంతవరకూ జరగలేదు. క్వింటా పత్తి తీసేందుకు రూ.1వేలు ఖర్చు కాగా, ఆ పత్తిని కొనేవారు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు, ఆదుకోవాల్సిన సీసీఐ మొఖం చాటేయడంతో చేసేది లేక కన్నీళ్లు దిగమింగుతూ పంటను దున్నేస్తున్నారు. అప్పుడప్పుడూ నష్టాలు వచ్చినా ఈఏడాది జరిగినంత నష్టం ఎన్నడూ జరగలేదు. సాధారణంగా పత్తి దిగుబడులు మార్చి నెలాఖరు వరకూ వస్తుంటాయి. ముఖ్యంగా నవంబర్, డిసెంబరు మాసాలలో నాణ్యమైన పత్తి దిగుబడులు వస్తుంటాయి. కానీ ఈ ఏడాది నవంబరు మొదటి వారానికే పంట ముగిసింది. ప్రారంభం నుంచి భారీ వర్షాలు నమోదవడంతో దెబ్బతిన్న పంటలకు అధిక మోతాదులో ఎరువులు అందించి నిలబెడుతూ వచ్చారు. దీనికోసం అన్నదాతలు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చిన పంటను మొంథా తుఫాను కబళించింది. వారం రోజుల పాటు కురిసిన వర్షాలతో పూత, కాయ కుళ్లిపోయింది. తీతలకు సిద్ధంగా ఉన్న పత్తి పూర్తిగా తడిసిపోయింది. రోజుల తరబడి పొలాలు ఆరకపోవడంతో మొక్కలు నీటి ఊట వల్ల ఎండిపోయాయి. డ్రోన్‌ల సాయంతో అధికారులు పంట నష్టం అంచనా వేశారు. నష్టంపై అధికారులు ఏమేర అంచనా వేశారో తెలియదు గానీ నిజానికి పంట పూర్తిగా దెబ్బతిన్నది. సాధారణ పరిహారం కాకుండా జరిగిన నష్టం మేర ప్రభుత్వం పరిహారం ఇస్తేనే రైతు కుటుంబాలు కోలుకోలేని పరిస్థితి నెలకొన్నది. అన్నదాతలు పరిహారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో విడుదలైన అన్నదాత సుఖీభవ సొమ్ము కూడా రైతు కళ్లలో ఆనందాన్ని తెప్పించలేకపోతోంది. పత్తికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేసుకొనేందుకు రైతులు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుకు సహకరించాల్సి ఉంది.

### కమర్షియల్‌గా కాటన్ కార్పొరేషన్..

అనేక ఆటుపోటుల నడుమ పండిన కొద్ది పంటను అన్నదాతలు ఇంటికి చేర్చుకున్నారు. తుది దశ పత్తి తీసినా ఖర్చులకు చాలవన్న ఆలోచనతో పంట తొలగించడం ప్రారంభించారు. సీసీఐ మాత్రం అన్నదాతను ఆదుకొనే స్థితిలో కనిపించడం లేదు. నెల క్రితం జిల్లాలో ఆరుచోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు చేపట్టడం లేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలతో స్పందించిన సీసీఐ ఎట్టకేలకు మంగళవారం కొద్ది మేర పత్తి కొనుగోలు చేసింది. తదుపరి నాణ్యమైన పత్తి మాత్రమే కొంటామంటూ నిబంధనలు విధిస్తూ అన్నదాతను అసహనానికి గురి చేస్తున్నది. ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు స్పందించక పోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఆదుకుంటున్న తెలంగాణా చిరు వ్యాపారులు

నాణ్యత తగ్గిన పత్తిని స్థానిక వ్యాపారులు క్వింటాకు మూడు వేలు కూడా చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. సీసీఐ ఆ పత్తిని కొనుగోలు చేసే పరిస్థితి కనిపించకపోవడంతో ఎంతకైనా తమకే ఇస్తారన్న ధీమాతో స్థానిక వ్యాపారులు రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఈ తరుణంలో తెలంగాణాకు చెందిన చిరు వ్యాపారులు జిల్లాలోని పలు ప్రాంతాలలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఆటోలపై వస్తున్న వ్యాపారులు ఆరు వేల రూపాయల వరకూ ధర చెల్లించి పత్తిని కొంటున్నారు. ఇప్పటికే సగానికిపైగా పత్తిని తెలంగాణా వ్యాపారులు కొనుగోలు చేశారు. సీసీఐ కంటే చిరువ్యాపారులే మేలని అన్నదాతలు అంటున్నారు.

## ఆ కాంట్రాక్టర్ ఎవరు?

(5వ పేజీ తరువాయి)

చెల్లించినట్టు తెలిసింది.

### కాంట్రాక్టర్‌ను కలిసిందెవరు?

జీప్లస్‌త్రీ భవనంలో మూడో అంతస్తును అద్దెకు తీసుకున్నది కాంట్రాక్టర్ అని తేలడంతో అతనితో టచ్‌లో ఉన్న మావోయిస్టులు, మావోయిస్టు సానుభూతిపరులు ఎవరన్న దానిపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ భవనంలో తలదాచుకున్న మావోయిస్టుల్లో ఎక్కువ మంది గెర్రిల్లా గ్రూపునకు చెందినవారే. అటువంటి వారికి కాంట్రాక్టర్ ఆశ్రయం ఇప్పించడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్‌కు ఎవరైనా అబద్ధం చెప్పి మావోయిస్టులను ఇక్కడికి తీసుకొచ్చారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. దర్యాప్తునకు సంబంధించిన ఏ చిన్న విషయాన్ని బయటకు పొక్కకుండా పోలీసులు ముందడుగు వేస్తున్నారు. మావోయిస్టులు ఆశ్రయం పొందిన భవనానికి మూడు కిలోమీటర్ల దూరంలో స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో కార్యాలయం ఉంది. దానికి సమీపంలోనే మావోయిస్టులు ఆశ్రయం పొందడం సంచలనంగా మారింది. మావోయిస్టు సానుభూతిపరులతో కాంట్రాక్టర్‌కు సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. వారు కాంట్రాక్టర్‌ను సంప్రదించడంతో ఆయన మూడో అంతస్తును అద్దెకు తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

## రెచ్చిపోతున్న రేషన్ డాన్

(5వ పేజీ తరువాయి)

### ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచేలా...

ఓపక్క ప్రభుత్వం నూరుశాతం నిత్యావసరాల పంపిణీ జరగాలని, పౌష్టికాహారం పేదలకు చేరాలన్న లక్ష్యాలను నిర్దేశిస్తుంటే.. నియోజకవర్గాల స్థాయిలో జరుగుతున్న రేషన్ డాన్ల అక్రమాలు అడ్డుగోడలుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ పంపిణీని ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షిస్తోంది. పంపిణీ శాతాలను గమనిస్తూ తగ్గిన చోట డీలర్లను ప్రశ్నిస్తోంది. ఈ-పోస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం సరికొత్త స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్మార్ట్ రైస్ కార్డులను ప్రవేశపెట్టారు. రానున్న రోజుల్లో రైస్ ఏటీఎంలను ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో రేషన్ డాన్ల కారణంగా ప్రజా పంపిణీ వ్యవస్థకు మకిలీ పడుతోంది.

### రేషన్ డాన్లు, డీలర్ల మధ్య గొడవలు

విజయవాడ నగరం సహా ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ డీలర్లు కార్డుదారుల నుంచి రేషన్‌ను కొంటుంటారు. అలా కొన్న బియ్యాన్ని తమకే విక్రయించాలని ఎక్కడికక్కడ డాన్‌లు శాసిస్తున్నారు. కార్డుదారుల నుంచి కేజీ బియ్యం రూ.14, రూ.15కు రేషన్ డీలర్లు కొంటున్నారు. ఈ బియ్యాన్ని రూ.20కు సాధారణ రేషన్ సిండికేట్‌కు విక్రయిస్తారు. నియోజకవర్గ రేషన్ డాన్లు మాత్రం రూ.15, రూ.16కు తమకే అమ్మాలని రేషన్ డీలర్లను ఒత్తిడి చేస్తున్నారు. ఇలా చేస్తే డీలర్లకు కేజీకి రూపాయే వస్తుంది. తమకు లాభం రాదన్న ఉద్దేశంతో డీలర్లు బయటకు అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో డీలర్లను డాన్లు భయపెడుతున్నారు. లొంగకపోతే వ్యవస్థలను ఉసి గొలుపుతున్నారు. డీలర్ల లొసుగులను బయటపెట్టి సివిల్ సప్లయిస్ అధికారులతో 6ఏ కేసులు నమోదు చేయిస్తున్నారు. అవినీతి విజిలెన్స్ అధికారులను రంగంలోకి దించి దాడులు చేయిస్తున్నారు. దీంతో చాలామంది డీలర్లు భయపడి రేషన్ బియ్యాన్ని ఆ డాన్లకే విక్రయిస్తున్నారు.



19 పేర్ని 04-ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పిస్తున్న వైఎస్ షర్మిలారెడ్డి

## దేశ సమగ్రతకు చిహ్నాం ఇందిర

గవర్నర్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, సమైక్యత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని వీరనారి ఇందిరాగాంధీ అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం చల్లపల్లి బంగ్లా సమీపంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి హాజరైన వైఎస్ షర్మిలారెడ్డి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వస్తాన్‌వలీ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, పీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రతిఘటించి ఉంటే..

(5వ పేజీ తరువాయి)

ఆయిల్ కర్మాగారం ఉంది. ఏసీ బాక్సుల తయారీ యూనిట్‌లో దాదాపు పదిమంది కార్మికులు పని చేస్తుంటారు. రెండు మౌల్డింగ్ యూనిట్‌లలో షిఫ్టుకు దాదాపు 50 మందికి పైగా పనిచేస్తున్నారు. ఆయిల్ కర్మాగారంలో 20 మందికి పైగా పనిచేస్తున్నారు. మారుతి బిల్డింగ్ ఉన్న రోడ్డులో దాదాపు 15 యూనిట్ల వరకు ఉన్నాయి. వీటిల్లో వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ రోడ్డులోనే ఉండే ఆయిల్ కర్మాగారంలో ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకుని భారీనష్టం జరిగింది. తుపాకులు, భారీ పేలుడు పదార్థాలను కలిగి ఉన్న మావోయిస్టులు, వారిని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులపై ఎదురుకాల్పులు జరిపితే భారీస్థాయిలో విధ్వంసం జరిగేదని కార్మికులు భయాందోళన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు వారి వద్ద ఉన్న పేలుడు పదార్థాలు పేలినా, ఊహించలేని ప్రమాదం జరిగి ఉండేదంటున్నారు. ఇదే రోడ్డులో ఉన్న యూనిట్లతో పాటు మారుతి భవనానికి వెనుక వైపున ఉన్న యూనిట్లలో కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరిగేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రతిఘటన చేయకుండా, మందుగుండు సామాగ్రిని ఉపయోగించకుండా మావోయిస్టులు లొంగిపోవడంతో కార్మికులు, యూనిట్ల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు.

## పోలీస్ పహారా

(5వ పేజీ తరువాయి)

సుమారు 40 వేల మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ఈ సంస్థల నుంచి ఏడాదికి రూ.కోటి వరకు ఆస్తి పన్ను రూపేణా ఐలాకు ఆదాయం వస్తున్నా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ సంస్థల సీసీ కెమెరాలే దిక్కుగా ఉన్నాయి.

## ఆటోనగర్‌లో అరాచకాలు

(5వ పేజీ తరువాయి)

పోర్టల్‌లోకి నకిలీ చాసిస్ నెంబర్లతో అప్‌లోడ్ చేయించి, ఆయా రాష్ట్రాల నుంచి ఎన్‌వోసీలు జారీచేయించుకుని ఏపీలో వాటికి ఫిజికల్ వెరిఫికేషన్, ఫిట్‌నెస్‌లు జారీ చేయించటం సంచలనం సృష్టించింది. వాహనాలే లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలకు చెందిన ఆయిల్ ట్యాంకర్ల యజమానులు గడువు తీరిన తమ వాహనాలకు ప్రాణం పోసేందుకు మాఫియాతో చేతులు కలిపారు. లేని వాహనాలను ఉన్నట్టుగా చూపించటం కోసం ఆటోనగర్‌లోని కొందరు యజమానులు పాత వాహనాలపై చాసిస్ నెంబర్లు వేసి ట్యాంపరింగ్ చేశారు. దీనివల్ల గడువు తీరిన తమ వాహనాలను మరికొంతకాలం పొడిగించుకునేందుకు ఆస్కారం ఏర్పడింది. ఇలాంటి ఎన్నో చీకటి వ్యవహారాలకు ఆటోనగర్‌లు కేంద్ర బిందువుగా మారుతున్నాయి.

## కారుణ్య నియామకాల్లో..

(5వ పేజీ తరువాయి)

బుద్దె రాజా మంగళవారం విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. 2024-నవంబరులో జరిగిన కౌన్సిల్‌లో పారిశుధ్య విభాగానికి సంబంధించి 150 మంది పనివారు అవసరమని కౌన్సిల్‌లో పెట్టగా, సభ్యులు ఆమోదించారు. రెండుసార్లుగా సుమారు 75 మందిని కారుణ్య నియామకాల కింద విధుల్లోకి తీసుకున్నారని, వారిలో కొందరిని మరణించిన బంధువుల కుటుంబాలతో పాటు రిటైరైన వారి కుటుంబాల నుంచి తీసుకున్నారని, ఇందుకోసం రూ.లక్షల్లో దండుకున్నారని, దీనిపై కౌన్సిల్‌లో ప్రశ్నించగా, అధికారుల నుంచి సమాధానం లేదన్నారు. సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రెండేళ్లుగా అవినీతి చర్యలకు పాల్పడుతున్నట్లు తమ యూనియన్ దృష్టికి వచ్చిందని, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను సైతం తప్పుదారి పట్టిస్తూ కౌన్సిల్ నిర్ణయాన్ని లెక్క చేయకుండా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

(5వ పేజీ తరువాయి)

దేవినేని ఉమా అధికారులకు సూచించారు. ధాన్యం, పెసలు, కందులు వంటి పంటలకు రైతుసేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే), మార్కెట్ యార్డుల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక కార్యాలయాలు, ఆర్‌ఎస్‌కేల్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 130,139, 150 |
| చికెన్ విత్ స్కిన్ | 250 |
| చికెన్ స్కిన్‌లెస్ | 260 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 660

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లబ్బీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు స్క్యూ బ్రిడ్జి సెక్షన్, స్క్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ ఎస్‌వీఎస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. కుర్ర నారాయణ వీధి, నారా చంద్రబాబు నాయుడు కాలనీ, ఖన్నా నగర్, మోడ్రన్ హెచ్‌టీ సర్వీస్, ఎస్‌బీఐ కాంప్లెక్స్, రాఘవనగర్, చెన్నుపాటి రామకోటయ్య స్ట్రీట్, ఎయిర్ టెల్ హెచ్‌టీ సర్వీస్, సీతారామ నగర్, నేతాజీ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.



న్యాయవాదులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## న్యాయవాదులకు ఉచిత కంటి పరీక్షలు

విజయవాడ లీగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్‌లో మాక్సివిజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంప్యూటర్ ద్వారా ఆస్పత్రి సిబ్బంది న్యాయవాదుల కళ్లను పరీక్షించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ న్యాయవాదులలో బీపీ, సుగర్ వంటి వ్యాధులు వుంటాయని దీంతో పాటు కంటి సమస్యలు కూడా ఎక్కువ మందికి వున్నాయన్నారు. కంప్యూటర్‌పై వర్క్ చేసే వారికి కూడా కళ్లజోడు ధరించవలసిన అవసరం వుందని బాషా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కార్యవర్గసభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



## అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ అన్నప్రసాద వితరణ

ఆటోనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా జవహర్ ఆటోనగర్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత రామలింగేశ్వరస్వామికి వైభోపేతంగా పంచామృతాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, ఆటోమొబైల్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

## భవన క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోండి

- చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్

కార్పొరేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అనధికార భవనాల క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్ బుధవారం తెలిపారు. ప్రభుత్వం భవన క్రమబద్ధీకరణ పథకం-2025ను తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం కింద 1985 జనవరి ఒకటో తేదీ తరువాత నుంచి 2025 ఆగస్టు 31 వరకు నిర్మించిన అనధికార భవనాలు, ఆమోదిత నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు విస్తరణలు క్రమబద్ధీకరణకు అర్హులని, భవన యజమానులు 2026 మార్చి 11లోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. దరఖాస్తులు ఆన్ లైన్ పోర్టల్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ బీపీఎస్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ద్వారా మాత్రమే సమర్పించాలన్నారు. భవన యజమానులు నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గడువు ముగిసిన తరువాత చట్ట విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## నగర పరిధిలోని ప్రధాన కాల్వల ప్రక్షాళన

- కాల్వల్లో పేరుకున్న చెత్త, వ్యర్థాల తొలగింపు
- దోమల వ్యాప్తి నివారణ చర్యలు

కార్పొరేషన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రధాన కాల్వల్లో వ్యర్థాలను తొలగించి ప్రక్షాళన చేపట్టింది. కాల్వల్లో వ్యర్థాలను తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టింది. బుధవారం నగరపాలక సంస్థ ఏలూరు, బందరు, రైవస్ బుడమేరు కాల్వల్లో గుర్రపుడెక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపు పనులు చేపట్టారు. కాల్వలు పరిశుభ్రంగా ఉండటం వలన దోమలు వ్యాప్తి తగ్గి, ప్రజలు అనారోగ్యం పాలుకాకుండా ఉండేందుకు నిరంతరం వ్యర్థాలను తొలగించే కార్యక్రమం వీఎంసీ చేపడుతుందన్నారు. ప్రజారోగ్యంతోపాటు మలేరియా విభాగాలు సమన్వయంతో కాల్వల్లో వ్యర్థాలను తొలగించి, దోమల మందు పిచికారి చేస్తోందన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

## వైభవోపేతంగా చండీహోమం

విజయవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠస్థ వెంకటేశ్వర స్వామి-చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో బహుళ చతుర్దశి సందర్భంగా బుధవారం చండీహోమం అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ పండితులు మాట్లాడుతూ సృష్టి - స్థితి - లయలకు మూల కారణమైన జగదాంబను ఈ యాగం ద్వారా ప్రసన్నం చేసుకుంటాం అని వివరించారు. వైదిక మంత్రోచ్చారణల మధ్య సాగిన ఈ మహాయాగంలో భక్తులు మహాప్రసాదం స్వీకరించి తరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, పండితులు పాల్గొన్నారు.

## ఓట్ చోర్ గద్దె చోడ్ పోస్టర్ ఆవిష్కరణ

గవర్నర్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉపయోగించి రాష్ట్రాల్లో ఓట్ చోరీకి పాల్పడుతోందని యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహీమ్ అన్నారు. జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు బుధవారం ఆంధ్రరత్న భవన్‌లో ఓట్ చోర్ గద్దె చోడ్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగిందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందన్నారు. ప్రజలంతా ఉద్యమించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జోనల్ ఇన్‌చార్జి సందీప్ ఐశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# రక్షిత పథకం ఉన్నా..తాగునీరు లేదు

- రక్షిత మంచినీటి పథకం నిరుపయోగం
- సంవత్సరం పది నెలల క్రితం ప్రారంభించినా నీరురాని వైనం
- తాగునీటి కోసం ఆటోనగర్ ప్రజల కటకట

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: విజయవాడ జవహర్ ఆటోనగర్ ప్రజలకు తాగునీరు అందించేందుకు నిర్మించిన రక్షిత మంచినీటి పథకం(ఓవర్‌హెడ్ ట్యాంక్) నిరుపయోగం ఉంది. ఆరు లక్షల లీటర్ల సామర్థ్యంతో రూ. 3.33 కోట్ల వ్యయంతో జవహర్ ఆటోనగర్‌లోని ఫైర్‌స్టేషన్ రోడ్డులో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను గత ఏడాది జనవరి 12న అట్టహాసంగా గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. నేటి వరకు దీని నుంచి చుక్కనీరు కూడా ఆటోనగర్ ప్రజలకు అందలేదు. ఎంపీ లాడ్స్ ఐలా నిధులతో దీనిని నిర్మించారు. ఈ రక్షిత మంచినీటి పథకం ప్రాంగణంలోనే ఆర్వో ప్లాంట్‌ను కూడా ఏర్పాటుచేశారు. దాని నుంచి కూడా తాగునీరు రావడంలేదు.

**అధికారుల అవగాహన లోపం వలనే..**



నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

వీఎంసీ, ఆటోనగర్ ఐలా అధికారుల అవగాహన లోపం వల్ల ఓవర్‌హెడ్ నిర్మించినా ఆటోనగర్ ప్రజలకు తాగునీరు అందడంలేదు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వారు ఈ ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీరు అందించాల్సి ఉంది. ఒక్కో కిలోలీటరు నీరు వాడుకున్నందుకు ఆటోనగర్ ప్రజలు చెల్లించే డబ్బులు విషయంలో



పనిచేయని ఆర్వో ప్లాంట్

వీఎంసీకి, ఐలాకు వ్యత్యాసం ఉండటంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీరు ఇవ్వడంలేదు. దీంతో ఇది గత 22 నెలలుగా ఖాళీగా ఉంది.

**నీటి కోసం ప్రజలు పాట్లు**

ఆటోనగర్‌లో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఆటోనగర్‌లోని నీరు సరఫరా చేసేందుకు పైపులైన్‌లు ఉన్నా అవి నిరుపయోగంగా ఉన్నాయి. బోర్‌వెల్స్ నుంచి సరైన తాగునీరు రాకపోవడంతో స్థానికులు నీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. బయట నుంచి నీటిని తెచ్చుకోని తాగవలసిన దుస్థితి నెలకొంది.

**తాగునీటి కష్టాలు తీర్చండి**

జవహర్ ఆటోనగర్ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నాం. బయట నుంచి నీరు తెచ్చుకొని తాగుతున్నాం.

-అబ్దుల్ కలాం, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, జవహర్ ఆటోనగర్

**ఉన్నతాధికారులు చొరవ చూపాలి**

వీఎంసీ, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు చొరవ చూపి జవహర్ ఆటోనగర్‌లో నీటి కష్టాలను తీర్చాలి. గతంలో ఒక్కో కిలోలీటరు నీరు రూ. 28కి ఇస్తామని వీఎంసీ హామీ ఇచ్చిందని, నేడు రూ. 50 చొప్పున చెల్లించాలని కోరుతుందన్నారు. అంత చెల్లించేందుకు ముందుకు రాకపోవడంతో నీరు ఇవ్వడంలేదు.

-సుంకర దుర్గాప్రసాద్, ఐలా మాజీ చైర్మన్

**ఉన్నతాధికారులతో మాట్లాడతాం**

జవహర్ ఆటోనగర్‌కు రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు అందించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతాం. ప్రస్తుతం ఆటోనగర్‌ను నీటి సమస్య వేధిస్తోంది. అధికారులకు నీటి సమస్యలను వివరించి ప్రజలకు న్యాయం జరిగే విధంగా చూస్తాం.

-కె. బాజ్జీ, ఐలా కమిషనర్

## కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్‌కు ఎంపీ అభినందనలు



కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రత్నం రమేష్‌ను సత్కరిస్తున్న ఎంపీ

భారతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన రత్నం రమేష్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. బుధవారం రత్నం రమేష్, 16వ డివిజన్ పార్టీ నాయకులతో కలిసి గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రత్నం రమేష్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 16వ డివిజన్ అధ్యక్షుడు పొన్నవల్లి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ పువ్వాడ శ్రీనివాస్, మహిళామండలి ప్రెసిడెంట్ ఉప్పుశెట్టి లీలాకుమారి, వాణిజ్య విభాగం వైస్ ప్రెసిడెంట్ ఉప్పుశెట్టి వెంకట్రావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకం అంశంపై కవి సమ్మేళనం



మాట్లాడుతున్న రచయితల సంఘం కోశాధికారి నానా, కవయిత్రి పుష్పాదేవి

విజయవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పుస్తకం అంటే రాజ్యాంగం, మత గ్రంథాలే ప్రాథమిక మైనాయని, విజ్ఞానం అందించే గ్రంథాలే సమాజాన్ని సరైన దారిలో పెడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం సాయంత్రం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నిర్వహణలో పుస్తకం అనే అంశంపై కవి సమ్మేళనం జరిగింది. సభకు ఆంధ్రప్రదేశ్ రచో సంఘం కోశాధికారి నానా అధ్యక్షత వహించగా కవయిత్రి పోపూరి పుష్పాదేవి కవి సమ్మేళనం నిర్వహించారు.

ఈ సమ్మేళనంలో చిత్రాడ కిషోర్‌కుమార్, పి.కృష్ణభార్గవి, చందు నాగేశ్వరరావు, ఆకునూరి నారాయణ, ఎస్.ఎం.సుభాని, తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు ఎపుస్తకర్ అంశంపై తదితరులు కవితలు వినిపించారు. సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



కృష్ణలంకలోని పలు ప్రాంతాల్లో కరెంటు స్తంభాలపై కేబుల్ వైర్ల కట్టలు

## విద్యుత్ స్తంభాలా...కేబుల్ స్తంభాలా

- కృష్ణలంకలో కరెంటు స్థంభాలకు కేబుల్, నెట్ వైర్ల కట్టలు
- విద్యుత్ స్తంభాలను సొంతంగా వాడేసుకుంటున్న వైనం
- విద్యుత్ సమస్యను సరిచేయాలంటే తిప్పలే
- చూసీచూడనట్లు ఉంటున్న విద్యుత్‌శాఖ అధికారులు

కృష్ణలంక, ఆంధ్రజ్యోతి : కృష్ణలంకలో ఎక్కడ చూసినా విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టలు కట్టలుగా దర్శనమిస్తున్నాయి. కేబుల్, నెట్ సంస్థలు విద్యుత్ స్తంభాలను తమ ఆస్తిగా భావించి కేబుల్, నెట్ వైర్లను కట్టలు కట్టలుగా వేలాడదీస్తున్నారు. ఎప్పుడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది విధులు నిర్వహించాలంటే కేబుల్, నెట్ వైర్ల కట్టలతో గజిబిజిగా ఉంటోందంటూ ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. కేబుల్, నెట్ సంస్థలు సపరేట్‌గా స్తంభాలు వేసుకుని తమ వైర్లను వాటికి పెట్టుకొంటే ఎటువంటి ఇబ్బంది వుండదని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు. ఎప్పుడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సరిచేయాలంటే కేబుల్, నెట్ వైర్ల కట్టలతో ఇబ్బంది వస్తోందని విద్యుత్ సిబ్బంది మండిపడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్, ఎలక్ట్రికల్ అధికారులు వీటిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## గుణదల మద్దిరావమ్మ తల్లి ఆలయంలో కార్తీక దీపోత్సవం



భారతీనగర్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మూడవ డివిజన్ పరిధిలోని గుణదల పాత పంచాయతీ సమీపంలోని శ్రీమద్దిరావమ్మ తల్లి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుడు శరత్‌చంద్ర శర్మ ఆధ్వర్యంలో కార్తీకమాసం ఆఖరి రోజు సందర్భంగా కార్తీక దీపోత్సవ(లక్ష ఒత్తుల) కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు.

## సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో పోస్టర్ ఆవిష్కరణ

**ఇన్నోవేషన్.. డిజైన్‌పై నేటి నుంచి రెండు రోజుల వర్క్‌షాప్**

కానూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇన్నోవేషన్.. డిజైన్.. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ థీమ్‌తో రెండు రోజులపాటు కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ జరగనుంది. గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రో. వీసీ పీవీ రత్నప్రసాద్, రీసర్చ్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఎం. సునీత, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్, ప్రొఫెసర్‌లు వెంకట్రావు, వి. మల్లికార్జున్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రో. వీసీ రత్నప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ ఈ వర్క్ షాప్‌కు రాష్ట్రంలోని 26 జిల్లా నుంచి డీఈవోలు, డైట్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఎస్‌ఈఆర్‌టీ సభ్యులు హాజరువుతారని తెలిపారు.

## హైటెన్షన్ రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తయ్యేనో?

**నత్తనడకన సాగుతున్న పనులతో రాకపోకలకు అవస్థలు**

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: తూర్పునియోజక వర్గంలోని పలు డివిజన్లను కలుపుతూ జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా వేసిన హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పంటకాలువ రోడ్డు నుంచి కరెన్సీనగర్ కాలనీ వరకు రోడ్డు నిర్మించారు. గురునానక్ కాలనీ సమీపంలోని న్యాక్ కల్యాణమండపం వద్ద స్థలం సేకరణలో, ఏపీఐఐసీ కాలనీ సమీపంలోని మసీద్ అడ్డు రావడంతో కొంత జాప్యం ఏర్పడి పనులు మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ జాస్తి సాంబశివ రావు పలుమార్లు స్థానిక స్థల యజమానులతో చర్చించారు. నగరపాలక సంస్థ నుంచి వారికి బాండ్లు అందించే చర్యలు ప్రజాప్రతినిధులు చేపట్టడంతో సుమారుగా గత ఐదేళ్లగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు ఇటీవల తిరిగి ప్రారంభించారు. పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో హైటెన్షన్ రోడ్డు భారతీనగర్(కరెన్సీనగర్ వెళ్లే) వైపు రోడ్డులో రాకపోకలు సాగిస్తారు. భారతీనగర్ సమీపంలో రాంగ్ రూట్ రాకపోకలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. అంతేకాకుండా గురునానక్ కాలనీ రోడ్డు నుంచి హైటెన్షన్ రోడ్డులోకి ప్రయాణించాలంటే ఏపీఐఐసీ కాలనీ మెయిన్ రోడ్డులోకి వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



ఆర్‌ఆర్ గార్డెన్ సమీపంలో...



న్యాక్ కల్యాణమండపం సమీపంలో ...



## ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి బాలాంజనేయస్వామి

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :నగరంలోని ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలాంజనేయస్వామి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీ, నీట్ పరీక్షల్లో త్రుటిలో అవకాశం కోల్పోయిన గురుకులాల విద్యార్థులకు నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆకస్మికంగా వచ్చారు. స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్న అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వీరాంజనేయస్వామి మాట్లాడుతూ, కబేలా సెంటర్‌లో రూ.80 లక్షలతో శాశ్వత ఐఐటీ, నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్ నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలని ఆయన సూచించారు.

## గ్రామ,వార్డు విద్యాకార్యదర్శుల ప్రమోషన్‌పై ఆలోచించాలి

- ఐక్యవేదిక చైర్మన్ బి.గంటయ్య

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే విద్యా కార్యదర్శుల ప్రమోషన్ విషయంలో ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని డబ్ల్యూఈడీఎస్ ఐకాస చైర్మన్ బి.గంటయ్య కోరారు. గ్రామ వార్డు సచివాలయాల డైరెక్టర్ ఎం.శివప్రసాద్, అడిషనల్ కమిషనర్ సూర్యనారాయణను బుధవారం ఆంధ్రప్రదేశ్ విద్యాకార్యదర్శుల ఐక్యవేదిక (డబ్ల్యూఈడీఎస్) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యాకార్యదర్శుల ప్రమోషనల్ చానల్ విషయాన్ని వారి వద్ద ప్రస్తావించారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ శివప్రసాద్ ప్రమోషన్ చానల్ విషయంలో ప్రభుత్వం వేసిన కమిటీ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసు కుంటామని చెప్పారు. రాష్ట్ర డబ్ల్యూఈడీఎస్ ఐకాస కన్వీనర్ జి.యశ్వంత్, కో కన్వీనర్ శ్రీకాంత్ తది తరులు పాల్గొన్నారు.



పెదతాడేపల్లి గురుకుల పాఠశాల స్కౌట్ విద్యార్థులు

## స్కౌట్ నేషనల్ జంబోరికి పెదతాడేపల్లి విద్యార్థులు

**» రికార్డుస్థాయిలో ఒకే పాఠశాల నుంచి 56 మందికి అవకాశం**

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్కౌట్‌లో నేషనల్ జంబోరిని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారు. ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ జంబోరిలో పాల్గొనాలని స్కౌట్‌లో ఉన్న ప్రతి విద్యార్థి కలలు కంటారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి రికార్డ్ స్థాయిలో విద్యార్థులు ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ గురుకుల పాఠశాల నుంచి ఏకంగా 56 మంది ఎంపికై తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. లక్నోలో ఈ నెల 21 నుంచి 31 వరకూ జంబోరిలో పాల్గొనేందుకు వీరికి అవకాశం లభించింది. రాష్ట్రపతి ముందు నిర్వహించే స్కౌట్ ఈవెంట్‌లో తమ ప్రదర్శనతో జిల్లాతోపాటు రాష్ట్రానికి పేరు తీసుకు రావాలని విద్యార్థులు ఉవ్విళ్లూరుతున్నారు. వీరిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించి ప్రోత్సాహకంగా రూ.10 వేలు ప్రిన్సిపల్ రాజారావుకు అందించారు. డీఈవో నారాయణ, అడిషినల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్యామ్ సుందర్, డీసీవో ఉమా కుమారి స్కౌట్ విద్యార్థులను అభినందించారు. 'ఈ స్కౌట్ జంబోరిలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వ ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్ ఉంటుంది. అలాంటి జాతీయ స్థాయి ఈవెంట్‌లో పాల్గొనే అవకాశం లభించిన విద్యార్థులకు అభినందనలు' అని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు చెప్పారు.

## సోమేశ్వరుడికి రూ.44 లక్షల విలువైన స్థలం దానం



స్థలానికి సంబంధించిన నగదును ఎమ్మెల్యే రామాంజనేయులుకు అందిస్తున్న దాత

భీమవరం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పంచారామ క్షేత్రం భీమవరం గునుపూడి సోమేశ్వరస్వామి దేవస్థానానికి రూ.44 లక్షల విలువైన సెంటున్నర స్థలాన్ని రాజమహేంద్రవరానికి చెందిన గన్నంనేని శివరామకుమార్ కొనుగోలు చేసి దానం చేశారు. దీనికి సంబంధించిన నగదును రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా దేవస్థానానికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయనను అభినందించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు, చైర్మన్ చింతలపాటి బంగార్రాజు, అర్చకులు చెరుకూరి రామకృష్ణ మాట్లాడుతూ క్షేత్రం పక్కన ఉత్తరం వైపు గోడను అనుకుని ఉన్న స్థలాన్ని దేవస్థానంలో కలుపుకొనేందుకు దాత కుమార్ ముందుకు వచ్చారని తెలిపారు.

## ఇమామ్, మౌజన్ల వేతనాలు నిలిపితే కఠిన చర్యలు

**» మసీదు కమిటీలకు మంత్రి ఫరూక్ హెచ్చరిక**

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్ల వేతనాలు నిలిపివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మసీదు కమిటీలను రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హెచ్చరించారు. రాష్ట్రంలోని ఇమామ్, మౌజన్ల పెండింగ్ వేతనాలకు సంబంధించిన రూ.90 కోట్లను ఈ నెల 12న కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు రాత్రి నుంచే మసీదు కమిటీల బ్యాంకు ఖాతాలకు ఇమామ్, మౌజన్ల జీతాలు ఆన్‌లైన్ ద్వారా నేరుగా బదిలీ చేశామని పేర్కొన్నారు. కొన్ని మసీదు కమిటీలు ఆ మొత్తాన్ని ఇమా మ్, మౌజన్లకు చెల్లించడంలేదన్న ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. మసీదు కమిటీల ప్రతినిధులు వెంటనే ఆ మొత్తాన్ని ఇమామ్, మౌజన్లకు చెల్లించాలని మంత్రి ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతమైతే కఠిన చ ర్యలు తీసుకుంటామని, అవసరమైతే మసీదు కమిటీలను రద్దు చేయడానికి వెనుకాడబోమనిమంత్రి హెచ్చరించారు.

## పత్తిని సమీప మిల్లుల్లో అమ్ముకోవచ్చు

**» మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయ సునీత వెల్లడి**

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు తమ పంట ఉత్పత్తిని పూర్తిగా విక్రయించే వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంటాయని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత తెలిపారు. సీసీఐ నాణ్యత ప్రమాణాల మేరకు పత్తిని తీసుకొచ్చి, మద్దతు ధర పొందాలని బుధవారం ఓ ప్రకటనలో రైతులకు సూచించారు. రైతులు తమ సమీప జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి విక్రయించుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. రైతుల స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళతరం చేసేలా కపాస్ కిసాన్ యాప్‌ను సీఎం యాప్‌తో అనుసంధానం చేశామన్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారానికి గుంటూరులో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని తెలిపారు. ఇప్పటి వరకు 24 జిన్నింగ్ మిల్లుల ద్వారా 3,643 మంది రైతుల నుంచి రూ.78.13కోట్ల విలువైన 99,623 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు వివరించారు.

## డబ్బివ్వలేదని గొంతుకోశాడు!

**» రైల్వే కాంట్రాక్టర్‌ను హతమార్చిన మతిస్థిమితంలేని వ్యక్తి**



రామ్మూర్తి


పుత్తూరు అర్బన్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): డబ్బు అడిగితే ఇవ్వలేదనే కోపంతో రైల్వే కాంట్రాక్టర్ కొంతు కోశాడో మతిస్థిమితం వ్యక్తి. పోలీసులు తెలిపిన వివరాలు... తిరుపతి జిల్లా పుత్తూరు మండలం మిట్టపల్లూరుకు చెందిన రామ్మూర్తి(48) ద్విచక్రవాహనంపై బుధవారం మధ్యాహ్నం గొల్లపల్లి సమీపంలో ఉన్న దాబాలో రోటీలు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా కేశవరాజుకుప్పానికి చెందిన రవి.. రామ్మూర్తిని అడ్డగించి డబ్బు డిమాండ్ చేశాడు. డబ్బుల్లేవని చెప్పి వెళ్తుండగా అకస్మాత్తుగా చేతిలో బ్లేడుతో రామ్మూర్తి గొంతు కోసేశాడు. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిపోయిన రామ్మూర్తిని స్థానికులు పుత్తూరు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడే ఓ భవనంలో దాగి ఉన్న రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రవికి మతిస్థిమితం సరిగా లేదని.. కొంత కాలంగా ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేసుకుంటున్నట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

## ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు 20 కోట్లు మంజూరు

**» మంత్రి సవిత**

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లు, ఎంజేపీ గురుకులాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.20.29 కోట్లు మంజూరు చేసినట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. 922 బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు రూ.16.85 కోట్లు విడుదల చేశామన్నారు. 109 ఎంజేపీ గురుకులాల్లో ఇప్పటికే 54 ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేశామని, మిగిలిన 55 గురుకులాల్లో ఆర్వో ప్లాంట్ల కోసం రూ.3.44 కోట్లు మంజూరుచేసి, ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ చేపట్టామని తెలిపారు.

## అబాకస్ పోటీల్లో నగర విద్యార్థుల ప్రతిభ




లబ్బీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ట్రేడ్ సెంటర్ ఈ నెల 16న జరిగిన 22వ అబాకస్ ఇంటర్నేషనల్ ప్రాడిజీ-2025 పోటీల్లో మారుతీ నగర్‌లోని ఎస్ఐపీ అబాకస్ మాచవరం విద్యార్థులు ప్రతిభ చా టారు. ఈ పోటీల్లో సుమారు 10 దేశాల నుం చి 5700 మంది విద్యార్థులు పాల్గొనగా గుణదల సెయింట్ జాన్స్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న టిక్కిసెట్టి సిరిశ్రీజ (ఫౌండేషన్ స్థాయి 3లో) అంతర్జాతీయ చాంపియన్ సా ధించగా మిగిలిన విద్యార్థులు సన్విత్, లికిత్, హేమ అవార్డులు సాధించినట్టు ఎస్ఐపీ నిర్వాహకులు అవ్వారు సుజాత తెలిపారు. ఎస్ఐపీ అబాకస్ మాచవరం స్థాపించిన కొద్దికాలంలోనే ఈ ఘనత సాధించనందుకు సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.



## కోటి దీపోత్సవం

వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వన్‌టౌన్‌లోని శ్రీ విజయేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో కార్తీక కోటి దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వందలాది మంది మహిళలు, యువత హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ తరలివచ్చారు. దీపారాధన చేయించి ఆ వెలుగులో శ్రీ లక్ష్మీదేవి పూజ చేయించారు.







# హైవేపై హాహాకారాలు

## రక్తమోడుతున్న జాతీయ రహదారులు ● ఓవర్ స్పీడ్‌కు అడ్డుకట్ట వేయలేరా..?

**● గంటకు 120 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతున్నాయ్! ● మితిమీరిన వేగానికి కళ్లెం వేయలేని పరిస్థితి**

**జాతీయ రహదారులు రక్తమోడుతున్నాయి. వాహనాల వేగానికి పరిమితి లేకుండా పోయింది. గంటకు 120 కిలోమీటర్లకు పైగా వేగంతో వాహనాలు నడుస్తున్నాయి. ఈసమయంలో ప్రమాదం బారినపడితే వాహనాలు నామరూపాలు లేకుండా ధ్వంసం కావటమే కాకుండా ప్రాణనష్టం ఎక్కువ. ముఖ్యంగా అతివేగం, నిద్రలేమి, మద్యం మత్తు అంటూ కారణాలు చెబుతున్నారే కానీ ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా అధికారులు చర్యలు తీసుకోవటం లేదు.**

**- ఆంధ్రజ్యోతి, కంచికచర్ల**

జాతీయ రహదారులు అద్దంలా మెరిసిపోతున్నాయి. కుదుపులు రావు. స్పీడు బ్రేకర్లు లేవు. డ్రైవర్లు ఎక్సలేటర్ తొక్కి పెడుతున్నారు. వాహనాలు అతివేగంతో ముందుకు దూసుకువెళుతున్నాయి. ఈ వేగానికి ఏ దశలోనూ కళ్లెం పడటం లేదు. ఆర్‌టీసీ బస్సులకు స్పీడ్ లాక్ సిస్టమ్ ఉంది. దీంతో అవి 70 కిలోమీటర్ల వేగాన్ని మించి వెళ్లటానికి ఆస్కారం లేదు. అదే ప్రైవేట్ బస్సుల్లో వేగంపై నియంత్రణ లేదు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో నడుపుతున్నారు. జాతీయ రహదారులు విస్తరణకు ముందు విజయవాడ నుంచి హైదరాబాదు వెళ్లేందుకు 8 గంటల సమయం పట్టేది. రోడ్లు చక్కగా, అనువుగా ఉండటంతో ప్రస్తుతం 5 గంటలు కూడా పట్టటం లేదు. గతంలో రాత్రి పూట ఇద్దరు డ్రైవర్లుండేవారు. ఇప్పుడు



ధ్వంసమైన కావేరి బస్సు (ఫైల్)

ఒక డ్రైవర్‌తోనే నడుపుతున్నారు. గత నెల 23న కర్నూల్ జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తర్వాత కూడా ప్రైవేట్ బస్సుల యాజమాన్యాల్లో మార్పు రాలేదు. నందిగామ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదమే తార్కాణం. ఈ ఘటనలో 8 మంది గాయపడ్డారు. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదు. అతివేగమే కారణమని అధికారులు చెపుతున్నారు. యాజమాన్యాలు స్పందించి ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేయాలి. ప్రమాదాలు జరిగినపుడు డ్రైవర్లు పరారవుతున్నందున బస్సుల నుంచి బయటపడేందుకు తగిన మార్గాలు గురించి ప్రయాణికులకు ముందుగానే అవగాహన కల్పించాలి. 65వ నెంబర్ జాతీయ రహదారిపై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను (బ్లాక్ స్పాట్) అధికారులు గుర్తించారు. నందిగామ బైపాస్, పరిటాల ఆంజనేయ స్వామి విగ్రహం, దొనబండ, కీసర టోల్‌గేట్, జగ్గయ్యపేట ఆటోనగర్ వై జంక్షన్, బలుసుపాడు అడ్డరోడ్డు, షేర్‌మహ్మద్‌పేట వైజంక్షన్, గౌరవరం, నవాబుపేట జంక్షన్ వద్ద తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయా కూడళ్లలో పై ఓవర్లు నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు డీపీఆర్‌లో పేర్కొన్నారు. నందిగామ వద్ద బైపాస్ విస్తరణ పూర్తి కానందున, సర్వీసు రోడ్లు గుంతలమయమై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. 2017లో ముండ్లపాడు వద్ద దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు కల్వర్టులో పడింది. ఈ ప్రమాదంలో 10 మంది మృతిచెందారు. 2018లో మార్నింగ్ స్టార్‌కు చెందిన బస్సు కంచికచర్ల వద్ద రోడ్డుపై నుంచి 20 అడుగుల లోయలోకి పడిపోయింది. ఆ తర్వాత నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో పలు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాలు జరిగినపుడు స్పందిస్తున్న అధికారులు తర్వాత పట్టించుకోవటం లేదు. వాహనాల తనిఖీ ల్లేవు. అడపాదడపా తప్పితే రెగ్యులర్‌గా డ్రంకెన్ డ్రైవ్ లేదు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న పట్టుకునే వారు లేరు. తెల్లవారు జామున చల్లగాలికి డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకునే అవకాశం ఉంది. ఒక సెకను కన్ను మూతబడినా వాహనం అదుపుతప్పుతుంది. టోల్ ప్లాజాల వల్ల తెల్లవారు జామున డ్రైవర్లు ముఖాలు కడుక్కోవటం వల్ల మత్తుపోతుంది. ముండ్లపాడు ప్రమాదం తర్వాత ఈవిధానాన్ని పోలీసులు అవలంభించగా ప్రమాదాల సంఖ్య తగ్గింది. కాలగమనంలో గాలికి వదిలేశారు. వాహనాల వేగాన్ని కొలిచేందుకు స్పీడ్ గన్స్ లేవు. ప్రమాదాల నివారణకు ప్రస్తుతం విజయవాడ ఈపీ ఎస్పీ రాజశేఖర బాబు పలు చర్యలు చేపట్టారు. ప్రతిరోజూ తెల్లవారు జామున 2 నుంచి 5 గంటల వరకు రహదారులపై పోలీసులు ఎక్కడికెక్కడ స్టాప్, వాష్, రిఫ్రెష్ అండ్ గో నిర్వహిస్తున్నారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద ట్రాఫిక్ బ్లింకర్స్, రంబుల్ స్టిక్స్‌లు ఏర్పాటు చేశారు.

## బిల్లుల వసూళ్లు నూరుశాతం పూర్తి చేయండి

విజయవాడ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల వసూళ్లు నూరు శాతం పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి ఆదేశించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఎఈఈతో ఆయన సమావేశమయ్యారు. లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని, పీఎం సూర్యఘర్ పథకంలో మరింత ప్రగతి సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, టీవీఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## యువత ప్రతిభకు ప్రత్యేక వేదికగా నిలవండి: మాజీ మంత్రి ఉమా

గొల్లపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడిలో ఇటీవల స్థాపించిన మాగంటి ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను బుధవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సందర్శించారు. సంస్థ సీఈవో మాగంటి ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ మాగంటి ప్రభాకర్ సంస్థ చేపడుతున్న కార్యకలాపాలను దేవినేని ఉమాకు వివరించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ సర్వీసెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అధునాతన రంగాల్లో సేవలందిస్తున్న తీరును దేవినేని ఉమ ప్రశంసించారు. సంస్థ అభివృద్ధిని పరిశీలించిన ఆయన, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ రంగంలో ముందుకు తీసుకెళ్లే దిశగా మాగంటి ఐటీ సొల్యూషన్స్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. యువత ప్రతిభకు వేదికగా నిలుస్తూ, అంతర్జాతీయ స్థాయి సేవలందించాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. గొల్లపూడిలో ఈ స్థాయి ఐటీ సంస్థ స్థాపన ప్రాంతీయ అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మంచి అవకాశమని ఉమా పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు తమ సేవలను విస్తరించి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

## జిల్లాను వెట్టిచాకిరీ రహితంగా మారుద్దాం: కలెక్టర్

కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెట్టి చాకిరి నిర్మూలనకు జిల్లాస్థాయి నిఘా&పర్యవేక్షణ సంఘాన్ని (విజిలెన్స్&మానిటరింగ్ కమిటీ) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వెట్టి చాకిరి నిర్మూలనపై జరిగిన సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాస్థాయి కమిటీకి కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, జాయింట్ కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, పీడీ డీఆర్‌డీఏ, పీడీ డ్వామా, లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, పోలీసు శాఖల ప్రతినిధులు, ఇద్దరు సామాజిక కార్యకర్తలు, ఎస్సీ లేదా ఎస్టీ వర్గాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కమిటీకి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ కమిటీ గ్రామాలు, పట్టణాలలో వెట్టి చాకిరి బాధితులను గుర్తించి, సంబంధిత వ్యక్తులపై చర్యలకు కలెక్టర్‌కు నివేదిస్తుందన్నారు. వెట్టి చాకిరి చేయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ సంఘం నోడల్ అధికారి&కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ జి.ధనలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, డీపీవో లావణ్యకుమారి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డాక్టర్ కీర్తి, రమాదేవి పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుక

గుణదల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హయత్ ప్లేస్ హోటల్‌లో క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. క్రిస్మస్ పండుగకు స్వాగతం పలుకుతూ సంప్రదాయబద్ధంగా ఈ వేడుక నిర్వహించారు. చారిత్రక నేపథ్యం, ప్రాముఖ్యత కలిగిన కేక్ మిక్సింగ్ వేడుక శతాబ్దాల నాటి నుంచి సంప్రదాయంగా కొనసాగుతోందని హయత్ ప్లేస్ హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.వి.స్వామి తెలిపారు. 17వ శతాబ్దంలో ఐరోపాలో పంట కోతల సమయంలో ఈ ఆచారం మొదలైందన్నారు. కాలక్రమేణ ఇది ఒక సామాజిక వేడుకగా మారి ప్రజల మధ్య ఐకమత్యాన్ని సమృద్ధిని, సంతోషాన్ని పంచుకునే సంకేతంగా నిలిచిందన్నారు. ఆల్కాహాల్ అన్ని రకాల డ్రైఫ్రూట్స్ మిక్స్ చేసి క్రిస్మస్ వేడుకకు ముందుగా ఇలా చేయడం ఆచారంగా ప్రారంభమైందన్నారు. ఇలా మిక్స్‌ను కొన్నివారాల పాటు నానబెడితే క్రిస్మస్ వేడుకలకు ప్రత్యేకమైన రుచి వస్తుందన్నారు. ఇలా తయారు చేసిన స్పెషల్ కేకులు డిసెంబర్‌లో అందుబాటులో ఉంటాయని హోటల్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ చెప్పారు.

**కేక్ మిక్సింగ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది: విరాజ్**

క్రిస్మస్ పండుగకు ముందుగా మిక్స్‌చేసే కేక్ మిక్సింగ్‌లో పాల్గొనడం ఇదే మొదటిసారి కావడం ఆనందంగా ఉందని కేక్ మిక్సింగ్‌కు ప్రత్యేక అతిథిగా హాజరైన బేబి సినిమా ఫేమ్ నటుడు విరాజ్ అశ్విన్ అన్నారు. తనకు విజయవాడ ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మ అంటే ఎంతో ఇష్టమన్నారు. నగరంతో తనకు మరువరాని అనుబంధం ఉందన్నారు. తరచుగా నగరానికి రావడం దుర్గమ్మను దర్శించుకోవడం జరుగుతుందన్నారు. ప్రేక్షకులకు దగ్గరయ్యేలా మరో చిత్రంతో త్వరలో రానున్నట్లు చెప్పారు. నూతన సినిమా అందరినీ ఆలోచింపజేసేలా ఉండబోతోందన్నారు. నూతన సినిమాలో క్యారెక్టర్ల కూర్పు విషయమై కొంతమేర కాలయాపన జరిగిందని త్వరలోనే నూతన సినిమాతో రానున్నానని చెప్పారు.

## దుర్గమ్మ సన్నిధిలో ఎంపీ శివనాథ్ దంపతులు

ఇంద్రకీలాద్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కనకదుర్గమ్మను, మల్లేశ్వరస్వామిని ఎంపీ కేశినేని శివనాథ్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో బీవీ రెడ్డి, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకరబాబు ఎంపీ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి, స్వామివారి దర్శనం కల్పించారు. ఎంపీ దంపతులు మల్లేశ్వరస్వామి అభిషేకం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

## తానా సేవలు అభినందనీయం

**● ఎమ్మెల్యే యార్లగడ్డ**
**● రూ.25 లక్షలతో రైతులు, విద్యార్థులు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీ**

హనుమాన్‌జంక్షన్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, క్రీడాభివృద్ధికి తానా ఫౌండేషన్ ద్వారా ప్రవాసాంధ్రులు అందిస్తున్న వి స్తృత సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే యార్లగ డ్డ వెంకట్రావు అన్నారు. వీరవల్లిలో తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) ఫౌండేషన్ ఆధ్వర్యంలో తానా అధికార ప్రతినిధి కలపాల రాజాబాబు పర్యవేక్షణలో రూ.25లక్షల వ్యయం గల ఉపకరణాలను మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి రైతులకు, విద్యార్థులకు, వృద్ధులకు అందజేశారు. వీరవల్లి చుట్టుపక్క గ్రామాలకు చెందిన రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్‌తో పాటు పొ లంలో పనిచేసేందుకు వీలుగా సేఫ్టీకిట్లను అందజేశారు. 100 మంది వృద్ధులకు దుప్పట్లు, 23 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, క్రీడాపరికరాలు అందజేశారు. వీరవల్లి రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేసిన బో రును ప్రారంభించారు. జన్మభూమిని మర్చిపోకుండా తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, లావు శ్రీనివాసరావుతో కలిసి కార్యదర్శి కసుకుర్తి రాజా గ్రామాభివృద్ధితో పాటు వివిధ వర్గాలకు సేవలందించడం అభినందనీయమన్నారు. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ఉద్యానవన పంటలు, ప్రకృతి వ్యవసాయం చేసేలా పోత్సహించేందుకు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభమైందని, గతం కంటే 20 శాతం అధికంగా కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ బాలాజీ సూచించారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, మండలాధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, టీడీపీ నేతలు గుండపనేని ఉమావరప్రసాద్, సర్పంచ్ పిల్లా అనిత, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి మండాది రవీంద్ర పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కేవీ నరసింహా

## జిల్లాలో కొండలపై డ్రోన్స్‌తో సీడ్‌బాల్స్

**● డ్రోన్స్‌ను ఉచితంగా అందించిన డ్రోన్ రాజా**

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీ రాజశేఖరబాబు సూచనల మేరకు జిల్లా సురక్ష కన్వీనర్ కేవీ నరసింహ జిల్లా మొత్తం కొండలపై డ్రోన్స్ ద్వారా సీడ్‌బాల్స్ వేసే కార్యక్రమం చేపట్టారు. జామ, నేరేడు, సపోటా, చింత మొదలైన ఫలవృక్షాల విత్తనాలు, పర్యావరణానికి, కొండలపై నివసించే ప్రాణులకు ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఈ విత్తనాలను జల్లారు. మొత్తం 70 వేల విత్తనాలు వేశామని, డ్రోన్ రాజాగా పేరుపొందిన గోపి డ్రోన్‌ను ఉచితంగా అందించారని, విత్తనాలను కేరళ నుంచి తెప్పించినట్టు కేవీ తెలిపారు.

కొరియాను ఓడించడం

## భారత ఆర్చరీ చరిత్రలో మైలురాయి

**● ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్**



విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆసియా చాంపియన్‌షిప్ సెమీఫైనల్లో కొరియాను ఓడించడం 45 ఏళ్ల భారత ఆర్చరీ చరిత్రలో ఒక మైలురాయి విజయమని ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ బంగారు పతక విజేత బొమ్మదేవర ధీరజ్ అన్నారు. బుధవారం విజయలక్ష్మీ కాలనీలోని చెరుకూరి వోల్గా-వీఎంసీ ఆర్చరీ అకాడమీని సందర్శించిన ధీరజ్ తన గురువు చెరుకూరి లెనిన్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యన్నారాయణ నుంచి అభినందనలు అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాబోయే అంతర్జాతీయ ఈవెంట్ల కోసం భారత జట్టులో తన స్థానాన్ని దక్కించుకోవడానికి కఠినమైన శిక్షణ పొందుతున్నానని, డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్, వచ్చే ఏడాది టోక్యోలో జరగనున్న ఆసియా క్రీడలకు సన్నాహాలపై తన దృష్టి ఉందన్నాడు. ఆసియా చాంపియన్‌షిప్ విజయం నా ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచిందని, 2024 పారిస్ ఒలింపిక్స్ ప్రతిబింబిస్తూ రికర్వ్ ఈవెంట్‌లో 681 స్కోరుతో 4వ స్థానంలో నిలిచానని, ప్రస్తుతం దేశంలో నంబర్ వన్, ప్రపంచంలో 13వ స్థానంలో ఉన్నానన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆర్చర్లకు మెరుగైన ప్రోత్సాహం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ ఈ క్రీడలకు మరింత మద్దతు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరామ, ఉపాధ్యక్షుడు బొమ్మదేవర శ్రావణ్ కుమార్, గొట్టిపాటి ప్రేమకుమార్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్



# కామెర్ల మూలాలు కనిపెట్టాలి

డాక్టర్! కామెర్లు వస్తే పత్యం ఉండాలంటారు. కానీ ఇది చికిత్స కాదు కదా? కాలేయం దెబ్బతిన్నప్పుడు చికిత్సకు బదులుగా పత్యం ఉండడం వల్ల ఎలాంటి నష్టం జరుగుతుంది? అసలు కామెర్లు ఎందుకొస్తాయి?

- ఓ సోదరి, హైదరాబాద్

కామెర్లు రుగ్మత కాదు. అదొక వ్యాధి లక్షణం. వ్యాధి మూలంగా కాలేయం అనారోగ్యంపాలైతే కామెర్ల లక్షణాలు బయల్పడతాయి. అలాంటప్పుడు కాలేయానికి ఏమై ఉంటుంది? ఎలాంటి ఇబ్బందికి గురై ఉంటుంది? అనేది తెలుసుకోవాలి. కాలేయానికి సోకే రుగ్మతల్లో ప్రధానమైనవి... హెపటైటిస్ ఎ, బి, సి, ఇ!

**హెపటైటిస్ ఎ, ఇ:** హెపటైటిస్ ఎ, ఇలు కలుషిత ఆహారం, అపరిశుభ్ర పరిసరాల ద్వారా సోకుతాయి. ఈ రకం వైరస్‌ల జీవితకాలం 14 రోజులే! కాబట్టి, ఈ వైరస్‌ల కారణంగా కాలేయం జబ్బుపడి, కామెర్లు సోకినా అది తాత్కాలికమే! 6 నుంచి 8 వారాల పాటు తేలిక పాటి ఆహారం తీసుకుంటూ విశ్రాంతి తీసుకుంటే పరిస్థితి చక్కబడుతుంది.

**హెపటైటిస్ బి, సి:** ఇవి ప్రమాదకరమైన వైరస్‌ల కారణంగా సోకుతాయి. రక్తప్రవాహం ద్వారా కాలేయానికి వైరస్ సోకగానే లక్షణాలు మొదలవుతాయి. లక్షణాలు కామెర్లను పోలినట్టే ఉన్నా, సమర్థమైన చికిత్స అందకపోతే, క్రమేపీ కాలేయాన్ని నాశనం చేస్తాయి. టూకీగా చెప్పాలంటే హెపటైటిస్ బి వైరస్‌లు కాలేయ కణాల్లోకి చొరబడి వాటి డిఎన్ఎల స్థానాల్ని ఆక్రమిస్తాయి. హెపటైటిస్ సి వైరస్ కూడా కాలేయ కణాల్ని పాడు చేస్తుంది. ఆ క్రమంలో కాలేయం ఫైబ్రోసిస్, సిర్రోసిస్, లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్... ఇలా ఒక్కో దశ దాటుకుంటూ చివరకు ప్రాణాంతక స్థితికి చేరుస్తుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ప్రమాదకర వైరస్‌లు సోకే వీలున్న మార్గాలన్నిటినీ మూసేయాలి. అదెలాగంటే....

**శరీర ద్రవాలు:** హెపటైటిస్ బి, సి వైరస్‌లు కలిగిన వ్యక్తులను లైంగికంగా కలవకూడదు

**రక్తమార్పిడి:** రక్తం ఇచ్చినా, తీసుకున్నా సిరంజీల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

**ఇంజెక్షన్లు:** తీసుకునే ప్రతి ఇంజెక్షన్ కొత్తదై ఉండాలి

- బ్యూటీ పార్లర్‌లో వాడే సౌందర్య పరికరాల వల్ల కూడా సోకవచ్చు. కాబట్టి ఆ విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి
- సెలూన్లలో వాడే రేజర్ల వల్ల కూడా ఈ వైరస్‌లు సోకుతాయి. కాబట్టి సొంత రేజర్ తీసుకెళ్లాలి


ఇన్ని మార్గాల్లో ఇన్ని రకాల హెపటైటిస్ వైరస్‌లు సోకే ప్రమాదం ఉంది కామెర్లను నిర్లక్ష్యం చేయకూడదు. కాలేయం జబ్బు పడకుండా ఉండాలంటే, తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పరీక్షలతో సోకిన వైరస్ రకాన్ని కనిపెట్టి, వైద్యుల పర్యవేక్షణలో తగిన చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ ఆశా ఎమ్.సుబ్బలక్ష్మి
గ్యాస్ట్రోఎంటరాలజీ అండ్ లివర్ డిసీసెస్ స్పెషలిస్ట్, హైదరాబాద్.

# బొబ్బర్లు తిందాం.. రండి

బొబ్బర్లను అలసందలు అని కూడా పిలుస్తుంటారు. వీటిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. బొబ్బర్లను తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం...

- బొబ్బర్లలో ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. శాకాహారులకు మంచి ఆహారమని చెప్పవచ్చు. వీటిని తినడం వల్ల కండరాలకు శక్తి లభిస్తుంది. వ్యాయామం చేసిన తరువాత ఒక కప్పు ఉడికించిన బొబ్బర్లు తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది.
- బొబ్బర్లలో పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థ వేగవంతమవుతుంది. కడుపులో ఆమ్లత్వం, అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలు తగ్గుతాయి. పేగులు శుభ్రపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది. రక్తనాళాల్లో అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా పనిచేస్తుంది. బొబ్బర్లు ఆకలిని నియంత్రించి శరీరం బరువు పెరగకుండా కాపాడతాయి.
- బొబ్బర్ల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. వీటిలో కేలరీలు కూడా నామమాత్రంగానే ఉంటాయి. కాబట్టి మధుమేహం ఉన్నవారు, అధిక బరువుతో బాధపడేవారు వీటిని ఆహారంలో చేర్చుకోవడం మంచిది.
- బొబ్బర్లలో గర్భిణులకు అవసరమైన ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది గర్భస్థ శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుంది. అలాగే శిశువుల్లో పుట్టుక లోపాలు ఏర్పడకుండా కాపాడుతుంది.
- బొబ్బర్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కారకాలను నిరోధిస్తాయి. ఫ్రీ రాడికల్స్ నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. బొబ్బర్లను తినడం వల్ల అకాల వార్ధక్యం దరిచేరదు.
- బొబ్బర్లలో ఎ, బి, సి, కె విటమిన్లతోపాటు ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, జింక్, మాంగనీస్ లాంటి మినరల్స్ ఉంటాయి. తరచూ బొబ్బర్లను ఆహారంలో చేర్చుకోవడం వల్ల నీరసం తగ్గి ఉత్సాహంగా అనిపిస్తుంది. కంటిచూపు మెరుగుపడుతుంది. ఎముకలు బలోపేతమవుతాయి. మహిళల్లో రక్తహీనత సమస్య తగ్గుతుంది.



# చలికాలంలో వెచ్చగా ఇలా

చలికాలంలో వీచే చల్లని గాలుల వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గి వణుకు పుడుతుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు.

- చలికాలంలో శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే మందపాటి దుస్తులు ధరించాలి. ఊలుతో తయారుచేసిన స్వెట్టర్లు వేసుకున్నా వెచ్చని అనుభూతి కల్గుతుంది.
- చేతులకు గ్లౌజ్‌లు, పాదాలకు సాక్స్, తలకు క్యాప్ ధరించాలి. దీనివల్ల శరీరం ఉష్ణోగ్రతను కోల్పోకుండా వెచ్చగా ఉంటుంది.
- వేడి వేడిగా కాఫీ, టీ, సూప్ తాగితే శరీరంలో అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి వణుకు తగ్గుతుంది. దాహం అనిపించకపోయినా తరచూ గోరువెచ్చని నీరు తాగుతుంటే చలి నుంచి ఉపశమనం లభిస్తుంది. డీహైడ్రేషన్ సమస్యలు కూడా రావు.
- అల్పాహారం, భోజనం, స్నాక్స్‌లను వేడిగా ఉన్నప్పుడే తినాలి. దీనివల్ల శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది.
- చలిగా ఉందంటూ ముడుచుకుని పడుకుంటే కండరాలు పట్టేస్తాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉంటే శరీరంలో రక్తప్రసరణ వేగం పెరిగి వేడి ఉత్పత్తి అవుతుంది. దీంతో వణుకు తగ్గి వెచ్చగా, ఉత్సాహంగా అనిపిస్తుంది.
- చలికాలంలో రోజూ ఉదయం పూట ఎండలో కాసేపు నడిస్తే శరీరం తగినంత వేడిని గ్రహిస్తుంది. అలాగే గోరువెచ్చని నీటితో స్నానం చేస్తూ ఉంటే శరీరం వెచ్చగా ఉంటుంది.
- శీతాకాలంలో రోజూ తినే ఆహారంలో పసుపు, అల్లం, దాల్చిన చెక్క, మిరియాలు లాంటి మసాలా దినుసులు చేర్చుకుంటే శరీర ఉష్ణోగ్రత పెరిగి వణుకు తగ్గుతుంది.



అభినయం



వయసు చిన్నదే. కానీ వందకు పైగా ప్రదర్శనలు... ప్రముఖుల ప్రశంసలు. ఆహూతులను కట్టిపడేసే అభినయం... కూచిపూడి నృత్యంలో నవ కెరటం... **బడిగింజల వెంకటయామిని.** 'తెలుగు నేలపై పుట్టిన నాట్య కళను విశ్వవ్యాప్తం చేయాలనే దృఢ సంకల్పంతో అడుగులు వేస్తున్నా' అని అంటున్న యామినితో 'నవ్య' ముచ్చట్లు.

# నాట్యంలో నవ కెరటం

అద్భుతమైన నర్తనంతో సభికులను కట్టిపడేస్తున్న కూచిపూడి కళాకారిణి యామిని. ఆ నాట్యంలో తనదైన ముద్ర వేయాలని తపిస్తోంది. కడప జిల్లా ప్రొద్దుటూరులోని దొరసానిపల్లెకు చెందిన బడిగింజల వెంకటమనోహర్, శ్రీలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె యామిని. చిన్నప్పటి నుంచి ఆమెకు డ్యాన్స్‌పై ఎంతో మక్కువ. దాన్ని గమనించిన తల్లిదండ్రులు... ఆమెకు సరైన శిక్షణ ఇప్పించాలని అనుకున్నారు. అయితే 'ఆడపిల్లకు డ్యాన్స్‌లు నేర్పి బయటకు పంపడం ఏంటని' బంధువులు కొందరు ఆక్షేపించారు. కానీ ఆమె తల్లిదండ్రులు వాటిని పట్టించుకోలేదు. ఏడేళ్ల వయసులో స్థానిక 'నటరాజ కళాక్షేత్రం'లో చేర్చారు. గురువు పఠాన్ మొహిద్దీన్ వద్ద కూచిపూడి శిక్షణ ప్రారంభించిన యామిని... తక్కువ సమయంలోనే నాట్యంపై పట్టు సంపాదించింది. గురువు సమక్షంలో మెరుగులు అద్దుకుంది. అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి చేరుకుంది.

## వేదిక ఏదైనా...

ప్రొద్దుటూరులోని 'శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల'లో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న యామిని... చిన్నప్పుడే పలు నాట్య పోటీల్లో పాల్గొంది. స్థానికంగానే కాదు... రాష్ట్రంలో ఎక్కడ ఏ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించినా... అందులో ఆమె ప్రదర్శన ఉండాల్సిందే. లయబద్ధమైన తన నాట్యాభినయంతో ఆహూతులను అంతలా ఆకట్టుకుంటోంది. ఎందరో అభిమానులను సంపాదించుకుంది.

## ప్రశంసలు... పురస్కారాలు...

పదేళ్ల కూచిపూడి నాట్య ప్రస్థానంలో యామిని వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో కూడా కూచిపూడి వైభవాన్ని చాటింది. పలువురు ముఖ్యమంత్రులు, రాజకీయ రంగ ప్రముఖులు, ప్రసిద్ధ కళాకారుల సమక్షంలో నర్తించి, ప్రశంసలు అందుకుంది. అత్యద్భుతమైన ప్రతిభకు గానూ ఇప్పటికి యాభైకి పైగా అవార్డులు ఆమెను వరించాయి. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఇటీవల వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలోనూ, యూత్ ఫెస్టివల్‌లోనూ ఆమె ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బహుమతులు గెలుచుకుంది. అరుణాచలం తదితర ప్రముఖ దేవాలయాల్లోనే కాకుండా, హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వంటి ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక వేదికలపై తన నర్తనతో కళాభిమానులను అలరించింది. దూరదర్శన్ నిర్వహించిన ఆడిషన్స్‌లో ఎంపికైన యామిని... నాట్యమే శ్వాసగా జీవిస్తోంది.



- ఎస్.రవికుమార్, ప్రొద్దుటూరు

## గురువుగా స్థిరపడాలని

కూచిపూడిని విశ్వవ్యాప్తం చేసి, మరింత ఆదరణ కల్పించాలనేది నా ఆకాంక్ష. అంతేకాదు... నాట్యంలో గిన్నిస్ రికార్డు నెలకొల్పాలనేది నా లక్ష్యం. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో కూచిపూడి డిప్లమా కోర్సు పూర్తి చేశాను. డిగ్రీ తరువాత పీజీ చేయాలని అనుకొంటున్నాను. భవిష్యత్తులో నాట్య గురువుగా స్థిరపడాలనేది నా కోరిక. ఉన్నత చదువులు చదివితే మంచి ఉద్యోగాలు వస్తాయి... నిజమే. కానీ కూచిపూడి లాంటి సంప్రదాయ కళల్లో రాణిస్తే సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం దక్కుతాయి. నాట్యంవల్ల ఏకాగ్రత పెరుగుతుంది. మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఒత్తిడి దూరం అవుతుంది. ఫలితంగా చదువులోనూ ముందుంటాము. నాట్యాన్ని కెరీర్‌గా ఎంచుకొనేవారికి మంచి ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయి. - యామిని

విజేత



ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా 11 గిన్నిస్ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది చండీగఢ్‌కు చెందిన **జాన్వి జిందాల్.** యూట్యూబ్ వీడియోల ద్వారా ఫ్రీస్టైల్ స్కేటింగ్ మీద పట్టు పెంచుకున్న 17 ఏళ్ల జాన్వి గురించిన ఆసక్తికరమైన కథ ఇది.

# యూట్యూబే గురువు... 11 గిన్నిస్ రికార్డులు

ఇప్పటివరకూ అత్యధిక సంఖ్యలో 19 గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకున్న భారతీయుడిగా మాజీ క్రికెటర్, సచిన్ టెండూల్కర్ పేరు పొందారు. ఇప్పుడు ఆయన తర్వాతి స్థానాన్ని జాన్వి జిందాల్ దక్కించుకుంది. మునుపు 5 గిన్నిస్ ప్రపంచ రికార్డులను కలిగి ఉన్న జాన్వి, తాజాగా మరో ఆరు కొత్త ప్రపంచ రికార్డులను నెలకొల్పింది. 30 సెకన్ల ఇన్‌లైన్ స్కేట్స్‌లో అధిక 360 డిగ్రీల భ్రమణాలు, ఒక నిమిషంలో అత్యధిక 360 డిగ్రీల భ్రమణాలు, 30 సెకన్లలో అత్యధిక వన్ వీల్డ్ 360 డిగ్రీల భ్రమణాలు.. ఇలా మొత్తం ఆరు కొత్త రికార్డులతో అతి పిన్న వయసులో, అత్యధిక గిన్నిస్ రికార్డులు దక్కించుకున్న తొలి భారత మహిళగా జాన్వి గుర్తింపు తెచ్చుకుంది. చండీగఢ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న జాన్వి, ఆన్‌లైన్ వీడియోల ద్వారా, తండ్రి మార్గదర్శకత్వంలో ఫ్రీస్టైల్ స్కేటింగ్ మీద పట్టు పెంచుకుంది. జాతీయ స్కేటింగ్ పోటీలో ఇప్పటికే మూడు స్వర్ణ, రెండు కాంస్య, రెండు రజత పతకాలు గెలుచుకున్న జాన్వి జాతీయ పోటీల కోసం సన్నద్ధమవుతోంది.

## ఆసక్తి మొదలైందిలా...

కుస్తీ పోటీలకు స్వయంగా శిక్షణ ఇచ్చి, అంతర్జాతీయ వేదికల మీద కూతుళ్లను గెలిపించుకున్న తండ్రీకూతుళ్ల కథ... దంగల్ సినిమాగా విడుదలై ప్రపంచవ్యాప్త ప్రజాదరణ పొందిందనే విషయం అందరికీ తెలిసిందే! అయితే ఇదే సినిమా ఎంతోమందికి క్రీడల పట్ల ఆసక్తిని కూడా పెంచింది. జాన్వి తండ్రిని కూడా ఈ సినిమా ఎంతో ఆకట్టుకుంది. తాను కూడా కూతుర్ని క్రీడలకు సంసిద్ధం చేయాలని నిర్ణయించుకున్న తండ్రి మునిష్ జిందాల్, జాన్వికి 8 ఏళ్ల వయసు నుంచే శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాడు. 8వ ఏట జాన్వి, రివర్ జంపింగ్‌లో భాగంగా 30 అడుగుల ఎత్తు నుంచి ఏకంగా మూడుసార్లు దూకి, తన క్రీడా ప్రతిభను చాటుకుంది. సాటి పిల్లలు వెనకడుగు వేసే ఆ విన్యాసంతో జాన్వి తనలోని ధైర్యాన్నీ, క్రీడాస్ఫూర్తినీ చాటుకుంది. ఆ తర్వాత ఏడాదికి ఫ్రీస్టైల్ స్కేటింగ్ పట్ల తనకు మక్కువ ఏర్పడినట్టు గ్రహించి, ఎటువంటి అనుభవజ్ఞుల దగ్గర శిక్షణ తీసుకోకుండానే, కేవలం యూట్యూబ్ వీడియోల ద్వారా ఆ క్రీడలో నైపుణ్యం సాధించి, ప్రపంచ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. ఆమె అసాధారణమైన క్రీడా ప్రయాణం గురించి తండ్రి, మునిష్ మాట్లాడుతూ... 'ఎటువంటి శిక్షణ, ప్రత్యేకమైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక స్థోమతా లేకుండానే మా అమ్మాయి క్రీడలో సత్తా చాటుకుని, ఆధునిక భారతదేశపు చిహ్నంగా మారింది. మక్కువ ఉన్నవాళ్లెవరికైనా నేడు జ్ఞానసముపార్జనకు సరిహద్దులు ఉండవనడానికి మా అమ్మాయే ఉదాహరణ. జాన్వి ఇంటర్నెట్‌నే వ్యక్తిగత కోచింగ్ అకాడమీగా మలుచుకుంది. దాన్నుంచే మెలకువలు నేర్చుకుని, సాధనతో ఈ స్థాయికి ఎదగగలిగింది' అంటూ మీడియాతో చెప్పుకొచ్చారు.

## మరిన్ని పతకాలు తెచ్చేస్తా...

జాన్వి, తాను సాధించిన విజయం గురించి మాట్లాడుతూ...'మరిన్ని రికార్డులు నెలకొల్పి ఎటువంటి వనరులూ, మద్దతూ లేకపోయినా, కలలను నిజం చేసుకోవాలనుకునే యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా మారాలనుకుంటున్నాను. ఇతరులకు ప్రేరణగా మారడం కోసం సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని, నా ప్రయాణాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. జాతీయ స్కేటింగ్ పోటీలకు ప్రొఫెషనల్ కోచింగ్, బలమైన మద్దతు వ్యవస్థలు అవసరం. వాటితో నా దేశానికి మరిన్ని పతకాలు తెచ్చిపెట్టగలుగుతాననే నమ్మకం నాకుంది' అంటోంది జాన్వి జిందాల్. భటిండాలోని రాంపురా ఫూల్ ప్రాంతానికి చెందిన జాన్వి తండ్రి, మునిష్ జిందాల్ మాట్లాడుతూ....'నాతో పాటు దేశం గర్వించదగిన విజయమిది. 17 ఏళ్ల వయసులోనే మా అమ్మాయి, 11 గిన్నిస్ ప్రపంచ రికార్డులు సృష్టించిన ఏకైక యువతిగా చరిత్ర సృష్టించింది. ముందుముందు జాన్వి మరిన్ని రికార్డులు నెలకొల్పగలుగుతుందని భావిస్తున్నా' అంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# కారాగారం.. ఆమెకు దేవాలయం

**"తప్పులు చేయడం మానవ సహజం. ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నవారికి... తమ నడవడికను మార్చుకొని, సాధారణ జీవితం గడపగలిగే అవకాశాన్ని సమాజమే ఇవ్వాలి" అని చెబుతారు అరుణా సరీన్. ఇరవయ్యేళ్లకు పైగా మధ్య ప్రదేశ్‌లోని పలు కారాగారాల్లో యోగ, నైపుణ్య శిక్షణ, ప్రసంగాల ద్వారా వేలాది ఖైదీల్లో మార్పునకు ఆమె దోహదం చేస్తున్నారు. ఇది కూడా దైవానికి చేస్తున్న సేవగానే భావిస్తున్నానంటున్న 83 ఏళ్ల అరుణ అరుదైన ప్రయాణం ఇది.**

"అధ్యాపకురాలుగా, గృహిణిగా తీరిక లేని జీవితం గడిపిన నేను... ఖైదీల శ్రేయస్సు కోసం పని చేస్తానని ఎన్నడూ అనుకోలేదు. దీనికి కారణం ఢిల్లీకి చెందిన మంజు గోయెల్ అని చెప్పాలి. మంజు... ఢిల్లీలో 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సంస్థలో పని చేసేవారు. తన తల్లిదండ్రులను కలుసుకోడానికి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ వచ్చారు. అప్పటికే నేను కూడా అక్కడ 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' కార్యకర్తగా పని చేస్తున్నాను. స్థానిక జైలులో ఒక కోర్సును నిర్వహించాలని మంజు అనుకున్నారు.. నన్ను కూడా తోడుగా రమ్మన్నారు. అలా మొదటిసారిగా జబల్‌పూర్ కారాగారంలో మొదటిసారి అడుగు పెట్టాను. ఆ తరువాత... ఆదివారాలు, సెలవు దినాలు మినహా... మిగిలిన అన్ని రోజులూ జైలును సందర్శిస్తూనే ఉన్నాను. అందరూ రోజూ గుడికి ఎలా వెళ్తారో... నేను జైలుకు అలా వెళ్తా ఉంటాను.

## నా భర్తకు నచ్చేది కాదు...

నా భర్త కల్నల్ సరీన్ సైన్యంలో పని చేసేవారు. ఆయన ఉద్యోగ రీత్యా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉండాల్సి వచ్చింది. నేను వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలిని. నా భర్తకు జబల్‌పూర్ బదిలీ అయినప్పుడు... అక్కడే కేంద్రీయ విద్యాలయలో టీచర్‌గా చేరాను. అప్పుడే 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'కు సంబంధించిన ఒక కరపత్రాన్ని చూశాను. అందులో పేర్కొన్న అంశాలు నన్ను ఆకర్షించాయి. ఆ సంస్థలో చేరి... విపశ్యన ధ్యానం అభ్యసించాను. అయితే నా భర్తకు ఇదంతా పెద్దగా నచ్చేది కాదు. నన్ను 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' క్యాంపస్ దగ్గర వదిలేసి వెళ్ళేవారు. ఒక రోజు అక్కడి నిర్వాహకులు ఆయనను కూడా అభ్యాసం చెయ్యాలని కోరారు. "సరే, మీరు చెబుతున్నారు కాబట్టి ఈ రోజు చేస్తాను. రేపటి నుంచి ఈ వైపు రానే రాను" అన్నారాయన. కానీ ఆయన కూర్చొని, అభ్యాసం చేసిన తరువాత... రోజూ రావడం మొదలుపెట్టారు. పదవీవిరమణ చేశాక... ఆ సంస్థ నిర్వహించే పలు కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యారు. నేను కూడా ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఇద్దరం కలిసి ఆ సంస్థలో పని చేసేవాళ్ళం. ఇంతలో నా భర్త హఠాత్తుగా మరణించారు. తీవ్రమైన వేదనకు గురైన నాకు ఆధ్యాత్మికతే ఆలంబనగా నిలిచింది.

## 23 ఏళ్ల నుంచి...

ఆరు నెలల తరువాత... 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'లో యోగా టీచర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నాను. ఆ సంస్థ తరఫున వివిధ ప్రాంతాల్లో బోధన ప్రారంభించాను. అంతకుముందే మంజూ గోయెల్‌కు తోడుగా జబల్‌పూర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ కేంద్ర కారాగారానికి వెళ్ళాను. మేము ఖైదీలను కలుసుకున్నాం. వారితో మాట్లాడాం. వారి కోసం యోగా తరగతులు నిర్వహించాం. మహిళా ఖైదీలతో, జైలు అధికారులతో, సిబ్బందితో కలిసి భోజనం చేశాం. మా తరగతులకు వచ్చిన స్పందన గమనించిన అధికారులు... వాటిని కొనసాగించాల్సిందిగా కోరారు. మంజు తిరిగి ఢిల్లీ వెళ్ళాల్సి ఉండడంతో... ఆ బాధ్యతను నేనే స్వీకరించాను. అప్పటి నుంచి... ఇరవై మూడేళ్ళుగా దాదాపు ప్రతి రోజూ ఉదయం జైళ్ళకు వెళుతున్నాను. ఇండోర్, భోపాల్, సత్నాలతో సహా మధ్యప్రదేశ్‌లో పదికి పైగా కారాగారాల్లో కార్యక్రమాలు నిర్వహించాను. అవి సాధారణంగా మూడు గంటల సేపు కొనసాగుతాయి. ధ్యానం, శ్వాస తీసుకోవడంలో టెక్నిక్స్ లాంటి వాటితో కూడిన హ్యాపీనెస్ ప్రోగ్రామ్, సుదర్శన క్రియతో కూడిన అడ్వాన్స్‌డ్ కోర్సులు దీనిలో ప్రధానంగా ఉంటాయి. ఒత్తిడి కలిగించే కోర్టిసోల్ లాంటి హార్మోన్లను గణనీయంగా తగ్గించడానికి, రోగనిరోధక వ్యవస్థను పటిష్ఠ పరచడానికి, ఒత్తిడి నుంచి విముక్తికి, మెదడు పనితీరు మెరుగుపరచడానికి ఇవి దోహదం చేస్తాయి."



## అలాంటివి తగ్గాయి...

ఇన్నేళ్ళలో నేను 50 వేలమందికి పైగా ఖైదీలతో తరగతులు నిర్వహించాను. మహిళలకు ముత్యాల ఆభరణాలు, బొమ్మలు తయారీ, బ్యూటీషియన్ కోర్సులు, పురుషులకు వాహనాల మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనులు తదితరాల్లో శిక్షణ కూడా మా సంస్థ నేతృత్వంలో అందించాం. జబల్‌పూర్ కారాగారంలో ఒక చిన్న తయారీ యూనిట్ ఏర్పాటుకు దోహదం చేశాం. యోగాభ్యాసం, ధ్యానం, నైపుణ్య శిక్షణ తదితరాల వల్ల ఖైదీల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఖైదీల మధ్య కొట్లాటలు, ఆగ్రహావేశాలు చాలా ఎక్కువగా ఉండేవి. మత్తుపదార్థాలకు అలవాటుపడినవారు డిప్రెషన్‌కు గురై, చేతులు కోసుకోవడం లాంటి చర్యలకు పాల్పడేవారు. జైలు నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారు. మా కార్యక్రమాలతో వారిలో పరివర్తన వచ్చింది. 'రెడ్ క్రాస్' సంస్థతో కలిసి డి-అడిక్షన్ తరగతులు కూడా నిర్వహిస్తున్నాం. ఎంతోమంది ఖైదీలు తమ సమస్యలను నాకు వినిపిస్తారు. జీవితంలో ఇకపై తప్పులు చెయ్యబోమనీ, గౌరవంగా జీవిస్తామనీ చెబుతారు. వారందరిలో అధికశాతం పరిస్థితులకు బాధితులు. వారిలో మార్పుకోసం దాదాపు రెండు దశాబ్దాలకు పైగా నేను అంకితం కావడం... దైవ సంకల్పంగా భావిస్తున్నాను.

# స్పోర్ట్స్



## 'హాల్ ఆఫ్ ఫేమ్'లో ఫెడరర్



న్యూయార్క్: టెన్నిస్ దిగ్గజం, స్విట్జర్లాండ్ స్టార్ రోజర్ ఫెడరర్‌కు ప్రతిష్టాత్మక 'టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కింది. వచ్చే ఏడాదికిగాను ఆటగాళ్ల కేటగిరిలో రోజర్ ఒక్కడే ఈ పురస్కారానికి ఎంపికైనట్టు నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. 2026 ఆగస్టులో జరిగే వేడుకలో రోజర్‌కు హాల్ ఆఫ్ ఫేమ్ పురస్కారాన్ని అందజేస్తారు. ప్రొఫెషనల్ కెరీర్‌కు దూరమై ఐదేళ్లు దాటినవారిని ఆటగాళ్ల విభాగంలో హాల్ ఆఫ్ ఫేమ్ ఎంపికకు అర్హులుగా పరిగణిస్తారు.

## క్వార్టర్స్‌లో అర్జున్ అవుట్

**ముగిసిన భారత్ పోరు ● చెస్ వరల్డ్‌కప్**

పనాజీ: చెస్ వరల్డ్‌కప్‌లో అర్జున్ ఇరిగేసి పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో అర్జున్ 1.5- 2.5తో వి యి (చైనా) చేతిలో ఓడాడు. దీంతో ఈ వరల్డ్‌కప్‌లో భారత కథ ముగిసింది. క్వార్టర్స్ టైబ్రేక్ తొలి గేమ్ డ్రా కాగా.. రెండో గేమ్‌లో అర్జున్ ఓటమి పాలయ్యాడు. జోస్ మార్టినెజ్ (మెక్సికో)పై సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్), షంక్‌లాండ్ (అమెరికా)పై ఎసిపెంకో (రష్యా) గెలిచి సెమీస్ చేరారు.

## రెండో రౌండ్‌లో లక్ష్య, ప్రణయ్

సిడ్నీ: స్టార్ షట్లర్ లక్ష్యసేన్, ప్రణయ్‌తోపాటు పలువురు భారత ఆటగాళ్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో లక్ష్యసేన్ 21-17, 21-13తో సు లీ యాంగ్ (తైపీ)ని చిత్తు చేశాడు. ఇతర మ్యాచ్‌ల్లో ప్రణయ్ 6-21, 21-12, 21-17తో యోహానెస్‌పై, ఆయుష్ షెట్టి 21-11, 21-15తో యువాన్‌పై, తరుణ్ 21-13, 17-21, 21-19తో జొహాన్సెన్‌పై, కిడాంబి శ్రీకాంత్ 21-19, 19-21, 21-15తో లీ చియాపై నెగ్గాడు. అయితే కిరణ్ జార్జ్ నిషిమోటా చేతిలో పోరాడి ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

## వేర్వేరు గ్రూపుల్లో భారత్, పాక్

**అండర్-19 వరల్డ్‌కప్ షెడ్యూల్**

దుబాయ్: జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరిగే అండర్-19 వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను ఐసీసీ బుధవారం విడుదల చేసింది. ఈ టోర్నీ వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరగనుంది. వరల్డ్‌కప్‌లో పాల్గొంటున్న 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. అయితే, లీగ్ దశలో భారత్, పాక్ పరస్పరం తలపడే అవకాశం లేదు. గ్రూప్-ఎలో భారత్‌తోపాటు న్యూజిలాండ్, బంగ్లాదేశ్, అమెరికా ఉండగా.. పాక్‌కు గ్రూప్-బిలో చోటు దక్కింది. భారత జట్టు జనవరి 15న ఆరంభ మ్యాచ్‌లో అమెరికాతో, 17న బంగ్లాతో, 24న న్యూజిలాండ్‌తో తలపడనుంది.

# సైలెంట్ బుల్లెట్

**ధనుష్ గురిపెడితే స్వర్ణమే**





ధనుష్ శ్రీకాంత్.. భారత షూటింగ్‌లో సరికొత్త సంచలనం. వినలేడు.. మాట్లాడలేడు.. కానీ అతడి గన్ 'స్వర్ణా'లను గర్జిస్తోంది. టోక్యోలో జరుగుతున్న బధిర ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో వ్యక్తిగత స్వర్ణంతోపాటు మిక్స్‌డ్ విభాగంలో కూడా పసిడితో ఔరా.. అనిపించాడు 23 ఏళ్ల ధనుష్. సాధారణ షూటర్లకు దీటుగా నిలుస్తున్న ఈ హైదరాబాద్ కుర్రాడు.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నాడు.

**బొమ్మల సాయంతో..**

ధనుష్‌కు పుట్టుక నుంచే వినబడదు. కానీ, అతడి తల్లిదండ్రులు మాత్రం ఎప్పుడూ ప్రత్యేక అవసరాలు కలిగిన వాడిగా చూడలేదు. షూటింగ్ పట్ల అతడి ఆసక్తిని గుర్తించి హైదరాబాద్‌లోని గగన్ నారంగ్ అకాడమీకి తీసుకెళ్లారు. అయితే, బధిరుడు కావడంతో కోచింగ్ ఇవ్వడం పెద్ద సవాల్‌గా మారింది. దీంతో డ్రాయింగ్‌లు, బొమ్మల సాయంతో ధనుష్‌కు శిక్షణ ఇవ్వడం ఆరంభించారు. అతడికి తల్లి ఆషా ఎంతో అండగా నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు వెళ్లడం ఆరంభమైన తర్వాత నెమ్మదిగా సంజ్ఞా భాష నేర్చుకొన్నాడు.

**జాతీయ జట్టుకు ఆడిన బధిరుడిగా..**

2018 తెలంగాణ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్ బరిలోకి దిగిన ధనుష్ జూనియర్, యూత్, సీనియర్ విభాగాల్లో పతకాలు సాధించాడు. 2019లో ఖేలో యూత్ గేమ్స్‌లో పాల్గొని ఈ క్రీడల్లో మెడల్ సాధించిన తొలి బధిర ప్లేయర్‌గా రికార్డులకెక్కాడు. 16 ఏళ్ల వయసులో 2019లో జరిగిన ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత అండర్-21 జట్టుకు ఎంపికయ్యాడు. ఈ క్రమంలో జాతీయ జట్టులో చోటుదక్కించుకొన్న తొలి బధిర షూటర్‌గా నిలిచాడు. అనేక ఈవెంట్లలో సత్తాచాటినా.. ట్రయల్స్‌లో విఫలమవడంతో 2022 ఆసియా క్రీడల్లో పోటీపడే చాన్స్ లభించలేదు. కానీ, అదే ఏడాది బ్రెజిల్ వేదికగా జరిగిన డెఫ్లింపిక్స్‌లో తలపడిన ధనుష్.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రపంచ రికార్డుతో స్వర్ణ పతకాన్ని సాధించాడు. డెఫ్లింపిక్స్‌లో దేశానికి తొలి బంగారు పతకం అందించిన షూటర్‌గా అందరి దృష్టిని ఆకర్షించాడు. మిక్స్‌డ్‌లో ప్రియేషా దేశ్‌ముఖ్‌తో కలసి మరో పసిడి కొల్లగొట్టాడు. తాజాగా టోక్యో డెఫ్లింపిక్స్‌లోనూ స్వర్ణాలను నిలబెట్టుకొని చరిత్ర సృష్టించాడు. 2023లో జూనియర్ వరల్డ్‌కప్‌లోనూ స్వర్ణంతో మెరిశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

## ప్రాంజలి జోడీకి పసిడి


**కుశాగ్రకు కాంస్యం ● బధిర ఒలింపిక్స్**

టోక్యో: బధిర ఒలింపిక్స్ (డెఫ్లింపిక్స్)లో భారత షూటర్లు మరో స్వర్ణ పతకాన్ని మన ఖాతాలో చేర్చారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్లో ప్రాంజలి ధూమల్/అభినవ్ దేశ్వాల్ ద్వయం పసిడి దక్కించుకుంది. ఫైనల్లో ప్రాంజలి జోడీ 16-6తో చైనీస్ తైపీ జంట యా జు కావో/మింగ్ జుయి సూను చిత్తుచేసి విజేతగా నిలిచింది. ఇరాన్ ద్వయానికి కాంస్యం దక్కింది. ఇక, 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో కుశాగ్రసింగ్ రజావత్ కాంస్యం నెగ్గి బుధవారం భారత్‌కు రెండో పతకాన్ని అందించాడు. ఫైనల్స్‌లో కుశాగ్ర 224.3 స్కోరుతో మూడో స్థానంలో నిలిచాడు. ఇప్పటిదాకా టోర్నీలో భారత షూటర్లు మొత్తం 11 పతకాలు కొల్లగొట్టారు.

## హోప్ శతక్కొట్టినా..

**విండీస్‌కు తప్పని ఓటమి**
**కివీస్‌దే వన్డే సిరీస్**

నేపియర్: కెప్టెన్ షాయ్ హోప్ (69 బంతుల్లో 109 నాటౌట్) సెంచరీ చేసినా న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో వెస్టిండీస్‌కు పరాజయం తప్పలేదు. బుధవారం జరిగిన మ్యాచ్‌ను వర్షం వల్ల 34 ఓవర్లకు కుదించారు. తొలుత విండీస్ 247/9 స్కోరు చేసింది. ఛేదనలో కివీస్ 33.3 ఓవర్లలో 248/5 స్కోరు చేసి నెగ్గింది.



**హోప్ అరుదైన రికార్డు:** సెంచరీతో హోప్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్ హోదా కలిగిన అన్ని దేశాలపై శతకం చేసిన ఏకైక బ్యాటర్‌గా షాయ్ ఘనత సాధించాడు. ఓవరాల్‌గా హోప్‌కు ఇది 50 ఓవర్ల ఫార్మాట్‌లో 19వ సెంచరీ. దాంతో వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన రెండో వెస్టిండీస్ బ్యాటర్‌గా లారాతో హోప్ సమంగా నిలిచాడు. క్రిస్ గేల్ (25) అగ్రస్థానంలో ఉన్నాడు.

**లక్షన్నర జనాభాగల దేశం..**

## 'ఫిఫా' బెర్త్ పట్టేసింది



కింగ్‌స్టన్ (జమైకా): 2026 'ఫిఫా' వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన అతి చిన్న దేశంగా కురాకో చరిత్ర సృష్టించింది. కరీబియన్ సముద్రంలోని ఓ ద్వీపమైన కురాకో జనాభా కేవలం లక్షా 56 వేలు. 2018లో అతి తక్కువ జనాభా 3.50 లక్షలు కలిగిన ఐస్‌లాండ్ మెగా ఈవెంట్‌కు క్వాలిఫై అయింది. ఆ రికార్డును కురాకో బద్దలుకొట్టింది. క్వాలిఫయర్స్‌లో జమైకాతో మ్యాచ్‌ను కురాకో 0-0తో డ్రా చేసుకొంది. దీంతో గ్రూప్-బి టాపర్‌గా మెగా కప్ బెర్త్‌ను పట్టేసింది.

## ఫైనల్లో నిఖత్

**ప్రపంచ బాక్సింగ్ కప్**



గ్రేటర్ నోయిడా: సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తెలుగమ్మాయి నిఖత్ జరీన్ 21 నెలల అనంతరం తొలి అంతర్జాతీయ పతకాన్ని ఖరారు చేసుకుంది. ఈ తెలంగాణ స్టార్ ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో 51 కిలోల విభాగంలో టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. బుధవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో నిఖత్ 5-0తో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ జెనీవా గుల్సెవార్‌ను చిత్తుచేసింది. ఈ ప్రదర్శనతో కనీసం రజతాన్ని ఖాయం చేసుకున్న నిఖత్.. స్వర్ణం కోసం చైనీస్ తైపీకి చెందిన గువా యి గ్జువాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. 29 ఏళ్ల నిఖత్ చివరిగా గతేడాది ఫిబ్రవరిలో స్ట్రాంజా మెమోరియల్ టోర్నీలో పతకం సాధించింది. ఇక, ప్రపంచ బాక్సింగ్ కప్‌లో నిఖత్‌తో పాటు మిగతా భారత బాక్సర్లు జాస్మిన్ లంబోరియా (57 కిలోలు), జాదుమణి సింగ్ (50 కిలోలు), పవన్ బర్త్వాల్ (55 కి), సచిన్ సివాచ్ (60 కి), హితేశ్ గులియా (70 కి) తమ విభాగాల్లో ప్రత్యర్థులను ఓడించి ఫైనల్ చేరారు. ఓవరాల్‌గా 15 మంది భారత బాక్సర్లు గురువారం జరిగే ఫైనల్స్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు.

## ఆంధ్ర ఇన్నింగ్స్ విజయం

● సౌరభ్‌కు ఐదు వికెట్లు
● జార్ఖండ్‌తో రంజీ

జంషెడ్‌పూర్: సౌరభ్ కుమార్ (5/47), త్రిపురాన విజయ్ (3/39) విజృంభించడంతో.. గ్రూప్-ఎలో జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర ఇన్నింగ్స్ 81 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. 239 పరుగుల లోటుతో.. ఆటకు నాలుగో, ఆఖరి రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 34/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జార్ఖండ్ 158 రన్స్‌కే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో జార్ఖండ్ 328 పరుగులు చేయగా.. ఆంధ్ర 567/6 వద్ద డిక్లేర్ చేసింది. ఆంధ్రకు బోనస్ సహా 7 పాయింట్లు లభించాయి.

## హైదరాబాద్ భారీ ఓటమి

**281 పరుగులతో జమ్మూ గెలుపు**

జమ్మూ: అబిద్ ముస్తాక్ (7/68) స్పిన్ ఉచ్చులో చిక్కుకొన్న హైదరాబాద్ ఘోర ఓటమిని చవిచూసింది. గ్రూప్-డిలో జమ్మూ కశ్మీర్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ 281 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. 472 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు నాలుగో, ఆఖరి రోజైన బుధవారం 169/7తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 190 రన్స్‌కే కుప్పకూలింది. జమ్మూ 170, 422 స్కోర్లు చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 121 రన్స్ సాధించింది.

## గర్ల్‌ఫ్రెండ్‌తో హార్దిక్ 'ముద్దు' ముచ్చట!



ముంబై: ప్రముఖ మోడల్ మహికా శర్మతో రిలేషన్‌షిప్‌లో ఉన్న టీమిండియా బ్యాటర్ హార్దిక్ పాండ్యా ఆమెతో కలిసున్న ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. అందులో ఒక ఫొటోలో మహిక, హార్దిక్ సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోయారు. మరో చిత్రంలో మహికాను హార్దిక్ బుగ్గపై ముద్దు పెడుతూ కనిపించాడు. మేరీల్యాండ్ యూనివర్సిటీ నుంచి కమ్యూనిటీ సైకాలజీలో డిగ్రీ అందుకున్న 31 ఏళ్ల మహిక.. ప్రస్తుతం మోడల్‌గా రాణిస్తోంది.

## ఫిట్‌గా లేకపోయినా.. ఆడేందుకు గిల్ పట్టు?

గువాహటి: దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్‌కు ముందు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తీరు వివాదాస్పదంగా మారింది. మెడనొప్పితో బాధపడుతున్న గిల్‌ను వైద్యుల బృందం విశ్రాంతి తీసుకోవాలని సూచించినా.. పెడచెవిన పెట్టిన అతడు జట్టుతో కలసి గువాహటి చేరుకొన్నాడు. పూర్తి ఫిట్‌గా లేకపోయినా.. బరిలోకి దిగడానికే ఆసక్తి చూపిస్తున్నాడని సమాచారం. మెడనొప్పి చాలా వరకు తగ్గినా.. మ్యాచ్ ఫిట్‌నెస్ కష్టమేనని అంటున్నారు.

# బిజినెస్



**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,24,860 ▲ | 1,14,450 ▲ | 1,73,000 ▲ |
| విజయవాడ | 1,27,000 ▼ | 1,20,000 ▲ | 1,60,000 ▲ |
| విశాఖపట్నం | 1,27,780 ▲ | 1,15,000 ▲ | 1,76,000 ▲ |
| రాజమండ్రి | 1,24,850 ▲ | 1,14,450 ▲ | 1,58,000 ▲ |
| ప్రొద్దుటూరు | 1,24,800 ▲ | 1,14,820 ▲ | 1,61,100 ▲ |
| ముంబై | 1,23,880 ▲ | 1,13,480 ▲ | 1,58,120 ▲ |

## బజాజ్ ఆటో చేతికి కేటీఎం

న్యూఢిల్లీ: ఆస్ట్రియా క్రేందంగా పనిచేసే బైక్‌ల తయారీ కంపెనీ కేటీఎం ఏజీ ఈక్విటీలో మెజారిటీ వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసినట్టు బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రకటించింది. యూరోపియన్ రెగ్యులేటరీ సంస్థల నుంచి అన్ని అనుమతులు లభించడంతో ఈ ప్రక్రియ పూర్తయినట్టు తెలిపింది.

## టాప్-100 దేశీయ బ్రాండ్ల విలువ

# రూ.46.32 లక్షల కోట్లు

» జీడీపీలో 13 శాతానికి సమానం
» హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్ బ్రాండ్

**కాంటార్ నివేదిక**

న్యూఢిల్లీ: భారత్‌లోని టాప్-100 బ్రాండ్ల మొత్తం విలువ ఈ ఏడాదిలో 52,350 కోట్ల డాలర్లకు (రూ.46.32 లక్షల కోట్లు) చేరుకుందని లండన్‌కు చెందిన మార్కెట్ రీసెర్చ్ కంపెనీ కాంటార్ వెల్లడించింది. ఇది భారత జీడీపీలో దాదాపు 13 శాతానికి సమానమని 'కాంటార్ బ్రాండ్జ్ రిపోర్ట్ 2025' పేరుతో బుధవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈసారి జాబితాలోని బ్రాండ్ల మొత్తం విలువ వార్షిక ప్రాతిపదికన 6 శాతం పెరిగింది. భారత ఆర్థిక వ్యవస్థలో బ్రాండ్ విలువ ప్రాముఖ్యత పెరుగుతున్నదని, అంతర్జాతీయ విస్తరణ ద్వారా మరింత వృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయని నివేదిక అభిప్రాయపడింది.

**మరిన్ని విశేషాలు...**

- ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి దేశంలో అత్యంత విలువైన బ్రాండ్‌గా నిలిచింది. బ్యాంక్ బ్రాండ్ విలువ 18 శాతం వృద్ధితో దాదాపు 4,500 కోట్ల డాలర్లకు (రూ.3.98 లక్షల కోట్లు) చేరుకుంది. 2014లో బ్రాండ్జ్ ఇండియా రిపోర్టు విడుదల చేయడం ప్రారంభమైన నాటి నుంచి ఈ బ్యాంక్ బ్రాండ్ విలువ నాలుగింతలకు పైగా పెరిగింది.
- దేశంలో అతి పెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 4,420 కోట్ల డాలర్ల (రూ.3.91 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో రెండో స్థానంలో ఉంది.
- 4,110 కోట్ల డాలర్ల (రూ.3.64 లక్షల కోట్లు) బ్రాండ్ విలువతో ఎయిర్‌టెల్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ (2,550 కోట్ల డాలర్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (2,060 కోట్ల డాలర్లు) వరుసగా 5, 6 స్థానాల్లో నిలిచాయి.
- 100 బ్రాండ్ల మొత్తం విలువలో టాప్-10 బ్రాండ్ల వాటా 47 శాతంగా ఉంది.
- బ్రాండ్ విలువ అత్యంత వేగంగా పెరుగుతున్న కంపెనీల్లో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానంలో ఉంది. జొమాటో బ్రాండ్ వేల్యూ గడిచిన ఏడాది కాలంలో 69 శాతం పెరిగింది.
- అల్ట్రాటెక్ సిమెంట్, హ్యుండయ్ సహా 18 కంపెనీలకు ఈ జాబితాలో తొలిసారి చోటు లభించింది. 111 విభాగాలకు చెందిన 1,620 బ్రాండ్లపై 1.45 లక్షల మంది వెల్లడించిన అభిప్రాయాల ఆధారంగా ర్యాంకింగ్‌లు కేటాయించడం జరిగిందని కాంటార్ వెల్లడించింది.

## మోసాల కట్టడికి 1600 సిరీస్ ఫోన్ నంబర్లు

**బ్యాంకులు జనవరి 1 నుంచే అమలు చేయాలి ● ట్రాయ్ ఉత్తర్వులు**




న్యూఢిల్లీ: మోసపూరిత ఫోన్ కాల్స్ ద్వారా జరిగే ఆర్థిక నేరాల కట్టడికి ట్రాయ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ వంటి నియంత్రణ సంస్థల పరిధిలోని బ్యాంకులు, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్‌ఎస్ఐ) కంపెనీలు తమ కస్టమర్లకు చేసే సర్వీస్, లావాదేవీల ఫోన్ కాల్స్ కోసం తప్పనిసరిగా 1600 నంబర్ సిరీస్ ఫోన్ నంబర్లు మాత్రమే వాడాలని ఆదేశించింది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలకూ ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు, విదేశీ బ్యాంకులు ఈ నిబంధనలను వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచే అమలు చేయాలని ట్రాయ్ ఆదేశించింది. వాయిస్ కాల్స్ ద్వారా జరిగే ఆర్థిక మోసాలను కట్టడి చేసేందుకు ట్రాయ్ ఈ చర్య తీసుకుంది. దీంతో ఏది మోసపూరిత కాల్, ఏది నిజమైన కాల్ అని తెలుసుకునే అవకాశం ఈ సంస్థల ఖాతాదారులకు ఏర్పడనుంది. కాగా ఐఆర్‌డీఏఐతో జరుగుతున్న చర్చలు పూర్తయ్యాక బీమా కంపెనీలకూ ఈ సిరీస్ వర్తిస్తుందని ట్రాయ్ తెలిపింది. ట్రాయ్ ఆదేశాల ప్రకారం ఈ దిగువ సంస్థలు ఆయా తేదీల నుంచి 1600 సిరీస్ ఫోన్ నంబర్లు అమలు చేయాలి.

- మ్యూచువల్ ఫండ్ సంస్థలు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు మాత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి.
- క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లకు మార్చి 15, 2026 నుంచి.
- ఆర్‌బీఐ నియంత్రణలోకి వచ్చే పెద్ద ఎన్‌బీఎఫ్‌సీలు, పేమెంట్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు (ఎస్ఎఫ్‌బీ) వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 లోగా.
- ఇతర ఎన్‌బీఎఫ్‌సీలు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, ఇతర చిన్న సంస్థలు 2026 మార్చి 1 నుంచి.
- కేంద్రీయ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీలు, పెన్షన్ ఫండ్ మేనేజర్లు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15లోగా.

## రిలీఫ్ ర్యాలీతో మార్కెట్ దూకుడు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం బాగా పుంజుకుంది. సెన్సెక్స్ 513.45 పాయింట్ల లాభంతో 85,186.47 వద్ద ముగియగా నిఫ్టీ 142.60 పాయింట్ల లాభంతో 26,052.65 వద్ద క్లోజయింది. ఇంట్రా డేలో సెన్సెక్స్ 85,236.77 పాయింట్లు, నిఫ్టీ 26,074.65 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు, త్వరలోనే భారత-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్న అంచనాలు బుధవారం సూచీలను లాభాల బాట పట్టించాయి. జపాన్, దక్షిణ కొరియా, హాంకాంగ్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నా, భారత మార్కెట్లు మాత్రం లాభాలతో ముగియడం విశేషం. అమెరికాలో ఏఐ బుడగ పేలితే ఎఫ్‌పీఐలు మళ్లీ పెద్ద ఎత్తున భారత మార్కెట్‌లో కొనుగోళ్లకు దిగుతాయన్న అంచనాలూ ఇందుకు దోహదం చేశాయి. అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వు మినిట్స్ కోసం మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోంది.

**నేటి నుంచి ఇన్ఫోసిస్ బైబ్యాక్ :** ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ బైబ్యాక్ గురువారం ప్రారంభం కానుంది. కంపెనీ మదుపరుల నుంచి రూ.18,000 కోట్లతో 10 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.1,800 చొప్పున బైబ్యాక్ చేయనుంది. దీంతో బీఎస్ఈలో బుధవారం ఇన్ఫోసిస్ కంపెనీ షేర్లు 3.74 శాతం లాభంతో రూ.1,541.25 వద్ద ముగిశాయి. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రూ.23,098.48 కోట్లు పెరిగి రూ.6,40,297.11 కోట్లకు చేరింది.




## కెనరా బ్యాంక్ @10,000

**బెంగళూరులో కొత్త బ్రాంచ్ ఏర్పాటు**

బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని కెనరాబ్యాంక్ 10 వేలు బ్రాంచ్‌ల మైలురాయిని చేరింది. 120వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని బుడిగెరె క్రాస్‌లో కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేయడంతో ఈ రికార్డు నమోదు చేసింది. ఈ బ్రాంచిని బ్యాంక్ ఎండీ, సీఈఓ సత్యనారాయణ రాజుతో కలిసి కేంద్ర ఆర్థిక సర్వీసుల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు ప్రారంభించారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**



| 20వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 630 | విజయవాడ | 660 |
| వరంగల్ | 632 | గోదావరి | 630 |
| చిత్తూరు | 663 | విశాఖపట్నం | 625 |
| | | డజను గుడ్లు రూ. | 90 |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 117 | విజయవాడ | 111 |
| వరంగల్ | 117 | గుంటూరు | 115 |
| కరీంనగర్ | 117 | ఒంగోలు | 115 |
| మహబూబ్‌నగర్ | 117 | చిత్తూరు | 114 |
| కర్నూలు | 117 | నెల్లూరు | 119 |
| విశాఖపట్నం | 110 | అనంతపురం | 119 |
| గోదావరి | 111 | | |

## జేపీ అసోసియేట్స్ రేసులో అదానీయే విజేత

### రూ.14,535 కోట్ల బిడ్‌కు రుణదాతల కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ: ఆర్థికంగా దివాలా తీసిన జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్) ఎట్టకేలకు అదానీ గ్రూప్ పరమైంది. దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా జేపీ అసోయేట్స్ రుణదాతల కమిటీ (సీఓసీ) అదానీ గ్రూప్ సమర్పించిన రూ.14,535 కోట్ల బిడ్‌కే ఆమోదం తెలిపింది. ఇతర బిడ్డర్లతో పోలిస్తే, అధిక మొత్తంలో అప్‌ఫ్రంట్ చెల్లింపులు (రూ.6,005 కోట్లు) ఆఫర్ చేసిన అదానీ బిడ్‌కే సీఓసీ మొగ్గుచూపింది. జేపీ అసోసియేట్స్‌ను చేజిక్కించుకునేందుకు అదానీ గ్రూప్, వేదాంత, దాల్మియా సిమెంట్స్ పోటీపడ్డాయి. ఈ మూడింటిలో అదానీ బిడ్‌కు 89 శాతం ఓట్లు వచ్చినట్లు తెలిసింది. దాల్మియా సిమెంట్, వేదాంత బిడ్లు ఆ తర్వాత స్థానంలో ఉన్నాయి. జేపీ అసోసియేట్స్ రియల్టీ, సిమెంట్ తయారీ, ఆతిథ్య సేవలు, విద్యుత్, ఇంజనీరింగ్ అండ్ నిర్మాణ రంగాల్లోకి విస్తరించింది. రుణదాతలకు రూ.57,185 కోట్లు బకాయిల చెల్లింపుల్లో విఫలమవడంతో గత ఏడాది జూన్‌లో ఈ గ్రూప్‌పై కార్పొరేట్ దివాలా పరిష్కార చర్యలు ప్రారంభమయ్యాయి.

**ఏడబ్ల్యూఎల్‌లో మరో 13 శాతం వాటా విక్రయం :** అదానీ గ్రూపు ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్‌లో (గతంలో అదానీ విల్మర్ లిమిటెడ్) మరో 13% వాటాను విల్మర్ ఇంటర్నేషనల్‌కు విక్రయించింది. అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ కమోడిటీస్ ఎల్‌ఎల్‌పీ ఈ కంపెనీలో 13% వాటాకు సమానమైన 16.9 కోట్ల ఈక్విటీ షేర్లను విల్మర్ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ లెన్స్ పీటీఈ లిమిటెడ్‌కు విక్రయించింది. తదనంతరం ఏడబ్ల్యూఎల్‌లో అదానీ కమోడిటీస్ వాటా 20% నుంచి 7 శాతానికి తగ్గగా.. లెన్స్ పీటీఈ లిమిటెడ్ వాటా 56.94 శాతానికి పెరిగింది. ఎఫ్ఎంసీజీ వ్యాపారం నుంచి వైదొలిగి మౌలిక రంగ పోర్ట్‌ఫోలియోపై ప్రధానంగా దృష్టిని కొనసాగించే వ్యూహంలో భాగంగా ఏడబ్ల్యూఎల్‌లో 20% వాటాను విల్మర్‌కు రూ.7,150 కోట్లకు విక్రయించనున్నట్లు అదానీ గ్రూప్ ఈ జూలైలోనే ప్రకటించింది.

### బొండాడతో అదానీ ఒప్పందం

హైదరాబాద్‌కు చెందిన బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్‌తో అదానీ గ్రూప్ దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న అదానీ గ్రూప్ కార్పొరేట్ కార్యాలయంలో అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఎండీ, సీఈఓ వినీత్ జైన్, బొండాడ ఇంజనీరింగ్ చైర్మన్/ఎండీ బీ రాఘవేంద్ర రావు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ అగ్రిమెంట్‌లో భాగంగా అదానీ గ్రూప్ నిర్మించే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు బొండాడ ఇంజనీరింగ్ వ్యూహాత్మక డిజైన్, నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించనుంది. ఈ ఒప్పందం తొలి విడతలో భాగంగా అదానీ గ్రూప్ 650 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు పనులను బొండాడకు అప్పగించింది.

## హెల్త్‌కేర్ బడ్జెట్ పెంచాలి: సంగీతా రెడ్డి

న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగానికి కేటాయింపులు పెంచాని ఈ రంగానికి ప్రాతినిధ్యం వహించే నాట్‌హెల్త్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, అపోలో హాస్పిటల్స్ జేఎండీ సంగీతా రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. 'భవిష్యత్‌లో దేశ ఆరోగ్య రంగం బహుముఖ విస్తరణకు ఈ కేటాయింపులు ప్రారంభ వేదికగా మారాలి' అన్నారు. ఈ కేటాయింపులు ఈ రంగంలో మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సరికొత్త ఆవిష్కరణలకు దోహదం చేసేలా ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో మన దేశం ఇప్పటికే తన సత్తా నిరూపించుకుందని సంగీతా రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఈ రంగానికి కావలసిందల్లా విస్తరణకు అవసరమైన ఆర్థిక, విధాన పరమైన ప్రోత్సాహకాలు మాత్రమేనన్నారు. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం సైతం అవసరమన్నారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుంటే భవిష్యత్ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రపంచంలోనే మేలైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను మన దేశంలో అభివృద్ధి చేసుకోవచ్చని సంగీతా రెడ్డి సూచించారు.

# దేవదాయంలో హుండీ దొంగలు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



దేవాలయాల్లో హుండీలను కొట్టేసే దొంగల వ్యవహారాలు అక్కడక్కడా వెలుగులోకి వస్తుండడం చూస్తూనే ఉంటాం!.. కానీ.. 'కంచే చేను మేసే' చందంగా దేవదాయశాఖలోనూ కొందరు ఇంటి దొంగలు హుండీలను కాజేస్తున్నట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో 'పరకామణి' చోరీ కేసు ఎంత సంచలన సృష్టించిందో తెలిసిందే! ఒక్క తిరుమల తిరుపతి దేవస్థానంలోనే కాదు రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న చాలా ఆలయాల్లో ఇలాంటి చోరీలు కోకోల్లలుగా జరుగుతున్నాయి. హుండీ లెక్కిపుల సమయంలో.. కోట్ల రూపాయల కానుకల సొమ్ములు పక్కదారి పడుతున్నాయి. శాఖ పరిధిలో దాదాపు 20 వేలకు పైగా ఆలయాలు ఉండగా.. వీటికి హుండీతో పాటు దాతల విరాళాలు, భూములు, షాపుల లీజులతో పాటు ఇతర మార్గాల ద్వారా కోట్లలో ఆదాయం వస్తోంది. అయితే ఇలా వచ్చే కానుకల సొమ్ములో సగటు 15 నుంచి 20 శాతం పక్కదారిపడుతున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా హుండీలు తెరిచే సమయంలో సరైన పద్ధతులు పాటించకపోవడం, పాత కాలం నాటి మార్గదర్శకాల వల్లే దేవుడి సొమ్ము ఇలా ఇంటి దొంగలపాలవుతోంది. ఇందులో ఆలయ అధికారుల, పాలక మండలితో పాటు వంశపారపర్య ధర్మకర్తల మండలి పాత్ర కూడా ఉంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో పల్నాడు జిల్లాలోని ఒక ప్రముఖ ఆలయంలో వెలుగు చూసిన సంఘటనే దీనికి ఉదాహరణ. పల్నాడు జిల్లాలో పేరొందిన ఓ అమ్మవారి ఆలయానికి ఏటా కోట్లలో ఆదాయం వస్తోంది. సదరు ఆలయంలో ప్రతి మూడు, నాలుగు నెలలకోసారి హుండీ తెరిచి, కానుకల సొమ్మును స్థానిక సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కిస్తూ వస్తున్నారు. అనంతరం ఆ ఆదాయం మొత్తం బ్యాంకుల్లో జమ చేయాలని అందరి సమక్షంలో నిర్ణయిస్తున్నారు. కానీ ఆలయ ధర్మకర్తలు, అధికారులు కలిసి సగం మాత్రమే బ్యాంకుల్లో డిపాజిట్ చేసి, మిగిలిన ఆదాయాన్ని ఇరు వర్గాల వారు వాటాలేసుకుంటున్నట్లు బయటపడింది. ధర్మకర్తల మండలి, అధికారుల మధ్య వాటాల దగ్గర తేడా రావడంతో పెద్ద రాద్ధాంతమే జరిగింది. ఈ పంచాయితీ కాస్త దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం వరకూ వచ్చినా.. ఉన్నతాధికారులు సైతం మిన్నకుండిపోవడగం గమనార్హం. దీంతో పాటు ఆలయాల్లో హుండీల్లో చేతులు పెట్టి చోరీ చేసే సంఘటనలూ నమోదవుతున్నాయి. ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న గుంటూరు జిల్లాకు చెందిన ఒక ఈవోకి దేవుడి కానుకల్లో బంగారం అంటే భలే ఇష్టం! సర్వీస్‌లోకి వచ్చినప్పటి నుంచి ఏ ఆలయంలో పనిచేసినా.. అక్కడ హుండీలో వచ్చే బంగాగంలో తనకంటూ కొంత వెనకేసుకుంటారని పేరుంది. ఇప్పటి వరకూ కొన్ని వందల గ్రాముల బంగారాన్ని దారిమళ్లించేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కొంత మంది ఈవోలు హుండీ లెక్కింపు అనంతరం.. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని సొంత కార్లలో తీసుకుని ఇళ్లకు వెళ్తున్న సందర్భాలూ ఉన్నాయి. ఈ డబ్బులు బ్యాంకు ఖాతాల్లోకి వెళ్తున్నాయో.. లేదా సొంత అవసరాలకు వాడుతున్నారో అన్న దానిపై ఎవరి పర్యవేక్షణా ఉండడం లేదు.

### చాలా ఆలయాల్లో కానుకల సొమ్ము గుటుక్కు

- దేవుడి ఆదాయం.. ఇంటి దొంగల జేబుల్లోకి..!
- కొంతమంది ఈవోలకు హుండీలో బంగారమే టార్గెట్
- లెక్కింపు సమయంలో 15 నుంచి 20 శాతం పక్కదారి
- ఆలయ అధికారులు, ధర్మకర్తల సహకారంతోనే!

### సెంట్రలైజ్డ్ వ్యవస్థ ఉండాలి

రాష్ట్రంలో మేజర్ ఆలయాలతో పాటు, డీసీ, ఆర్జేసీ, ఏసీ కేడర్ ఆలయాల్లో హుండీలు తెరిచే సమయంలో సరైన మార్గదర్శకాలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సెంట్రలైజ్డ్ పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు సీఎం చంద్రబాబు.. ప్రతి పనికీ టెక్నాలజీ ఉపయోగించండి, అప్పుడే పారదర్శకతతో పాటు జవాబుదారీతనం ఉంటుందని చెబుతున్నా.. అధికారులు మాత్రం ఇంకా మూస పద్ధతితో బీసీ కాలం నాటి మార్గదర్శకాలనే పాటిస్తున్నారు. దీని వల్ల దేవుడికి రావాల్సిన ఆదాయం.. ఇంటి దొంగ చేతుల్లోకి వెళ్తోంది. ఇకనైనా ప్రతి ఆలయంలో సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే హుండీలు తెరిచేలా ఏర్పాటు చేయాలి. 6 సి ఆలయాలకు సంబంధించిన సీసీ కెమెరాలు అసిస్టెంట్ కమిషనర్, 6 బీ ఆలయాలు డిప్యూటీ కమిషనర్, 6 ఎ ఆలయాల్లోని సీసీ కెమెరాలను ఆర్జేసీ కార్యాలయాలకు అనుసంధానం చేయాలి. అక్కడి నుంచి సెంట్రలైజ్డ్ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, హుండీల లెక్కింపు సమయంలో సదరు ఆలయానికి సంబంధించిన సీసీ కెమెరాలను ఏసీ, డీసీ, ఆర్జేసీ కార్యాలయల్లో పర్యవేక్షిస్తే తప్ప హుండీ దొంగలకు చెక్ పడే పరిస్థితి లేదు!.

# టీటీడీలో అవే తప్పులు!

- జీడిపప్పు టెండర్లలో నకిలీ వే బిల్లులు.. చెన్నై కంపెనీల నిర్వాకం

(తిరుపతి- ఆంధ్రజ్యోతి)

టీటీడీని కల్తీ నెయ్యి వ్యవహారం కుదిపేస్తోంది. సరఫరా చేసిన సంస్థలతో పాటు అనుమతించినవారు బాధ్యులుగా మారుతున్నారు. అయినా టీటీడీ అధికారులు మాత్రం గత తప్పుల నుంచి పాఠాలు నేర్వక పోగా మళ్లీ మళ్లీ అవే తప్పులు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా చెన్నైకి చెందిన రెండు కంపెనీలు నకిలీ వే బిల్లులు సమర్పించి జీడిపప్పు టెండర్లలో పాల్గొనడం కలకలం రేపుతోంది. 1.20 లక్షల కిలోల జీడిపప్పు సరఫరా కోసం సెప్టెంబరు 3న టీటీడీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. చెన్నైకి చెందిన క్రిస్టీ క్వాలిటీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫంక్షనల్ అండ్ ఇన్నోవేటివ్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు పలు కంపెనీలు బిడ్‌లో పాల్గొన్నాయి. దీనికోసం ఒక్కోటీ రూ.28 లక్షలు చొప్పున ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఎంఈడీ) చెల్లించాయి. ఇందులో పాల్గొనే సంస్థకు 75 వేల కేజీల జీడిపప్పు సరఫరా చేసిన అనుభవం తప్పనిసరిగా ఉండాలని నిబంధన విధించారు. అయితే చెన్నైకి చెందిన పై రెండు సంస్థలూ సమర్పించిన వేబిల్లులను క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా నకిలీవని తేలడంతో వాటిని డిస్‌క్వాలిఫై చేసి వదిలేశారు. తప్పుడు పత్రాలతో టెండర్‌లో పాల్గొనే వారి ఈఎండీ మొత్తాన్ని నిబంధనల ప్రకారం వెనక్కి ఇవ్వకూడదు. అలాగే వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. విజిలెన్స్ శాఖకు సమాచారం అందించి, కేసులు నమోదు చేయించాలి. అయితే టీటీడీ అధికారులు మాత్రం నిబంధనలు పక్కన పెట్టి ఆ సంస్థల పట్ల ఉదారంగా వ్యవహరించారు. వారు కట్టిన రూ.56 లక్షల మొత్తాన్ని వెనక్కి ఇచ్చేశారు. కనీసం వాటిని బ్లాక్ లిస్టులో కూడా పెట్టలేదు. సెల్ఫ్ డిక్లరేషన్‌నూ అధికారులు పట్టించుకోలేదు. పైగా భవిష్యత్తులో జరిగే టీటీడీ మార్కెటింగ్ టెండర్లలో పాల్గొనేందుకు వారికి అనుమతి ఇచ్చినట్టు కనిపిస్తోంది. తాజాగా పిలిచిన యాలకుల టెండర్లో సైతం ఈ సంస్థలు పాల్గొన్నట్టు సమాచారం. ఈ టెండర్లను త్వరలోనే ఖరారు చేసే అవకాశం ఉంది.

# చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

## పోలీస్ కథతో...



అర్జున్ సర్జా, ఐశ్వర్యా రాజేశ్ జంటగా నటించిన చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేశ్ లక్ష్మణన్ దర్శకత్వంలో జి. అరుళ్‌కుమార్ నిర్మించారు. నిర్మాత ఏఎన్ బాలాజీ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ 'ఇంటిలిజెన్స్ మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. నిజాల్ని నిర్భయంగా వెలుగులోకి తేవాలని తపించిన ఓ సిన్సియర్ పోలీసాఫీసర్‌కు వృత్తి నిర్వహణలో ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయన్నది ఇతివృత్తం'అని చెప్పారు. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది అని దర్శకుడు చెప్పారు.

## ఇది అభిమానుల సినిమా



**రామ్ పోతినేని**

"ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రం నన్ను చాలా భావోద్వేగానికి లోను చేసింది. ఈ కథకూ, ఇందులోని సాగర్ పాత్రకు కనెక్ట్ అయినంతగా ఇంతవరకూ ఏ చిత్రానికీ కనెక్ట్ అవ్వలేదు. వ్యక్తిగతంగా నాకు ఈ సినిమా చాలా ప్రత్యేకమైనది' అని అన్నారు రామ్ పోతినేని. ఆయన కథానాయకుడిగా పి మహేశ్‌బాబు తెరకెక్కించిన చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ బేనర్‌పై నవీన్ యర్నేని, వైరవిశంకర్ నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర కీలక పాత్రలో నటించారు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్ పోతినేని మాట్లాడుతూ 'సినిమా, అభిమానుల విషయంలో ఎప్పటినుంచో నా మనసులో ఉన్న ఆలోచనలకి ప్రతిరూపమే ఈ చిత్రం. ఇది అభిమానుల సినిమా' అని అన్నారు. 'రామ్ కెరీర్‌లోనే గర్వకారణంగా మిగిలిపోయే చిత్రమిది.' అని పి. మహేశ్‌బాబు అన్నారు. 'విభిన్నమైన కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని చేశాం. చాలా కాలం మాట్లాడుకునేలా ఉంటుంది' అని వైరవిశంకర్ తెలిపారు.

## గుర్తుండిపోయే థ్రిల్లర్



రాజ్ తరుణ్, అమృత చౌదరి జంటగా రిత్విక్‌కుమార్ తెరకెక్కిస్తున్న చిత్రం 'టార్టాయిస్'. శశిధర్, విజయ్‌కుమార్, సంతోశ్, రాంబాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలె ఈ చిత్రాన్ని ప్రారంభించారు మేకర్స్. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం కథ చాలా విభిన్నంగా ఉంటుంది. నా కెరీర్‌లోనే గుర్తుండిపోయే చిత్రం అవుతుంది' అని అన్నారు. 'ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చే థ్రిల్లర్ ఇది' అని రిత్విక్ కుమార్ చెప్పారు.



## ప్రేక్షకుల మదిలో నిలిచేలా ప్రేమంటే

**నాగచైతన్య**

'ప్రేక్షకులను ఆకట్టుకునే మంచి ప్రేమకథా చిత్రం 'ప్రేమంటే'. దర్శకుడు ఓ కొత్త పాయింట్‌తో తెరకెక్కించారు. ప్రేక్షకుల మదిలో నిలిచిపోయేలా ఉంటుంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని నాగచైతన్య అన్నారు. ప్రియదర్శి, ఆనంది జంటగా నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. పుస్కుర్ రామ్‌మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా నాగచైతన్య పాల్గొని సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో యువతరం దూసుకెళ్తోంది. ఇది మంచి పరిణామం. ఈ సినిమా అందర్నీ అలరిస్తుందన్న నమ్మకం ఉంది' అని తెలిపారు. టాలీవుడ్ చరిత్రలో 'ప్రేమంటే' ఓ మంచి చిత్రంగా మిగిలిపోతుంది' అని నిర్మాత సురేశ్‌బాబు అన్నారు. 'చిత్రబృందం సమష్టి కృషికి గొప్ప ఉదాహరణ ఈ చిత్రం' అని జాన్వీనారంగ్ పేర్కొన్నారు. 'ఈ చిత్రంతో ప్రేక్షకుల నుంచి మరింత ప్రేమ దక్కుతుందని ఆశిస్తున్నా' అని ప్రియదర్శి తెలిపారు.

## సంగీత దర్శకుడిగా సంతృప్తినిచ్చింది



**భీమ్స్ సిసిరోలియో**

'ఇప్పటివరకూ నేను మాస్, ఫ్యామిలీ, యూత్‌ఫుల్ చిత్రాలకు మాత్రమే సంగీతం అందించాను. '12 ఏ రైల్వే కాలనీ' లాంటి ఒక థ్రిల్లర్‌కు తొలిసారి సంగీతం అందిస్తున్నాను. ఈ తరహా చిత్రాలకూ మంచి సంగీతం అందివ్వగలననే నమ్మకం ఈ చిత్రంతో కలిగింది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు కూడా అదే ఫీలవుతారు' అని భీమ్స్ సిసిరోలియో అన్నారు. అల్లరి నరేశ్ కథానాయకుడిగా నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా భీమ్స్ సిసిరోలియో మీడియాతో మాట్లాడారు. 'ఈ చిత్రంలో సౌండ్ విభిన్నంగా ఉంటుంది. కొత్త ఇన్‌స్ట్రుమెంట్స్ వాడాం. నిన్ననే సినిమా చూశాను. కొత్త తరహా అనుభూతి కలిగింది. ఈ సినిమా సంగీత దర్శకుడిగా నాకు సంతృప్తినిచ్చింది. అవుట్‌పుట్ చూశాక అల్లరి నరేశ్, దర్శక నిర్మాతలు అభినందించారు. సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రస్తుతం 'భక్తమహాశయులకు విజ్ఞప్తి, మన శంకరవరప్రసాద్ గారు, డెకాయిట్, బైసన్ నాయుడు' తదితర చిత్రాలకు సంగీతం అందిస్తున్నాను' అని భీమ్స్ చెప్పారు.

## రాణి మరియా బయోపిక్



పేదలు, మహిళా సాధికారత కోసం కృషి చేసిన సామాజిక కార్యకర్త, కేరళకు చెందిన సిస్టర్ రాణి మరియా జీవితం ఆధారంగా తెరకెక్కిన మలయాళ చిత్రం 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్'. షైషన్ పి.ఊసెఫ్ దర్శకత్వంలో సాంద్రా డిసౌజా రాణా నిర్మించారు. విన్సీ అలోషియస్ టైటిల్ పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత డాక్టర్ ఐ. లూర్దు రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా తెలుగు హక్కులు పొందినందుకు సంతోషంగా ఉంది. రాణి మరియా జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, ఆమె మరణం, హంతకుల పట్ల వారి కుటుంబం చూపిన క్షమాగుణం ప్రధానాంశాలుగా ఈ చిత్రం తెరకెక్కింది. వందకు పైగా అంతర్జాతీయ పురస్కారాలను గెలుచుకున్న చిత్రమిది' అని చెప్పారు.

## ఈ తరాన్నీ అలరించే కొదమసింహం

**చిరంజీవి**



"కొదమసింహం' చిత్రం నాకూ, రామ్‌చరణ్‌కూ ఫేవరేట్ మూవీ. చిన్నప్పుడు వాళ్లమ్మ ఈ సినిమా క్యాసెట్ పెడితే తప్ప చరణ్ భోజనం చేసేవాడు కాదు. రీ రిలీజ్‌తో ఈతరం ప్రేక్షకులు కూడా 'కొదమసింహం' చిత్రాన్ని ఆస్వాదిస్తారు' అని చిరంజీవి అన్నారు. 1990లో విడుదలైన ఈ సినిమాను 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వరరావు విడుదల చేస్తున్నారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిరంజీవి వీడియో సందేశం ద్వారా మాట్లాడారు. 'నాకు కౌబాయ్ చిత్రాలంటే ఇష్టం కావడంతో కథ వినగానే 'కొదమసింహం' చేసేందుకు అంగీకరించాను. ఈ తరం ప్రేక్షకులనూ అలరిస్తుంది. డాన్స్, ఫైట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. కైకాల నాగేశ్వరరావు మాట్లాడుతూ 'మంచి క్వాలిటీతో 'కొదమసింహం చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నాం. రాజ్‌కోటి సూపర్‌హిట్ సాంగ్స్‌తో పాటు నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. అప్పట్లో కొత్త తరహా పాత్రలో చిరంజీవి గారిని చూపించాలని ఈ సినిమా చేశాం' అని అన్నారు. ఈ సినిమా అంత గొప్పగా రావడానికి చిరంజీవి గారి పట్టుదలే కారణం అని దర్శకుడు మురళీమోహన్‌రావు అన్నారు.

## రాజూ రాంబాయిల కథ



'మన కళ్ల ముందు జరుగుతున్న కథ అనే అనుభూతిని ఇచ్చే చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఒక ఊళ్లో కూర్చొని మన మధ్య జరుగుతున్న సంఘటనలను చూస్తున్నట్లే ఉంటుంది' అని నిర్మాత సాయికృష్ణ అన్నారు. అఖిల్ రాజ్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రమిది. వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి, సాయికృష్ణ నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ 'నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. గాఢతతో నిండిన ప్రేమకథాంశంతో సాయిలు తీర్చిదిద్దారు. ఆయన నిజాయితీ వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చింది. గ్రామీణ పాత్రల్లో హీరో హీరోయిన్ల నటన సినిమాకు ప్రత్యేకార్షణ. దర్శకుడు వేణు ఊడుగుల నిర్మాణంలో పాలుపంచుకోవడంతో పాటు విలువైన సలహాలు ఇచ్చారు. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

## నేడు పట్నాకు చంద్రబాబు, లోకేశ్

» నితీశ్ ప్రమాణస్వీకారానికి హాజరుకానున్న నేతలు

» వ్యక్తిగత కారణాలతో పవన్ గైర్హాజరు

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బిహార్ సీఎంగా నితీశ్ కుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హాజరవుతున్నారు. ఇద్దరు నేతలకూ ఆహ్వానం అందడంతో వారు గురువారం ఉదయం ఎనిమిది గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి పట్నా వెళుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అక్కడ బయలుదేరి మూడు గంటలకు అమరావతికి చేరుకుంటారు. కాగా, నితీశ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కూ ఆహ్వానం అందింది. అయితే వ్యక్తిగత కారణాల దృష్ట్యా కార్యక్రమానికి పవన్ హాజరు కావడం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

## పర్యాటకంలో 2027కి ఏపీ టాప్: నూకసాని

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యాటకరంగంలో 2027 నాటికి ఏపీ, దేశంలో నంబర్ 1గా నిలుస్తుందని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సీఐఐ సమ్మిట్‌లో రూ.13.61 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు కుదిరాయి. వాటి ద్వారా 16.32 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఒక్క పర్యాటకరంగంలోనే రూ.18 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. వాటి ద్వారా 97 వేల ఉద్యోగాలు వస్తాయి. పర్యాటక రంగానికి జగన్ హయాంలో చేసింది శూన్యం. రుషికొండను జగన్ నాశనం చేశారు' అని నూకసాని ఆరోపించారు.

## డ్రెయిన్ల నిర్మాణానికి 29 వేల కోట్లతో అంచనాలు

» బీపీఎస్, ఎల్ఆర్ఎస్ వినియోగించుకోండి: మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 123 మునిసిపాలిటీల్లో కచ్చా డ్రెయిన్ల నిర్మాణానికి రూ.29 వేల కోట్లతో అంచనాలు తయారుచేశామని మంత్రి పి.నారాయణ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం రాత్రి ఆయన గోదావరి-2027 పుష్కర పనులపై సమీక్షించారు. 'మునిసిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీమ్‌లను వినియోగించుకుని కట్టడాలను రెగ్యులరైజ్ చేయించుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే అక్రమ కట్టడాలను మునిసిపల్ అధికారులు కూల్చివేస్తారు. పుష్కరాలకు సంబంధించి రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించాం' అని తెలిపారు.

## సీఐ సతీశ్‌ది ప్రభుత్వ హత్యే: బొత్స

గుణదల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'సీఐ సతీశ్‌ది హత్యా, ఆత్మహత్యా? అన్నది చెప్పాల్సింది ప్రభుత్వమే. ఆధారాలు లేకుండా ఇది వైసీపీ నాయకులపనే అని మా వాళ్లపై బురద జల్లడం ఏంటి?' అని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. గుణదలలోని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. సీఐ సతీశ్ విషయంలో ఆధారాలు ఉంటే నిరూపించాలంటూ కూటమి నాయకులకు సవాల్ విసిరారు. 'సీఐ సతీశ్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని నేను అంటున్నా. వచ్చి నన్ను అరెస్టు చెయ్యండి' అని బొత్స అన్నారు.

## మాతృభూమిలో పెట్టుబడులు పెట్టండి

» ప్రవాస భారతీయులకు కేంద్ర మంత్రి పెమ్మసాని పిలుపు

న్యూఢిల్లీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): భిన్న సంస్కృతులు, జాతులతో కూడిన వైవిధ్యమే భారత్‌కు గొప్ప ఆస్తి అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రవాస భారతీయులు మాతృభూమిలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. అజర్‌బైజాన్ రాజధాని బాకులోని తెలుగు, తమిళ అసోషియేషన్లు, ఇండియన్ స్టూడెంట్ అసోషియేషన్ సభ్యులతో మంత్రి పెమ్మసాని భేటీ అయ్యారు.

## పెట్టుబడుల కార్యరూపానికి ప్రత్యేక అధికారిని నియమించండి: విజయసాయి

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 613 ఎంఓయూల ద్వారా రూ. 13.25 లక్షల పెట్టుబడులను సీఐఐ సదస్సులో తీసుకు వచ్చినందుకు ప్రభుత్వాన్ని వైసీపీ మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి ఎక్స్ వేదికగా అభినందించారు. పెట్టుబడుల ఒప్పందాలు కార్యరూపం దాల్చేలా పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. 75 శాతం గ్రౌండింగ్ అయినా రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు.

## పీజీ ప్రవేశాల్లో తొలుత ప్రొవిజనల్ లిస్టు

» మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో హెల్త్ వర్సిటీ నిర్ణయం

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివిధ వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల తుది జాబితాలు వెల్లడించే ముందు ప్రొవిజనల్ లిస్టులు ప్రకటించాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. ఇటీవల ముగిసిన గవర్నమెంట్ కోటా ఎంబీబీఎస్ ప్రవేశాల జాబితాల ప్రకటన తుది దశలో.. కొందరు విద్యార్థులు నీట్‌లో తమకన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి సీట్లు కేటాయించారని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. విద్యార్థుల అభ్యంతరాలకు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ప్రస్తుత పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు హెల్త్ వర్సిటీ ముందుగా ప్రొవిజనల్ జాబితాలు ప్రకటిస్తుంది.

## మినీ మార్టులుగా చౌక ధరల దుకాణాలు

» తక్కువ ధరకే నాణ్యమైన సరుకులు: మంత్రి నాదెండ్ల

ముదినేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతున్నట్టు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం ఏలూరు జిల్లా ముదినేపల్లిలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ చౌక ధరల దుకాణాలను మినీ మార్టులుగా రూపొందించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. తక్కువధరకు నాణ్యమైన సరుకులు అందిస్తామని తెలిపారు.

## గౌరవ వేతనం రూ.7,500 ఇవ్వాలి

» ప్రభుత్వానికి రేషన్ డీలర్ల సమాఖ్య విజ్ఞప్తి

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆరు దశాబ్దాలుగా పని చేస్తున్న రేషన్ డీలర్లకు నెలకు రూ.7,500 చొప్పున గౌరవ వేతనం చెల్లించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రేషన్ డోర్ డెలివరీకి అదనపు ఖర్చులు భరించాల్సి వస్తున్నందున డీలర్ల కమీషన్‌ను క్వింటాకు రూ.200కు పెంచాలని డిమాండ్ చేసింది. బుధవారం విజయవాడలో సంఘ కార్యాలయంలో డీలర్ల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

## కి'లేడీ' అరుణ బెయిల్‌పై తీర్పు నేడు

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు చెందిన కి'లేడీ' నిడిగుంట అరుణ బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగిశాయి.

### తలారి రంగయ్య ముందస్తు బెయిల్‌పై వాదనలు పూర్తి


నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుడు తలారి రంగయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. దీంతో 23న తీర్పు వెలువరిస్తామని న్యాయాధికారి లెనిన్‌బాబు పేర్కొన్నారు.

### చోఖ్రా కస్టడీకి సిట్ పిటిషన్

లిక్కర్ స్కామ్‌లో నిధుల మళ్లింపునకు షెల్ కంపెనీలను ఏర్పాటు చేసిన ముంబైవాసి అనిల్ చోఖ్రాను వారం పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణను కోర్టు ఈనెల 23కు వాయిదా వేసింది.

### నిధుల దుర్వినియోగం కేసులో మరో నిందితుడు అరెస్టు

సీఐడీ, అగ్నిమాపక శాఖలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన కేసులో సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత బి.కొండలరావును ఏసీబీ అరెస్ట్ చేసింది. ఆయన్ను బుధవారం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచగా, డిసెంబరు 3 వరకు రిమాండ్ విధించారు.



## చంద్రబాబు తిరుగులేని వ్యక్తి

**పాలసీల రూపకల్పనలో ఆయన ఆలోచనలకు హ్యాట్సాఫ్: ఆనంద్ మహీంద్ర**

**ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం సరికొత్తదారులు వేస్తున్నాను: చంద్రబాబు**



అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్ర గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర బుధవారం సీఎం చంద్రబాబును ఉద్దేశించి ఎక్స్‌లో చేసిన పోస్టు ఆసక్తికరంగా మారింది. 'చంద్రబాబు తిరుగులేని వ్యక్తి. అభివృద్ధి పట్ల ఆయనపడే తపన ఒక్కటే కాదు పాలసీల రూపకల్పలో ఆయన వినూత్న ఆలోచనలు దశాబ్దాలుగా నన్ను అబ్బురపరుస్తూనే ఉన్నాయి. ఆయన ఎప్పటికప్పుడు తాను ఎదగడంతోపాటు తన చుట్టూ ఉన్నవారిని కూడా ఉన్నతంగా ఉంచేందుకు ప్రయత్నిస్తుంటారు' అని ఆనంద్ మహీంద్ర ఎక్స్ వేదికగా స్పందించారు. తన సందేశానికి విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు వీడియోను ఆనంద్ మహీంద్ర ట్యాగ్ చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించారు. 'ఆనంద్‌జీ మీ స్ఫూర్తిదాయక మాటలకు ధన్యవాదాలు. భారతదేశం ఓ అద్భుతమైన అభివృద్ధి చెందే దశలోకి అడుగుపెడుతోందని నేను బలంగా నమ్ముతున్నాను. ఇలాంటి సమయంలో పాలకులుగా మేం చేయాల్సింది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం సరికొత్త దారులను పరిచేందుకు వినూత్న పాలసీలను రూపొందించడమే. దానిలో భాగంగానే నా వంతు ప్రయత్నం చేస్తున్నాను. మీలాంటి వారి రాక కోసం ఆంధ్రప్రదేశ్ ఎదురుచూస్తోంది' అని సీఎం పేర్కొన్నారు.

# లాభసాటి సాగుకు పంచసూత్రాలు

"ఎన్ని ఇబ్బందులు వచ్చినా నదుల అనుసంధానం చేసి తీరుతాం. ప్రతి ఎకరాకు నీరిచ్చే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. నీళ్లు ఉన్నప్పుడు ఆనందపడడం కాదు. నీటికొరత రాకుండా ముందుజాగ్రత్త తీసుకోవాలి."

"నాకున్న ఈ రింగ్(తన వేలికున్న ఉంగరం చూపించి) మంత్రం రింగ్ కాదు ఆరా రింగ్. నిద్రలేస్తే చెబుతుంది. ఈరోజు బాగానే పడుకున్నావు. ఎనర్జీగా ఉన్నావని చెబుతుంది. అంటే టెక్నాలజీ ఎంత మారిపోయిందో మీరు గమనించాలి. మరోపక్క, గ్లూకోస్ తెలుస్తుంది, ఏం తినాలో చెబుతుంది. ఇలాంటివన్నీ తయారు చేసి మీకు అందుబాటులోకి తెస్తాం." - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

హద్దుగా రాష్ట్రాన్ని, రైతులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కడప జిల్లాలోని పెండ్లిమర్రి మండలం భైరవగుట్ట వద్ద బుధవారం 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' రెండో విడత నిధులను సీఎం విడుదల చేశారు. 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,135కోట్లు జమ చేశారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు.

**ట్రాక్టరెక్కిన సీఎం**

పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లెలో ట్రాక్టరు ఎక్కిన సీఎం చంద్రబాబు రైతులతో కలిసి ముచ్చటిస్తూ.. వ్యవసాయ క్షేత్రం పరిశీలనకు వెళ్లారు. సీఎంకు మహిళా రైతులు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఉద్యాన పంటలను పరిశీలించిన సీఎం సంతోషం వ్యక్తం చేశారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా జీవ ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసే విధానాన్ని అధికారులు సీఎంకు వివరించారు.




అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చెక్కు నమూనాను ప్రదర్శిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్న, రైతులు

**బాబు చెప్పిన పంచసూత్రాలు**

1) నీటి భద్రత.
2) డిమాండ్ ఆధారిత పంటలు.
3) అగ్రిటెక్(సాంకేతిక సాగు).
4) వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు.
5) ప్రపంచ మార్కెట్.

### సుపరిపాలనకు నాంది పలికాం!

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశాం. 17 నెలల కాలంలో సూపర్‌సిక్స్‌ను సూపర్‌హిట్ చేశాం. తల్లికి వందనం, స్త్రీశక్తి ఉచిత బస్సు, దీపం-2, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, 20 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ఇవన్నీ ఎన్డీయే ప్రభుత్వం జయప్రదం చేసింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు నాంది పలికాం. చెట్టు కింద ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రకృతి చాలా బాగుంది. ఇక్కడ మంచి ఆక్సిజన్ కూడా ఉంది. అలాంటి ప్రదేశంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. రైతన్నకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చాం. రెండో విడత డబ్బులు ఇప్పుడు ఇస్తున్నాం. చెక్ చేసుకోండి.

### రైతన్న బతుకు మారాలి..

రైతన్నలు సాగుతీరు మార్చుకోవాలి. వ్యవసాయం లాభసాటికావాలి. అన్నదాత బతుకుమారాలి. రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయంలో ఏ రాష్ట్రం ముందుంటుందో ఆ రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుంది. నేను కూడా రైతు బిడ్డనే. అందుకే.. సాగులో పంచసూత్రాలు పాటిస్తే మన సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. మనం పండించే పంట మన ఊరిలో అమ్మడం కాదు.. ప్రపంచమే వేదికగా విక్రయిస్తే.. రైతులు నిలదొక్కుకుంటారు. దీనికిగాను ఫుడ్ ప్రాసెసింగ్‌కు వెళ్లాలి. ఈ విధానాల్లో ఇబ్బంది వస్తే ప్రభుత్వాలు ఆదుకోవాలి. ఆ కార్యక్రమమే ఇప్పుడు చేస్తున్నాం. ఆధునిక విజ్ఞానాన్ని మీకు అందుబాటులో ఉంచుతాం. ప్రతి ఏకరాకు నీరు ఇవ్వాలన్నదే నా సంకల్పం. రాష్ట్రంలో నదుల అనుసంధానం చేసి అన్ని రిజర్వాయర్లలో నీళ్లు పెట్టగలిగితే ఒక ఏడాది వర్షాలు పడకపోయినా మరో సంవత్సరం బ్యాలెన్స్ అవుతుంది. భూగర్భ జలాలు కూడా పెంచాలి. భూమినే ఒక జలాశయంగా తయారు చేయాలి.

### అందరూ ప్రకృతి సేద్యానికి మళ్లాలి

రైతులు ఎరువులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. క్రిమిసంహారక మందులు తగ్గాలి. అందరూ ప్రకృతి సేద్యానికి మళ్లాలి. గతేడాది 12 లక్షల ఎకరాలు ప్రకృతి సేద్యం ద్వారా పండించాం. ఈ ఏడాది మరో 6 లక్షలు పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వ్యవసాయ రంగంలో కొత్త విధానాలను తీసుకురావాలి. అగ్రిటెక్ కోసం బిల్‌గేట్స్ ఫౌండేషన్ నుంచి సహకరించేందుకు ముందుకొస్తున్నారు. డ్రోన్, సెల్‌ఫోన్, సాటిలైట్ వ్యవస్థలను వ్యవసాయానికి అనుసంధానిస్తాం. డ్రోన్‌లు వినియోగించి పురుగుమందును పిచికారీ చేస్తున్నారు. అయితే డ్రోన్‌లో కెమెరా కొట్టి ఏ మొక్కకు పురుగు ఉందో ఆ మొక్కకు మందు కొట్టే టెక్నాలజీ రావాలి. అదే నా టార్గెట్.

### రాయలసీమ హార్టికల్చర్ హబ్ కావాలి

రాయలసీమలో 18 నుంచి 20 వరకు అనేక రకాల పండ్ల తోటలు ఉన్నాయి. రాయలసీమ హార్టికల్చర్ హబ్ కావాలి. ప్రపంచంలో ఉండే బెస్ట్ కంపెనీలు ఇక్కడకు వచ్చి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టే పరిస్థితి తీసుకొస్తా. కోల్డ్‌చైన్ లింక్ ద్వారా దేశంలో ఎక్కడ మార్కెట్ బాగుందో అనలైజ్ చేసి నేరుగా పంపించే మెకానిజం ఏర్పాటు చేస్తున్నాం. దుబాయ్, అబుదాబీలతో మాట్లాడుతున్నా. వాళ్లను ఇక్కడ పెద్ద ఫుడ్ పార్క్ పెట్టమన్నా. అగ్రికల్చర్‌లో కూడా టెక్నాలజీ తీసుకొస్తా.

### త్వరలో సంజీవని ప్రాజెక్టు

త్వరలో సంజీవని ప్రాజెక్టు తీసుకొస్తున్నాం. యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకొస్తాం. అన్ని రకాల వైద్య పరీక్షలు ఇంటి వద్దకే వచ్చి చేస్తాం. అవసరమైతేనే ఆసుపత్రికి వెళ్లే పరిస్థితి తెస్తాం. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు పెడతా. రాయలసీమలో డ్రోన్ సిటీ వస్తుంది. అన్ని విషయాలు ఈజీగా చేయగలుగుతాను. కానీ, వ్యవసాయం మాత్రం సంక్లిష్టంగా ఉంది. అయినా సవాలుగా తీసుకుంటా. రైతులను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా.

**ఒకేసారి 7 వేలు**

» 99% ఖాతాలకు చేరిన సొమ్ము

రాష్ట్ర రైతుల ఖాతాల్లో ఒకేసారి రూ.7 వేల సొమ్ము పడింది. పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకాల కింద ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బటన్ నొక్కిన స్వల్ప వ్యవధిలోనే సొమ్ము నేరుగా ఖాతాల్లో జమయింది. బుధవారం మధ్యాహ్నం కోయంబత్తూర్‌లో ప్రధాని మోదీ పీఎం కిసాన్, కడప జిల్లా పెండ్లిమర్రిలో సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాలకు బటన్ నొక్కారు. దీంతో రాష్ట్రంలోని 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,135కోట్లు జమ అయ్యాయి. పీఎం కిసాన్ సొమ్ము రూ.2వేలు, అన్నదాతసుఖీభవ రెండో విడత సొమ్ము రూ.5వేలు లబ్ధిదారులైన ఖాతాల్లో పడ్డాయి. బుధవారం రాత్రి 9 గంటల వరకు 99శాతం మంది రైతుల ఖాతాలకు నగదు జమ అయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, గత వైసీపీ హయాంలో రైతు భరోసా పథకం కింద అప్పటి సీఎం జగన్ బటన్ నొక్కినా.. రోజుల తరబడి నగదు జమ కాని పరిస్థితులు ఉండేవని రైతులు గుర్తు చేస్తుకుంటున్నారు.

# డీఫాల్ట్ బెయిల్ రద్దు





**మద్యం స్కాం కేసులో..**

**ధనుంజయ్‌రెడ్డి బ్యాచ్‌కు హైకోర్టు షాక్!**

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు హైకోర్టు గట్టి షాకిచ్చింది. ఈ ముగ్గురికీ ఏసీబీ కోర్టు మంజూరు చేసిన డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేసింది. ఈ నెల 26లోగా ఏసీబీ కోర్టు ముందు లొంగిపోవాలని ముగ్గురినీ ఆదేశించింది. ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ పిటిషన్ల దాఖలుకు వారికి వెసులుబాటు ఇచ్చింది. ప్రస్తుత పిటిషన్‌లో తాము వ్యక్తం చేసిన అభిప్రాయాలతో సంబంధం లేకుండా మెరిట్స్ ఆధారంగా బెయిల్ పిటిషన్ల పై విచారణ జరిపి నిర్ణయం వెల్లడించాలని ఏసీబీ కోర్టుకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం తీర్పు వెలువరించారు. వాస్తవానికి ముగ్గురు నిందితులూ ఈ నెల 24లోపు లొంగిపోవాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఆ తర్వాత వారి తరపు సీనియర్ న్యాయవాదుల అభ్యర్థనతో 26 వరకు అవకాశమిచ్చారు. మద్యం స్కాంలో సిట్ దాఖలు చేసిన చార్జిషీటు, అనుబంధ చార్జిషీటు అసంపూర్తిగా ఉన్నాయనే కారణంతో ధనుంజయ్‌రెడ్డి(ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి(ఏ-32), బాలాజీ గోవిందప్ప(ఏ-33)కు ఏసీబీ కోర్టు ఈ ఏడాది సెప్టెంబరు 6న నిబంధనలకు విరుద్ధంగా డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిందని, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై సెప్టెంబరు 26న న్యాయస్థానం విచారణ జరిపింది. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఆ ముగ్గురు నిందితులకు సంబంధించి దర్యాప్తు ముగియడంతో తుది చార్జిషీటు దాఖలు చేశామని.. ఇతర నిందితుల విషయంలో విచారణ కొనసాగుతోందని ప్రాసిక్యూషన్ మొదటి నుంచీ చెబుతోందన్నారు. 'సీఐడీ జూలై 19న చార్జిషీటు దాఖలు చేసిన అనంతరం ప్రత్యేక కోర్టు పలుసార్లు నిందితుల రిమాండ్ పొడిగించింది. ఆ ఉత్తర్వుల్లో చార్జిషీటు దాఖలు చేసినట్లు స్పష్టంగా పేర్కొంది. దానిని దాఖలు అనంతరం నిందితులు వేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది కూడా. తదనంతరం ఆగస్టు 23న ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆఫీస్ మెమోరాండం ఆధారంగా చేసుకుని నిందితులు డీఫాల్ట్ బెయిల్ పిటిషన్లు వేశారు. వారు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్, డీఫాల్ట్ బెయిల్ వ్యాజ్యాలపై ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసే విషయంలో చట్టనిబంధనలు అనుసరించలేదు. అమల్లో లేని ఉత్తర్వులను ఆధారంగా చేసుకుని నిందితులకు ప్రత్యేక కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది. డీఫాల్ట్ బెయిళ్లను రద్దు చేయండి' అని కోరారు. ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవలసిన అవసరం లేదని నిందితుల తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి.. బుధవారం తన నిర్ణయం వెల్లడించారు.

### పార్లమెంట్‌కు వెళ్లడానికి అనుమతి ఇవ్వండి: మిథున్‌రెడ్డి



విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాలకు హాజరవ్వడానికి అనుమతి ఇవ్వాలని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లకూడదన్న బెయిల్ షరతు కారణంగా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## నియోజకవర్గాల్లో తిరుగుతారా..

» వేరేవారిని చూసుకోమంటారా?

» కొడాలి నాని, వంశీకి జగన్ క్లాస్!

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలు అక్రమాలకు పాల్పడి.. అధికారం కోల్పోయిన తర్వాత కేసుల భయంతో కలుగులో దాక్కున్న వైసీపీ నాయకుల్లో ధైర్యాన్ని నూరిపోసేందుకు ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నాలు ప్రారంభించారు. అదే సమయంలో నియోజకవర్గాల్లో తిరగకుంటే వేరేవారిని చూసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎన్నికల అనంతరం హైదరాబాద్, తదితర ప్రాంతాలకే పరిమితమైన నేతలను పిలిపించి జగన్ క్లాసు తీసుకుంటున్నారు. బుధవారం ఒక్క రోజే సుమారు 20 మంది నేతలను తాడేపల్లి ప్యాలెస్‌కు రప్పించి కర్తవ్య బోధ చేశారు. జగన్‌కు అత్యంత సన్నిహితులుగా పేరొందిన కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని వీరిలో ఉన్నారు. కొడాలి నాని కేసుల భయంతో ఏడాదిన్నరగా గుడివాడ నియోజకవర్గం వైపే చూడటం లేదు. వల్లభనేని వంశీ కూడా నియోజకవర్గంలో చురుగ్గా కార్యక్రమాలు నిర్వహించడం లేదు. దీంతో నియోజకవర్గాల్లో చురుగ్గా పార్టీ కార్యక్రమాలు నిర్వహించకపోయినా.. అధికార పార్టీ ఎమ్మెల్యేల అక్రమాలను గట్టిగా నిలదీయకపోయినా.. తాను నియోజకవర్గ ఇన్‌చార్జులుగా వేరే వారిని చూసుకోవలసి ఉంటుందని కొడాలి, వంశీకి జగన్ స్పష్టం చేసినట్లు సమాచారం. మల్లాది విష్ణు, సింహాద్రి రమేశ్, అద్దంకి సమన్వయకర్త అశోక్‌కుమార్, కొఠారు అబ్బయ్య చౌదరిపైనా సీరియస్ అయినట్లు తెలిసింది.

## చెవిరెడ్డి ఆస్తులు జప్తు

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబానికి చెందిన రూ.63.72కోట్లకు పైగా ఆస్తులు జప్తు చేస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ల వద్ద రిజిస్ట్రేషన్ చేయించిన పలు ఆస్తులతో పాటు నెల్లూరు జిల్లా గూడూరు, పొదలకూరు.. చిత్తూరు జిల్లా పుత్తూరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఏ-38), ఆయన భార్య లక్ష్మీకాంతమ్మ, కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి(ఏ-39), చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పేర్లతో రిజిస్టరై ఉన్న స్థిరాస్తుల వివరాలు వెల్లడించింది. సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం రూ.8.85 కోట్లు మాత్రమే చూపించి.. మిగతా రూ.54.87 కోట్లను నగదు రూపంలో చెల్లించి ఆస్తులు కొనుగోలు చేసినట్లు సిట్ తేల్చింది. చెవిరెడ్డి కుటుంబం భారీగా మోసపూరిత భూలావాదేవీలు చేసిందని, ఆలయ పూజారిని సైతం వదిలి పెట్టకుండా ఆస్తులు రాయించుకుందని తెలిపింది. మద్యం కుంభకోణంలో కమీషన్లు తీసుకుని.. ఆ డబ్బులతో తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో చెవిరెడ్డి కుటుంబం భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు పేర్కొంది. మద్యం ముడుపుల సొమ్మును.. ఎన్నికల్లో ఓట్లు కొనేందుకు వైసీపీ అభ్యర్థులకు పంపగా.. అందులో సింహభాగం వెనకేసుకున్న చెవిరెడ్డి అక్రమ సొమ్మును వైట్ మనీగా మార్చుకోవడానికి కుటుంబ సభ్యులు, అనుచరులు, డ్రైవర్, సహాయకుడు, బంధువులు, ఇరుగు పొరుగు ఇళ్లల్లో ఉండే వారి పేర్లతోనూ 8 డొల్ల కంపెనీలు సృష్టించి లావాదేవీలు జరిపినట్లు సిట్ వెల్లడించింది. ఇందులో కేవీఎస్ ఇన్‌ఫ్రా ఎండీగా ఉన్న కుమారుడు మోహిత్‌రెడ్డి, సీఎంఆర్ ఇన్‌ఫ్రా పేరుతో ఉన్న కంపెనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న మరో కుమారుడు హర్షిత్‌రెడ్డి పేరుతో ఉన్న ఆస్తుల్లో రూ.54.87 కోట్లు లెక్కల్లో చూపలేదంది. నెల్లూరు జిల్లాలో అరబిందో ఫార్మాకు విక్రయించిన 263 ఎకరాల భూమికి సంబంధించి కేవీఎస్ ఇన్ ఫ్రా ద్వారా 13.3 కోట్ల రూపాయలు వైట్ మనీగా మార్చినట్లు గుర్తించింది. దీంతో వందల ఎకరాల భూములు.. ఖరీదైన ప్రాంతాల్లో నివాస, వాణిజ్య స్థలాలను జప్తు చేసేందుకు విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేయడానికి సీఐడీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సిట్ కోర్టులో త్వరలో జప్తు పిటిషన్ దాఖలు చేయబోతోంది.

## ఉన్న ఒక్క చెల్లినీ చూసుకోలేరా?

» జగన్‌కు నేను దూరం కాలేదు.. అతనే నన్ను, అమ్మను దూరం పెట్టారు

» 'జగన్, కేటీఆర్ వర్సెస్ షర్మిల, కవిత'చర్చపై ఏపీసీసీ చీఫ్ స్పందన



అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నగా ఉన్న ఒకే ఒక్క చెల్లిని చూసుకోలేరా? అని మాజీ సీఎం వైఎస్ జగన్ తీరుపై ఆయన చెల్లెలు, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌కు తాను దూరం కాలేదని, అతనే తనను, అమ్మ (విజయమ్మ)ను దూరం పెట్టారని అన్నారు. బుధవారం విజయవాడలోని ఏపీసీసీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత.. తెలంగాణలో కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోదరి కవిత, ఏపీలో జగన్ సోదరి షర్మిలకు తమ సోదరులతో ఉన్న విభేదాలపై రాజకీయ వర్గాల్లో చర్చసాగుతోంది. ఈ నేపథ్యంలో కవిత, షర్మిల తమ అన్నలకు దూరం కావడంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై 'ఆంధ్రజ్యోతి' షర్మిల అభిప్రాయాన్ని కోరింది. 'ఉన్న ఒకే ఒక్క చెల్లిని కూడా చూసుకోకపోతే ఎలా? కోరిన వెంటనే నేను అన్న కోసం వందల కిలోమీటర్ల పాదయాత్ర చేశాను. ఇంతకంటే చిత్తశుద్ధిని పదే పదే నిరూపించుకోవాలా? చెల్లెల్లను సరిగా చూసుకుంటే బయటికి ఎందుకొస్తాం' అని అన్నారు. కాగా, ఐదేళ్లలో యువతకు ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బాండ్ పేపర్‌పై లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబును షర్మిల డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సమక్షంలో ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖ సదస్సులో చేసుకున్న పెట్టుబడి ఒప్పందాలు, మేనిఫెస్టోలోని ఉద్యోగాల కల్పన హామీపై తనకు నమ్మకం లేదని అన్నారు.

## హంగామా చేద్దాం!

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు తలెత్తుతాయి' అంటూ సీఎంగా ఉన్నన్ని రోజులూ వ్యక్తిగత హాజరు నుంచి జగన్ మినహాయింపు పొందారు. 'మాజీ' అయ్యాకా అదే మినహాయింపు కొనసాగుతోంది. గత నెలలో లండన్ పర్యటనకు వెళ్లిన జగన్ స్వదేశానికి తిరిగొచ్చాక వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు స్పష్టంగా చెప్పింది. పర్యటనకు ముందు కోర్టు పెట్టిన షరతులన్నింటికీ ఒప్పుకున్న జగన్... తిరిగొచ్చాక మాత్రం కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు ఇష్టపడలేదు. మినహాయింపు కోరారు. ఆయన వ్యక్తిగతంగా తమ ముందుకు రావలసిందేనని కోర్టు తేల్చిచెప్పడంతో... గురువారం హాజరు కాక తప్పడంలేదు. ఇప్పుడు కూడా... 'భద్రతాపరమైన సమస్యల' సాకు చూపి, భవిష్యత్తులో కోర్టుకు హాజరుకాకుండా ఉండేందుకే వైసీపీ శ్రేణుల ద్వారా హైదరాబాద్‌లో... మరీ ముఖ్యంగా కోర్టు వద్ద హంగామా సృష్టించాలనే ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఏపీలో మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో సంతకాల సేకరణ తలపెట్టడం గమనార్హం.

### కోర్టులో గంటే ఉంటారంట!

జగన్ అక్రమాస్తుల కేసులో 'నిందితుడు'! కోర్టులో హాజరయ్యాక ఆయన ఎప్పుడు బయటికి వస్తారన్నది అక్కడి పరిస్థితులు, న్యాయాధికారి నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. కానీ... ఎన్నిగంటలకు కోర్టుకు వెళ్లేదీ, అక్కడ ఎంత సేపు ఉండేది కూడా జగనే నిర్ణయించుకున్నారు. గురువారం తన పర్యటనపై షెడ్యూలు విడుదల చేశారు. "11.30 గంటలకు సీబీఐ కోర్టుకు వెళ్లి... 12.30 గంటలదాకా అక్కడ ఉంటారు" అని అందులో తెలిపారు. అంటే... కోర్టులో ఎంతసేపు ఉండాలో నిందితుడే నిర్ణయిస్తారా అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి.



ప్రధాని మోదీని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కేంద్రమంత్రులు శ్రీనివాస వర్మ, కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, సచిన్ టెండూల్కర్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్



పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గిర్ జాతి ఆవుకు గ్రాసం పెడుతున్న ప్రధాని

# సేవే పరమ ధర్మం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయని చెప్పారు. భక్తి, జ్ఞానం, కర్మ.. ఈ మూడు సేవలే భారతీయ నాగరికతకు మూలమన్నారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు బుధవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రశాంతి నిలయంలో బాబా మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. సీఎంతో కలిసి సత్యసాయి స్మారక రూ.100 నాణేలు, పోస్టల్ స్టాంపులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. భగవాన్ శతజయంతి ఉత్సవాలను జరుపుకోవడం ఓ వరంగా, వాటిలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సత్యసాయి భౌతికంగా లేకున్నా, ఆయన ప్రేమ మనతోనే ఉందని చెప్పారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని అన్నారు. ఆయన బోధనలు

> సత్యసాయి అరుదైన ఆధ్యాత్మిక శక్తి. భారతదేశంలో.. అందులోనూ ఆంధ్రప్రదేశ్‌లో.. మరీ ముఖ్యంగా అనంతపురంలో.. ప్రపంచానికి వెలుగునిచ్చిన మహోన్నత వ్యక్తి పుట్టడం మనందరి అదృష్టం.
>
> - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

140 దేశాల్లో కోట్ల మందికి మార్గం చూపాయని.. ఆయన జీవితం వసుధైవ కుటుంబకం అనే భావనతో నడచిందని తెలిపారు. 'మన భారతీయుల జీవన విధానమే సేవ, భక్తి, జ్ఞానం. 'సేవా పరమో ధర్మః' అనేది మన మూల జీవన విధానంలో ఉంది. అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు (లవ్ ఆల్... సర్వ్ ఆల్) అని సత్యసాయి బోధించారు. ఆయనతో పాటు ఆయన సంస్థలూ అదే పాటిస్తూ వస్తున్నాయి. కోట్ల మంది భక్తులు దేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా మానవ సేవే మాధవ సేవగా భావించి సేవలు అందిస్తున్నారు. సత్యసాయి చేపట్టిన తాగునీరు, వైద్యం, విద్య, విపత్తు నిర్వహణ వంటి సేవలు అనిర్వచనీయం. 3 వేల కిలోమీటర్లకు పైగా తాగునీటి పైపులను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. అనేక ఆస్పత్రులు నిర్మించి ఉచితంగా వైద్యం అందిస్తున్నారు' అని కొనియాడారు.

## బాలికలకు ఆర్థిక సాయం..

సుకన్య సమృద్ధి యోజన కింద వేల మంది బాలికలకు సత్యసాయి ట్రస్ట్ ఆర్థికసాయం అందిస్తోందని ప్రధాని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ఉన్నాయని.. వీటిలో రూ.3.25 లక్షల కోట్లకుపైగా నిధులు ఉన్నాయని చెప్పారు. 'వారాణసీ ఎంపీగా 27 వేల మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన కింద నిధులు జమ చేయించాను. సామాజిక భద్రత కోసం దేశంలో చాలా పథకాలను ప్రారంభించాం. వీటిపై విదేశాల్లోనూ పెద్దఎత్తున చర్చ జరుగుతోంది' అని తెలిపారు. శ్రీసత్యసాయి ట్రస్టు వంద గిర్ జాతి గోవులను తన చేతుల మీదుగా పేదవారికి అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా వారాణసీలో 480కిపైగా గిర్ జాతి ఆవులను పేదవారికి అందించామని తెలిపారు. ఇప్పుడు వెయ్యికిపైగా గిర్ ఆవులు ఆ ప్రాంతంలో తయారయ్యాయని అన్నారు. రువాండాలో 200కుపైగా గిర్ ఆవులు ఉన్నాయని.. గోదానం లాంటి సంప్రదాయం అక్కడ కూడా ఉందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం ముందుకు వెళ్తోందని.. ఇందులో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని అందిపుచ్చుకోవాలని చెప్పారు. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేస్తే ఆత్మనిర్భర్ భారత్ సాధించినట్లేనని చెప్పారు. 'సత్యసాయి ప్రేరణతో అంతా కలిసి పని చేద్దాం. ప్రతి వ్యక్తి కరుణ, శాంతి, కర్మ విధానాలతో ముందుకెళ్లాలి' అని ప్రధాని పిలుపిచ్చారు.

## మనుషుల్లో ప్రేమ ఉన్నంత వరకూ భగవాన్ మన మధ్యే: లోకేశ్



ప్రశాంతి నిలయం ప్రశాంతతకు ఆలయం. ఇక్కడకు నేను ఎప్పుడు వచ్చినా... బంగారూ అని బాబా నన్ను పిలిచినట్లు అనిపిస్తుంది. భగవాన్ సత్యసాయి చూపిన బాటలో మనమంతా నడవాలి. మనుషుల్లో ప్రేమ ఉన్నంత వరకూ భగవాన్ మన మధ్యలోనే ఉంటారు. బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను. భగవాన్ చెప్పినట్లు సేవే కులం.. సమానత్వమే మతం... ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు పవిత్రమైనవి. 'అందరినీ ప్రేమించు... అందరికీ సేవ చేయి... ఎప్పటికీ సహాయం చేయి... ఎవరినీ బాధించకు..' అని సత్యసాయి చూపిన మార్గంలో మనమంతా నడవాలి. ఖండాలు, సంస్కృతులు, విశ్వాసాలు, వయసుతో సంబంధం లేకుండా ఆయన జీవితం లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తోంది. భగవాన్ చూపిన పవిత్ర మార్గాన్ని అనుసరిస్తూ శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, శ్రీసత్యసాయి సేవా సంస్థలు సమాజానికి విశేష సేవలను అందిస్తున్నాయి. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ద్వారా కీలకమైన శస్త్ర చికిత్సలు చేస్తూ, లక్షలాది మందికి పునర్జన్మనిస్తున్నారు. సత్యసాయి సంస్థలు విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా యువ హృదయాల జీవిత లక్ష్యాన్ని సాకారం చేస్తున్నాయి. ప్రభుత్వ పాలనలో వివిధ విభాగాలు, వ్యాపారం, సైన్స్, స్టార్టప్‌లకు నేడు నైతిక మేధస్సు అవసరం. సత్యసాయి యువతకు ఇచ్చిన సందేశం ఇదే. ఆయన చెప్పినట్లుగా పిల్లలకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పడం నా ధ్యేయం. సత్యసాయి మనుషుల్లో దేవుడిని చూశారు.. ప్రేమతో ప్రపంచాన్ని గెలిచారు.. సేవలతో ప్రజలకు దేవుడయ్యారు.. కుల, మత, ప్రాంతీయ విభజనలు వద్దు. పేదలకు సాయం చేయాలి. సత్యం మాట్లాడాలి. ఇది భగవాన్‌కు మనం శతజయంతి సందర్భంగా ఇచ్చే ఘన నివాళి. కేంద్రం సత్యసాయి పేరుతో ప్రత్యేకంగా రూ.100 నాణేలు, తపాలా బిళ్లలు విడుదల చేస్తున్నందుకు ప్రధానికి ధన్యవాదాలు.

## భూమిపై మనం చూసిన దైవం

▸▸ సత్యసాయితో నాకెన్నో అనుభవాలు: చంద్రబాబు

ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ సత్యసాయిబాబా. ప్రేమ, సేవ, ప్రశాంతత, పరిష్కారానికి ఆయన ప్రతిరూపం. లవ్ ఆల్.. సర్వ్ ఆల్... హెల్ప్ ఎవర్... హర్ట్ నెవర్ అనేది ఆయన మనకు చూపిన దారి. విశ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంతోషం అనే భావనతో ఆయన జీవించారు. భగవాన్ నడిచిన ఈ పుణ్యభూమిలో ఇవాళ ఆయన శతజయంతి వేడుకలు జరుపుకొంటున్నాం. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి దానినే ఆయన బోధించారు. ఆచరించి ఫలితం చూపించారు. ఆ భావనతో సత్యసాయి భక్తులు మానవాళికి సేవలు అందిస్తున్నారు. బాబాతో నాకు ఎన్నో అనుభవాలు. ట్రస్ట్ కార్యక్రమాలపై పలుమార్లు నాతో చర్చించారు. 102 సత్యసాయి విద్యాలయాలు 60 వేల మందికి ఉత్తమ విద్యను అందిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, జనరల్ ఆస్పత్రులు, మొబైల్ ఆస్పత్రుల ద్వారా రోజూ రోగులకు సేవలు అందుతున్నాయి. రాయలసీమ ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రశాంతి నిలయాన్ని తాకట్టుపెట్టి అయినా ప్రాజెక్టును పూర్తి చేయాలనుకున్న గొప్ప దైవసంకల్ప బలుడు బాబా. ఈ విషయం తెలిసి భక్తులు కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చారు. రూ.550 కోట్లు ఖర్చు పెట్టి ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 1,600 గ్రామాలు, 30 లక్షలకుపైగా జనాభాకు నీరిస్తున్నారు. చెన్నై డ్రింకింగ్ వాటర్ మోడర్నైజేషన్ స్కీంకు రూ.250 కోట్లు ఖర్చు పెట్టారు. సత్యసాయి స్ఫూర్తిని, ఆయన చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి.



బాలికకు సుకన్య సమృద్ధి యోజన ఖాతా పాస్‌బుక్‌ను అందజేస్తున్న ప్రధాని మోదీ, పక్కన సీఎం చంద్రబాబు

## సత్యసాయి భక్తులు.. విశ్వవ్యాపితం



▸▸ ఆయన గొప్పతనాన్ని మనకంటే విదేశీయులే బాగా చెబుతారు: పవన్

భగవాన్ సత్యసాయి బాబాకు భక్తులు విశ్వవ్యాప్తంగా ఉన్నారు. బాబా గొప్పతనం గురించి మన దేశ ప్రజలకంటే.. విదేశీయులే గొప్పగా చెబుతారు. 30 ఏళ్ల క్రితం నేను సింగపూర్ వెళ్లినప్పుడు చైనీయుల ఇళ్లల్లో సత్యసాయి ఫొటోలు ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. 20 ఏళ్ల క్రితం హాలీవుడ్ నటుడు స్టీవెన్ సీగల్ బాబాను దర్శించేందుకు ఇక్కడకు రావడం నన్ను మరింత ఆశ్చర్యపరచింది. మరీ ముఖ్యంగా నా అన్నయ్య చిరంజీవి బెంగళూరు నుంచి ప్రత్యేకంగా వచ్చి బాబాను దర్శించుకోవడం చూసి ఆశ్చర్యం వేసింది. అత్యంత వెనుకబడిన జిల్లాలో పుట్టిన భగవాన్ రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేశారు. ప్రధాని మోదీ చేపట్టిన జల్ జీవన్ మిషన్ తరహాలోనే ఆయన ఈ ప్రాంత దాహార్తి తీర్చారు. జల్ జీవన్ మిషన్‌కు అంకురమే ఆయన చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు. అప్పట్లో ఏ ప్రభుత్వాలు ఆలోచించని సమయంలోనే ఈ ప్రాంత ప్రజలకు తాగునీటిని అందించాలని తలిచారు. ఈ పథకానికి రూ.400 కోట్లు ఇస్తానంటే అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు.. సత్యసాయి సాగునీటి పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయన సేవాతత్పరతకు ఎంత మంది ప్రభావితం చెందారో లెక్కలేదు. ఓ ఐఏఎస్ ఆఫీసర్ ఇక్కడికొచ్చి సేవ చేస్తారని మా వదిన, అన్నయ్య చెబుతుండేవారు. అలాంటి ఐఏఎస్‌లు, ఇతర హోదాల్లో ఉన్న మేధావులతో పాటు సచిన్ టెండూల్కర్ లాంటి వ్యక్తులను బాబా ప్రభావితం చేశారు. ఆయన సేవాతత్పరతను ముమ్ముందూ కొనసాగిస్తాం.

## నన్ను బాలసత్యసాయి అనేవారు..



భగవాన్ సత్యసాయి బాబా చిన్నతనంలోనే నాకు దైవ సంబంధమైన అనుభూతినిచ్చారు. నాకు ఐదేళ్లప్పుడు ఎక్కడికెళ్లినా ఈ బాలుడు బాల సత్యసాయి బాబాలా ఉన్నాడని అందరూ అనేవారు. ఆ మాటలు అప్పట్లో వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా.. తర్వాత ఆయనతో ఏర్పడిన అనుబంధం ఆ మాటలకు అర్థం చూపింది. 1990లో వైట్‌ఫీల్డ్‌లో భగవాన్ దర్శనం పొందాను. మనం అడగకపోయినా... మన మనసులో ఏముందో... ఏ సందేహం ఉందో బాబా ముందుగానే చెప్పేవారు. శారీరక, మానసిక ఆరోగ్యంపై బాబా బోధనలు నా జీవితాన్ని ప్రభావితం చేశాయి. 2011 వరల్డ్ కప్ సమయంలో ఎన్నో అంచనాలు, ఒత్తిడి ఉండేవి. బెంగళూరులో మా క్యాంప్ జరుగుతున్నప్పుడు బాబా ఫోన్ చేసి ఒక పుస్తకం పంపించానని చెప్పారు. ఆ పుస్తకం నాలో అనూహ్యమైన విశ్వాసాన్ని రగిల్చింది. ముంబైలో ఇండియా-శ్రీలంక మధ్య జరిగిన ఫైనల్‌లో భారత జట్టు గెలిచి ట్రోఫీ అందుకోవడం నా జీవితంలో చిరస్మరణీయంగా నిలిచింది. ఇది బాబా ఆశీస్సుల వల్లే సాధ్యమైంది. ఆ విజయంతో ఆయన నాకు అంతర్గత భక్తి, ధైర్యం, ఆత్మవిశ్వాసం ప్రసాదించారు. బాబా మన వెంట ఉంటే భయం అనే మాటే ఉండదు. ఆయన్ను స్మరించడమే ఒక ఆశీర్వాదం.

- సచిన్ టెండూల్కర్, క్రికెట్ లెజెండ్

## కోట్ల హృదయాల్లో సత్యసాయి నిలిచే ఉన్నారు



'భగవాన్ సత్యసాయి బాబా జన్మించి వందేళ్లు పూర్తయింది. ఆయన ప్రభావం, దివ్యస్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల హృదయాల్లో ఇంకా నిలిచే ఉన్నాయి. ఆయన ప్రేమకు, సేవకు, దయకు సరిహద్దులు లేవు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మేవారు. అది చేసి చూపించారు. ఆయన చేసిన ప్రజాసేవ, ప్రేమ, దయ, పరిపూర్ణతలు ప్రపంచానికి ఆదర్శం. భగవాన్ 5డీలు.. డిసిప్లిన్, డెడికేషన్, డివోషన్, డిటర్మినేషన్, డిస్క్రిమినేషన్ బోధించారు. ఈ ఐదు డీలు మన జీవితానికి దిశగా, ధర్మంగా నిలుస్తాయి. ఇవే జీవితానికి పునాది అని ఎల్లప్పుడూ చెప్పేవారు. విద్య, ఆరోగ్యంలో సత్యసాయి సంస్థల సేవలు అమూల్యం. బాల వికాస్ స్కూళ్లలో నైతిక బోధనలు భవిష్యత్ తరాలకు వెలుగుచూపుతున్నాయి. పుట్టపర్తి, కోల్‌కతా, వైట్‌ఫీల్డ్, ముంబై.. నాలుగు ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అంతర్జాతీయ స్థాయి వైద్యం పూర్తిగా ఉచితంగా అందించడం బాబా కరుణార్ద్ర హృదయానికి నిదర్శనం. జలసేవ, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారతలో ఆయన కార్యక్రమాలు చరిత్రాత్మకం. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస ఆయన జీవితం. బాబా ప్రేమ, సేవ, కరుణ ప్రపంచానికే ఒక వరం.

- ఐశ్వర్యారాయ్ బచ్చన్, బాలీవుడ్ నటి

# సర్వం సాయినామం

## పుట్టపర్తిలో మిన్నంటిన సంబరాలు

పుట్టపర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో వైభవంగా జరుగుతున్నాయి. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తులతో పుట్టపర్తి కిటకిటలాడుతోంది. బుధవారం హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించిన వేడుకలకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ బచ్చన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు హాజరయ్యారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి, ప్రశాంతి నిలయం నుంచి హిల్ వ్యూ స్టేడియానికి ప్రధాని, సీఎం కాన్వాయ్ వెళ్తుండగా భక్తులు, ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి అభివాదం చేశారు. సాయిరాం.. సాయిరాం అని నినాదాలు చేశారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధిని మోదీ, చంద్రబాబు, పవన్ తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. వారికి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ స్వాగతం పలికారు. సత్యసాయి సువర్ణ విగ్రహం ఎదుట కూర్చుని ప్రధాని ధ్యానం చేశారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం వందమంది రైతులకు గిర్ ఆవులను ప్రధాని పంపిణీ చేశారు.

### వేదికపై ప్రముఖులు

ప్రశాంతి నిలయం నుంచి మోదీ, సీఎం చంద్రబాబు హిల్‌వ్యూ స్టేడియానికి చేరుకున్నారు. వేదికపై ప్రధానిని ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించారు. ప్రధాన వేదికపై మోదీ, చంద్రబాబు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యారాయ్, ఆర్‌జే రత్నాకర్ ఆశీనులయ్యారు. అందరూ కలిసి సత్యసాయి స్మారక నాణేలను, తపాలా బిల్లలను ఆవిష్కరించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 30 లక్షల మందికి సత్యసాయి తాగునీరు అందించడం, ఒడిసాలో వరద బాధితులకు ఇళ్ల నిర్మాణం, ఉచిత విద్య, వైద్య సేవలను తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు 140 దేశాల్లో 2 వేల కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోందని, 7.5 లక్షల మంది సేవాదళ్ ద్వారా సమాజ సేవకు అంకితమయ్యారని ప్రధాని అభినందించారు.

### అన్ని దారులూ హిల్ వ్యూ స్టేడియం వైపే..

సత్యసాయి శత జయంతి వేడుకలో పాల్గొనేందుకు దేశ విదేశాలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. హిల్ వ్యూ స్టేడియంలో ఉత్సవాలకు బుధవారం తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. పట్టణంలోని అన్ని దారులు స్టేడియం వైపే అన్నట్లు భక్తులు తరలివెళ్లారు. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్ పట్టణంలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



## అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయిబాబా జీవిత చరిత్ర, మహిమలు, ఆధ్యాత్మిక, విద్య, వైద్య సేవలకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను డిజిటల్ స్క్రీన్స్‌పై ప్రదర్శించారు. సంగీత దర్శకుడు శివమణి డ్రమ్స్, గాయకులు సుధ, రఘునాథన్ బృందం సంగీత కచేరి భక్తులను అలరించాయి. వసంతలక్ష్మి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీమతి ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సత్యసాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గుజరాతీ నృత్యం, వర్ల డ్యాన్స్‌తో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో డ్రమ్స్ వాయిస్తున్న శివమణి

సత్యసాయి శతజయంతి వేడుకలు

# వచ్చే వందేళ్ల సేవలకు పునాది

## సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ ఆకాంక్ష



పుట్టపర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకలు వచ్చే వందేళ్లపాటు చేయబోయే సేవలకు పునాది కావాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆకాంక్షించారు. శత జయంతి వేడుకలలో భాగంగా బుధవారం హిల్ వ్యూ స్టేడియంలో 'శ్రీసత్యసాయి అంతర్జాతీయ మహిళా సదస్సు'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్ ప్రసంగించారు. "సత్యసాయి 1940లో తన 14వ ఏట 'అందిరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే సేవా మార్గాన్ని పుట్టపర్తిలో ప్రారంభించారు. ఆయనకు జన్మభూమి, కర్మభూమి పుట్టపర్తి. సత్యసాయి భక్తులు, విద్యార్థులు, సేవా దళ్ సహకారంతో సత్యసాయి శివైక్యం అయిన తరువాత 15 సంవత్సరాలుగా ఆయన చేపట్టిన సేవలను పారదర్శకంగా కొనసాగిస్తున్నాం. వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి కుటుంబం హాజరవుతోంది. అందరికీ ధన్యవాదాలు. సత్యసాయి బాబా తల్లికి చదువు రాకపోయినా, ఆమె కోరిక మేరకే సత్యసాయి చిన్న విద్యాసంస్థను ప్రారంభించారు. యూనివర్సిటీ స్థాయికి అభివృద్ధి చేశారు. లక్షల మందికి ఉచిత విద్యను అందిస్తున్నారు. కుగ్రామమైన పుట్టపర్తిలో పేదల కోసం ఉచిత వైద్యం ప్రారంభించాలని నాడు సాయిబాబా తల్లి కోరారు. ఆమె కోరిక మేరకు చిన్న ఆస్పత్రిని ప్రారంభించి.. సూపర్ స్పెషాలిటీ స్థాయికి అభివృద్ధి చేశారు. లక్షల మందికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. తల్లి ప్రేమ, మాతృభూమి ప్రేమ ఉంటే.. ఆ వ్యక్తి సేవలు విశ్వవ్యాప్తం అవుతాయని అనడానికి సత్యసాయి సేవలే నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి శత జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు" అని అన్నారు.

## కొత్త సేవా కార్యక్రమాలకు శ్రీకారం

సత్యసాయి ట్రస్టు ప్రధాని చేతులమీదుగా గోదానం కింద పేద రైతులకు గిర్ ఆవులను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పుట్టపర్తికి చెందిన ముగ్గురు రైతులకు మోదీ ప్రశాంతి నిలయంలో గిర్ ఆవులను అందించారు. శ్రీసత్యసాయి జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదేళ్లలోపు 20 వేల మంది బాలికలకు కేంద్ర పథకం సుకన్య సమృద్ధి యోజనను ట్రస్టు అందించే కార్యక్రమాన్నీ ప్రధాని ప్రారంభించారు. ట్రస్టు ఆధ్వర్యంలో బాలికల పేరిట పోస్టాఫీసు ఖాతాలను తెరిచి, సొమ్ము జమ చేస్తారు. ప్రధాని వేదికపై ముగ్గురు బాలికలకు పోస్టల్ ఖాతా పాసు పుస్తకాలను అందించారు.

# మరో ఏడుగురు నక్సల్స్ ఎన్‌కౌంటర్



ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నక్సల్స్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్ అయిన విషయం తెలిసిందే. హిడ్మా దళం కోసం 'ఆపరేషన్ సంభవ్' పేరుతో గాలిస్తున్న కేంద్ర, ఆంధ్ర పోలీసు బృందాలు గత రెండు రోజుల్లో 13 మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశాయి. పోలీసు వర్గాల కథనం ప్రకారం, మారేడుమిల్లి మండలం జీఎం వలస గ్రామ పరిధిలోని నల్లకొండ సమీపంలోని పెదనేరేడు చెట్టు ప్రాంతంలో బుధవారం ఉదయం ఐదు గంటల సమయంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులు జరిగాయి.

### అవి బూటకపు ఎన్‌కౌంటర్లు కావు: బర్దర్

ఏవోబీలో మావోయిస్టులు మళ్లీ రిక్రూట్‌మెంట్ మొదలెట్టారని, ఇది తెలిసి కూంబింగ్ నిర్వహించినట్టు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేయాల్సిన అవసరం లేదని, లొంగిపోతామంటే, దానికి అవకాశం ఇవ్వడంలోనే తమకు ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వివరించారు. గత మూడు రోజులుగా జరుగుతున్న విస్తృత కూంబింగ్‌లో మావోయిస్టులపై పైచేయి సాధించగలిగామన్నారు. రంపచోడవరంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. "మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో హిడ్మా సహా ఆరుగురు మరణించారు. ఆ ఘటనలో తప్పించుకున్నవారికోసం కోసం మా బలగాలు గాలింపు సాగిస్తుండగా, బుధవారం మరోసారి మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఎదురు కాల్పులు జరపగా, ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలం నుంచి రెండు ఏకే 47లు, ఐదు ఏకే 47 తూటాల మాలలు, ఐదు ఎస్‌బీబీఎల్ తుపాకులు, 34 రౌండ్ల ఎస్‌బీబీఎల్ తూటాలు, 303 రైఫిల్, 24 రౌండ్ల 303 తూటాలు, మూడు కిలోల వైర్, 18 డిటోనేటర్లు, కిట్ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నాం" అని వివరించారు. మావోయిస్టులు ఏవోబీని షెల్టర్‌జోన్‌గా చేసుకోవాలని చూస్తున్నారని, ఏవోబీ, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన మావోయిస్టులు ఏపీ, ఒడిశా వైపు చూస్తున్నారన్నారు. ఇంకా ఎంతమందిని లక్ష్యంగా చేసుకున్నారన్న ప్రశ్నకు ఎస్పీ స్పందిస్తూ.. తమ బలగాలు సాగించే కూంబింగ్‌లో ఏ పరిణామాలు ఎదురవుతాయో చూడాలన్నారు.

### కాల్పుల చప్పుళ్లకు భయపడ్డాం : గ్రామస్థులు

బుధవారం తెల్లవారుజాము 4.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య ఆకస్మికంగా కాల్పుల చప్పుళ్లు వినిపించాయని జీఎం వలస గ్రామ ప్రజలు తెలిపారు. ఈ గ్రామంలో 300 ఇళ్లు ఉన్నాయి. కొండరెడ్లు, కోయ, వాల్మీకి కులాల ప్రజలు ఇక్కడ జీవిస్తున్నారు. "మేమంతా రోజూ ఉదయమే లేచి, రబ్బర్ చెట్లపాలు తీయడం, జీలుగుకల్లు తీయడం, చెట్లు కొట్టడం వంటి పనులకు వెళుతుంటాం. కానీ, బుధవారం ఉదయం కాల్పుల శబ్దాలు విన్నాం. ఒకవేళ ప్రధాన రహదారిలో ఉండే జలతరంగిణి వద్ద పర్యాటకులు బాణసంచా కాల్చారేమోనని మొదట అనుకున్నాం. ఆ తర్వాత విషయం తెలిసి భయపడ్డాం. మా ప్రాంతంలో ఎప్పుడూ ఎన్‌కౌంటర్లు జరగలేదు. మావోయిస్టులు ఏనాడూ ఇటు రాలేదు. న్యూడెమోక్రసీ మాత్రం ఉండేది. దానిని మేం నిక్కర్ పార్టీ అనేవారం. కాల్పుల శబ్దాలు వినిపించిన కొద్దిసేపటికి పోలీసులు రోడ్డు మీద కనిపించారు. మధ్యాహ్నం వేళ లోపల నుంచి మృతదేహాలను తీసుకుని వచ్చి వ్యాన్‌లో ఎక్కించడం చూశాం. మమ్మల్ని దగ్గరకు పోనీయలేదు." అని గ్రామస్థులు పల్లాల నారాయణరెడ్డి, జగన్నాథరెడ్డి, పరిమిరెడ్డి, నగ్మా, రామలక్ష్మి, సునీత తెలిపారు. కాగా, గత రెండు రోజుల్లో రెండు ఎన్‌కౌంటర్లు రాజమహేంద్రవరం- భద్రాచలం రోడ్డుకు అటూ ఇటూ జరిగాయి. ఈ రోడ్డుకు 4 కిలోమీటర్ల దూరంలోని నెల్లూర్ గ్రామ సమీపంలో మంగళ వారం ఎన్‌కౌంటర్ జరగగా, ఈ రోడ్డుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీఎం వలస అడవి లోపల బుధవారం ఎదురుకాల్పులు జరిగాయి.

### మిలిటరీ దాడుల్లో దిట్ట..

మెట్టూరి జోగారావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. జోగారావు పదోతరగతి వరకు వజ్రపుకొత్తూరు మండలంలో చదువుకున్నాడు. క్రమంగా నక్సల్ ఉద్యమాల పట్ల ఆకర్షితుడై.. 1988లో పీపుల్స్‌వార్‌లో చేరాడు. మిలిటరీ, టెక్నాలజీలో మంచి పట్టు సాధించి ఆంధ్ర-ఒడిశాలో టెక్ శంకర్‌గా ఎదిగాడు. ఐదేళ్ల క్రితం శ్రీకాకుళం అప్పటి ఎస్పీ.. జోగారావు కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి ఆయనను లొంగిపోవాలని కోరాలని సూచించారు. ఆయన తలపై రూ. 20 లక్షల రివార్డు ఉంది. ఇదే ప్రాంతం నుంచి చెల్లూరి నారాయణరావు కూడా మావోయిస్టుల్లో కలిశారు. జోగారావు ఎన్‌కౌంటర్ నేపథ్యంలో చెల్లూరిని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. మృతుల్లో మావోయిస్టు మాజీ చీఫ్ నంబాల కేశవరావు వద్ద గార్డ్ కమాండర్‌గా పనిచేసిన జ్యోతి అలియాస్ సరిత; సురేశ్ అలియాస్ రమేశ్; కేంద్రకమిటీ మాజీ సభ్యుడు కటకం సుదర్శన్ బాడీగార్డు లోకేశ్ అలియాస్ గణేశ్; సైను అలియాస్ వాసు, అనిత, సామినీ ఉన్నారు.



## 45 మంది

విజయవాడలో అరెస్టు చేసిన మావోయిస్టులను కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

# మావోయిస్టులకు రిమాండ్

విజయవాడ/ఏలూరు క్రైం/కాకినాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ, ఏలూరుల్లో పట్టుబడిన మావోయిస్టుల్లో 43 మందికి వేర్వేరు కోర్టులు రిమాండ్ విధించాయి. మరో నలుగురికి వయసు నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని న్యాయాధికారి ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు, కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో పట్టుబడిన మావోయిస్టులను పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. నిడమానూరులో పట్టుకున్న నలుగురినీ పటమట పోలీసులు నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరిచారు. వారికి వచ్చే నెల 3 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి యు. రామ్మోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. వారిని నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు. కొత్త ఆటోనగర్‌లో చిక్కిన 28 మందిని పెనమలూరు పోలీసులు ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వారిలో 24 మందికి డిసెంబరు 2 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఆదేశాలు ఇచ్చారు. వారిని రెండు బస్సుల్లో రాజమండ్రి కేంద్ర కారాగారానికి పోలీసులు తరలించారు.

### పిల్లల్లా ఉన్నారే...!

కొత్త ఆటోనగర్‌లో పట్టుబడిన మావోయిస్టుల్లో మడకం హంగ(ఏ7), కుంజం రాంబు(ఏ9), దోడి వాకాడ్(ఏ10), మాధవి మహిని(ఏ26) పొట్టిగా ఉండటంతో వారి వయసుపై న్యాయాధికారి సందేహం వ్యక్తం చేశారు. నలుగురూ పిల్లల్లా ఉన్నారని వ్యాఖ్యానించారు. వారు కొండ ప్రాంతాల్లో ఉండటంతో ఆ విధంగా కనిపిస్తారని ఏపీపీ రాధిక వివరించారు. వయసు నిర్ధారణకు వైద్య పరీక్షలు చేయించాక గురువారం కోర్టులో హాజరుపరచాలని న్యాయాధికారి ఆదేశించారు. పెనమలూరు పోలీసులు 28మంది మావోయిస్టులను తీసుకురావడానికి ముందు కోర్టు హాలు న్యాయవాదులతో నిండిపోయింది. దీంతో కేసుతో సంబంధం లేని న్యాయవాదులు బయటకు వెళ్లిపోవాలని న్యాయాధికారి లెనిన్‌బాబు సూచించారు. దీనిపై న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మావోయిస్టుల రిమాండ్ వాదనలను ఇన్‌కెమెరా విధానంలో చేస్తున్నట్టు న్యాయాధికారి ఆర్డర్ ఇవ్వడంతో న్యాయవాదులంతా బయటకు వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా, ఏలూరులో అదుపులోకి తీసుకున్న 15మంది మావోయిస్టులను బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ఏలూరు స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. వారందరికీ వచ్చే నెల 3 వరకూ రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఎన్ మేరీ ఉత్తర్వులు ఇచ్చారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టులను సామర్లకోట పోలీసులు బుధవారం సాయంత్రం ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి షేక్ షరీన్ 14 రోజులు రిమాండ్ విధించారు. వీరందరినీ రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

### రావులపాలెంలో హిడ్మా అనుచరుడు అరెస్టు

రావులపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెంలో మావోయిస్టు హిడ్మా అనుచరుడు సరోజ్ మడివి అలియాస్ ఓండాను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. సఖినేటిపల్లిలో ఒక చేపల చెరువులో సరోజ్ పనికి కుదిరినట్లు సమాచారం. అతడి నుంచి తుపాకీతో పాటు పది తూటాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

### ఆ అంతస్తు అద్దె నెలకు రూ.లక్ష!

(విజయవాడ సిటీ-ఆంధ్రజ్యోతి)

కృష్ణాజిల్లా కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు అద్దెకు తీసుకున్న మారుతి బిల్డింగ్ మూడో అంతస్తుకు అద్దె నెలకు రూ.లక్ష. రోడ్డు పనులు చేసేందుకు వచ్చామని చెప్పి ఆ బిల్డింగ్‌లో దిగినట్లు ఆటోనగర్‌లోని పలువురు కార్మికులు చెబుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను సెల్‌ఫోన్‌ల గోడౌన్‌కు అద్దెకు ఇచ్చారు. మిగిలిన అంతస్తులు నిర్మించిన నాటి నుంచి ఖాళీగానే ఉన్నాయని తెలిపారు. 4 నెలలు ఉంటామని చెప్పి మావోయిస్టులు అద్దెకు దిగినట్టు సమాచారం. వీరు ఉన్న ఫ్లోర్ మొత్తం ఒకే హాలుగా ఉంటుంది. ఇక్కడే ఆయుధాలు, సామగ్రిని భద్రపర్చుకున్నారు.

### లొంగిపోండి కామ్రేడ్స్: సోను విజ్ఞప్తి

గడ్చిరోలి: ఆయుధాలను ప్రభుత్వాలకు అప్పగించి లొంగిపోవాల్సిందిగా మావోయిస్టులకు ఆ పార్టీ మాజీ నేత మల్లోజుల వేణుగోపాల్ రావు (సోను) మరోసారి విజ్ఞప్తి చేశారు. హిడ్మా, ఆయన సహచరుల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఆయన ఈ విన్నపం చేశారు. దానిని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా పోలీసులు వీడియో రూపంలో విడుదల చేశారు.


విజయవాడలో అరెస్టు చేసిన మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

# ప్రతీకార దాడులకు చాన్స్!

### పూర్తి అప్రమత్తంగా ఉన్నాం: నిఘా చీఫ్ లడ్హా


మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీతో ఏడీజీ మహేశ్ చంద్ర లడ్హా, విజయవాడ సీపీ రాజశేఖర బాబు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్లు, అరెస్టుల నేపథ్యంలో మావోయిస్టులు ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం ఉందని రాష్ట్ర నిఘా విభాగం అధిపతి మహేశ్‌చంద్ర లడ్హా చెప్పారు. ఎదుర్కొనేందుకు పోలీసు బలగాలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో రెండు వరుస ఎన్‌కౌంటర్లు, ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని ఐదు ప్రాంతాల్లో 50 మంది మావోయిస్టుల అరెస్టు నేపథ్యంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఇంటెలిజెన్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ, జిల్లాల ఎస్పీలతో కలిసి ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. 2026 మార్చినాటికి మావోయిస్టు రహిత భారతమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రభావిత రాష్ట్రాల బలగాలతో కలిసి ఆపరేషన్ కగార్ చేపట్టిందన్నారు. దండకారణ్యంలో మావోయిస్టులను సాయుధ బలగాలు వెంటాడుతున్నాయని.. వారు ప్రాణ భయంతో చెల్లాచెదురై సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారని తెలిపారు. 'అందులో భాగంగానే రెండు నెలల నుంచి ఏపీ వైపు కూడా వస్తున్నారు.. మాడ్వి హిడ్మా దళంతో పాటు దక్షిణ బస్తర్ కమిటీ, ఛత్తీస్‌గఢ్‌లోని స్థానిక కేడర్ మన రాష్ట్రంలోకి ప్రవేశించాయి.. వారి కదలికలపై పక్కా సమాచారం అందుకుని పూర్తి నిఘా పెట్టాం.. ఇక్కడ సురక్షితంగా ఉందని హిడ్మాకు వీరి నుంచి సమాచారం అందిన తర్వాత ఈ నెల 17న ఏపీ వైపు ఆయన వస్తున్నట్లు పక్కా సమాచారంతో ఆపరేషన్ చేపట్టాం.. 18న ఉదయం మారేడు మిల్లి ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ ఫేక్ ఎన్‌కౌంటర్ కాదు' అని స్పష్టంచేశారు. బుధవారంనాటి ఎన్‌కౌంటర్‌లో టెక్ శంకర్ సహా ఏడుగురు హతమయ్యారని చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించామన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వారిని కట్టడి చేస్తామని చెప్పారు. అదుపులోకి తీసుకున్న 50 మంది నక్సల్స్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, పేలుడు పదార్థాలను ప్రదర్శించారు. అరెస్టు చేసిన మావోయిస్టుల్లో స్పెషల్ జోన్ కమిటీ సభ్యులు ముగ్గురు, డివిజనల్ కమిటీ సభ్యులు ఐదుగురు, ఏరియా కమిటీ సభ్యులు 19మంది, 23మంది ప్లాటూన్ దళం ఉన్నట్లు వివరించారు. మావోయిస్టు చీఫ్ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఎక్కడున్నాడో తమకు తెలీదన్నారు. ఆయన ఆయన లొంగిపోయారని, అరెస్టయ్యారని వస్తున్న వార్తలు రాష్ట్ర పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ) సృష్టేనని కొట్టిపారేశారు. స్వాధీనం చేసుకున్నవాటిలో 39 ఆయుధాలు, 302రౌండ్ల బుల్లెట్లు, రూ.12.72లక్షల నగదు, మెమొరి కార్డులు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలు ఉన్నట్లు తెలిపారు. యాభై మంది అరెస్టులో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి ప్రజలకు చిన్నపాటి ఇబ్బంది కూడా కలగకుండా చేసిన పోలీసులను లడ్హా అభినందించారు. సమావేశంలో ఏలూరు, కృష్ణా, కాకినాడ ఎస్పీలు కేపీ శివకిశోర్, విద్యాసాగర్‌నాయుడు, బిందు మాధవ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కగార్‌తో మావోయిస్టులు కుదేల్

# నడిచే వారేరీ? నడిపించేదెవరు?

- దశ, దిశ నేర్పిన నేతల లొంగుబాటు
- 45 ఏళ్ల తర్వాత మళ్లీ మొదటికి ఉద్యమం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

*వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టు రహిత భారత్.. ఆపరేషన్ కగార్ లక్ష్యం. కానీ, ఈలోగానే మావోయిస్టులు వరుసగా ఎన్‌కౌంటర్లలో చనిపోతున్నారు. కీలక నేతలు లొంగిపోతున్నారు. వరుస ఎన్‌కౌంటర్లలో 28 మంది కేంద్ర కమిటీ సభ్యులను ఆపార్టీ కోల్పోయింది. ప్రస్తుతానికి పొలిట్‌బ్యూరోలో గణపతి, దేవ్‌జీ మిగిలారు. ఇప్పుడు దేవ్‌జీ ఆచూకీ లేదు. తెలంగాణకు చెందిన ముగ్గురు, ఏపీకి చెందిన సీసీఎం లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిసింది. అదే నిజమైతే ఇక మిగిలేది గణపతి, రాజిరెడ్డిలే. మరి సైన్యం మాటేమిటి? సాయుధ పోరును నడిపించే సేనాని ఎవరు?*

పశ్చిమబెంగాల్‌లోని నక్సల్బరీ ప్రాంతంలో 1967 మే 25న రైతాంగం తిరుగుబాటు చేసి చరిత్ర సృష్టించింది. ఆ పోరాటమే నక్సల్బరీ ఉద్యమంగా చరిత్రకెక్కింది. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన రైతాంగ నేత చారు మజుందార్. అప్పటి సీపీఎంతో తెగదెంపులు చేసుకుని సీపీఐ(ఎం.ఎల్.)ను ఏర్పాటు చేశారు. చారుమజుందార్ మరణంతో ఇక పార్టీ ఉండదని అంతా అనుకున్నారు. కానీ... 1980లో పీపుల్స్‌వార్ రూపంలో మరో బలమైన ఉద్యమం ముందుకొచ్చింది. మొత్తం 16 రాష్ట్రాలు, 120కిపైగా జిల్లాల్లో నక్సల్స్ పాగావేశారు. దేశ అంతర్గత భద్రతకు తొలి శత్రువు నక్సల్సే అని కేంద్రం ప్రకటించేంతగా వారు ఎదిగారు. ప్రత్యేకసైన్యం ఏర్పాటు చేసుకుని, సొంత రాజ్యమే నడిపించారు. అలాంటిది...ఇప్పుడు మొత్తం మారిపోయింది. ఆ ఉద్యమమే ప్రశ్నార్థకంగా మారింది.

### ప్రజాసైన్యంతో దాడుల... దడ

1995 నాటికే పీపుల్స్‌వార్ దండకారణ్య ప్రాంతాన్ని గెరిల్లా జోన్‌గా ప్రకటించింది. ఆ జోన్‌లో సొంత రాజ్యాన్ని జనతన సర్కారు పేరిట ఏర్పాటుచేసింది. అయితే, 1999లో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోశ్‌రెడ్డి, శీలంనరేశ్‌లను ఉమ్మడి ఏపీలోని కొయ్యూరులో 1999 డిసెంబరు 2వ తేదీన పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఆ ముగ్గురు నాయకుల స్మారకంగా, వారి తొలి వర్ధంతి నాడు, అంటే 2000 డిసెంబరు 2న పీపుల్స్ గెరిల్లా ఆర్మీ (పీఎజీఏ)ను పీపుల్స్‌వార్ ఏర్పాటుచేసింది. మరో సాయుధ సంస్థఎంసీసీతో 2003 నుంచే విలీన చర్చలు ప్రారంభించింది. 2004కు అవి కొలిక్కి వచ్చాయి. డీకేలో పీపుల్స్‌వార్ అగ్రనాయకుల హెడ్‌క్వార్టర్స్ అయిన అబూజ్‌మడ్‌లో జరిగిన సమావేశంలో ఆ రెండు పార్టీలు విలీనమై.. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. గణపతి కొత్త పార్టీకీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అప్పటి కేంద్ర కమిటీలో 38 మంది, పొలిట్‌బ్యూరోలో 14 మంది సభ్యులు ఉండేవారు. ఈ విలీనం తర్వాత పీజీఏను పీఎల్‌జీఏగా మార్చారు. పెరిగిన సైన్యంతో మావోయిస్టు పార్టీ దండకారణ్యంపై పూర్తిపట్టును సాధించుకుంది. జనతన సర్కార్‌ల పరిధిని పెంచుకుంది.

### విస్తరణతోపాటే భారీ నష్టం

ఇటు పీపుల్స్‌వార్‌గా ఉన్నప్పుడు, ఆతర్వాత మావోయిస్టు పార్టీ ఆవిర్భావం తర్వాత కూడా ఉద్యమం కొత్త ప్రాంతాలకు విస్తరించడంతో పాటు అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. తీవ్ర నిర్బంధ కాలంలో ఏపీ, తెలంగాణతోపాటు, దండకారణ్యం పరిధిలో భారీగా కార్యకర్తలను, నాయకులను ఎన్‌కౌంటర్లలో కోల్పోయింది. మావోయిస్టు పార్టీ ఆవిర్భావం తర్వాత తొలి దెబ్బ కర్ణాటకలో పడింది. ఆ రాష్ట్ర కార్యదర్శి, చరిత్రకారుడు సాకేత్ రాజన్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. తొలి ఏడాదే 275 మంది ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. 2005లో ఏకంగా 650 మంది, 2006లో 456 మంది పోలీసు కాల్పుల్లో మరణించారు. అయితే, మావోయిస్టులు కూడా అంతే తీవ్రంగా ప్రతిదాడులకు పాల్పడ్డారు. దడ పుట్టించారు. మరోవైపు మరణాలూ పెరిగాయి. 2006లో మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జి పడ్కాపూర్ చంద్రమౌళి, 2007లో కేంద్ర కమిటీ సభ్యుడు సందే రాజమౌళి, 2009లో మిలిటరీ వ్యూహకర్త పటేల్ సుధాకర్‌రెడ్డి, 2010లో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆజాద్ ఎన్‌కౌంటర్‌లో మరణించారు.

### గ్రీన్‌హంట్‌తో సెట్‌బ్యాక్

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా 2009లో నాటి యూపీఏ ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. వరస ఎన్‌కౌంటర్లు మావోయిస్టు పార్టీని ఉక్కిరిబిక్కిరి చేశాయి. శాఖమూరి అప్పారావు, ఇతర నేతల ఎన్‌కౌంటర్లతో ఆందోళనకు గురయిన ఆ పార్టీ శాంతిచర్చలను తెరమీదకు తీసుకొచ్చింది. అయితే, శాంతి చర్చల అంశాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తోన్న ఆ పార్టీ అధికారప్రతినిధి ఆజాద్ కూడా ఎన్‌కౌంటర్ అయ్యారు.2014లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక గ్రీన్‌హంట్ మూడో దశ కూడా సాగింది. ఆ తర్వాత ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్‌లు ముందుకొచ్చాయి. 2024 జనవరి నుంచి కగార్ ఆపరేషన్ మొదలైంది. భద్రతా బలగాలకు మానవ రహిత విమానాలు, అత్యాధునిక డ్రోన్‌లను కేంద్ర ప్రభుత్వం అందించింది. వాటి పనితీరు ఎంతగా ఉందంటే, అడవుల్లో ఏ ఇద్దరు కలిసి తిరిగినా వెంటనే గుర్తించి 56-70 కిలోమీటర్ల దూరంలోని కమాండ్ కంట్రోల్‌కు సిగ్నల్ ఇచ్చేంతగా ఫలితాలు ఇచ్చాయి. ఫలితంగా భద్రతా బలగాలు మావోయిస్టులను వెతుక్కుంటూ వెళ్లడం సులువైంది. దీంతో మావోయిస్టులకు ఊహించని నష్టం వాటిల్లింది. విముక్తి ప్రాంతాలు సహా 28 వ్యూహాత్మక ఏరియాలను కోల్పోయారు.

వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులు దండకారణ్యంలో ఉండలేని పరిస్థితిని భద్రతా బలగాలు తీసుకొచ్చాయి. ఫలితంగా మావోయిస్టులు శాంతిచర్చలు జరపాలని కేంద్రం ముందు ప్రతిపాదన ఉంచారు. ఇందుకు కేంద్రం అంగీకరించలేదు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో ఇక శాంతి చర్చలకు అవకాశం ఉండదని స్పష్టమైంది. ఆ తర్వాత అన తికాలంలోనే ఆపార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు( బస్వరాజ్) సహా మరో 18 మంది కీలక నేతలను భద్రతా బలగాలు హతమార్చాయి. లొంగిపోతే ప్రాణమయినా దక్కుతుందని కొందరు, ఇప్పుడు సాయుధ పోరాటం చేయలేమని మరి కొందరు నేతలు నిర్ణయానికి వచ్చారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ (సోను), కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న సహా అనేక మంది ప్రభుత్వం ముందు ఆయుధాలతో లొంగిపోయారు. ఇప్పుడు అనూహ్యంగా సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి, బెటాలియన్ 1 కమాండర్ హిడ్మా, ఆయన బృందం ఏపీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తుడిచిపెట్టుకుపోయింది. ఆయన ప్లటూన్‌లోని అనేక మంది మిలిటెంట్లు విజయవాడలో పోలీసులకు చిక్కారు. దండకారణ్యంపై పట్టుకున్న హిడ్మానే అక్కడి నుంచి బయటకు వచ్చారంటే అడవిలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థమవుతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.


పువర్తి గ్రామంలోని ఓ ఇల్లు

# ఆ ఊళ్లో 50 ఇళ్లు.. 90 మంది మావోయిస్టులు!

- హిడ్మా స్వగ్రామం పువర్తిలో రాజ్యమేలుతున్న నిశ్శబ్దం
- ప్రత్యేక బేస్ క్యాంప్‌లో వందమంది జవాన్ల పహారా
- గత లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ ఒక్క ఓటూ పడలేదు
- పువర్తికి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి.. అడవిలో 3 గంటల ప్రయాణం

(చింతూరు/చర్ల-ఆంధ్రజ్యోతి)

ఎన్‌కౌంటర్‌లో హతమైన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా స్వగ్రామం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దక్షిణ సుక్మా జిల్లాలోని పువర్తి. ఈ గ్రామంలో మొత్తం ఇళ్లు 50 మాత్రమే. అయితే ఆ ఊరి నుంచి 90 మంది యువకులను మావోయిస్టులుగా హిడ్మా తయారుచేశాడు. దశాబ్దాల తర్వాత పువర్తిలో అడుగుపెట్టిన పోలీసులు దాదాపు ఏడాది కిందట అక్కడ సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ వందమంది వరకు జవాన్లు నిరంతరం పహరా కాస్తుంటారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పువర్తిలో పోలింగ్ బూత్ ఏర్పాటుచేయడం అధికార యంత్రాంగానికి పెద్ద సవాల్‌గా మారింది. పువర్తి పోలింగ్ బూత్ పరిధిలో మొత్తం 547 ఓట్లు ఉండగా 31 ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. ఇక పువర్తి నుంచి ఒక్కటంటే ఒక్క ఓటు కూడా పడలేదు. ఇక మరో వాంటెడ్ మావోయిస్టు బార్స దేవాది కూడా పువర్తే. హిడ్మా నేతృత్వం వహించిన పీఎల్‌జీఏ ప్లటూన్ నంబర్. 1లో హిడ్మా తరువాతి స్థానం దేవాదేనని చెబుతారు. దేవాను సుక్కా, దేవన్నగా కూడా పిలుస్తుంటారు. కాగా హిడ్మా తలపై మొత్తంగా రూ.1.80 కోట్ల రివార్డు ఉంది. ఛత్తీస్‌గఢ్ రూ.40లక్షలు, మహారాష్ట్ర రూ.50లక్షలు, ఒడిశా రూ.25లక్షలు, ఏపీ రూ.25లక్షలు, తెలంగాణ రూ.25లక్షలు, మధ్యప్రదేశ్ రూ.25 లక్షలు చొప్పున రివార్డులు ప్రకటించాయి. ఈ నేపథ్యంలోనే పువర్తిలో నెలకొన్న పరిస్థితిని కవర్ చేసేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఆ గ్రామాన్ని సందర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి మొదలైన ప్రయాణం.. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పామేడు, కౌరుగట్టు, కొండపల్లి, చిన్నబట్టిగూడెం గ్రామం మీదుగా సుమారు 3 గంటల పాటు అడవిలో ప్రయాణించి పువర్తికి చేరుకున్నారు. అడవుల్లో అడుగడుగునా బలగాలు కనిపించగా.. ఎటు వెళ్తున్నారు.. ఎక్కడ నుంచి వస్తున్నారు..? అనే ప్రశ్నలు ఎదురయ్యాయి.

### సగం ఇళ్లకు తాళాలే..

పువర్తిలోని 8 వీధులుండగా.. బండిపారలో హిడ్మా ఇల్లు ఉంది. అన్ని వీధుల్లో సగం ఇండ్లకు తాళాలే కనిపించాయి. కొందరు ఇళ్ల వద్ద దిగాలుగా కూర్చుని ఉన్నారు. మరికొంతమంది హిడ్మా ఇంటి వద్దకు చేరుకుని చెట్ల కింద కూర్చుని కనిపించారు. బుధవారం రాత్రి వరకు హిడ్మా మృతదేహం పువర్తికి చేరుకోలేదు. నడవలేని పరిస్థితిలో ఉన్న హిడ్మా తల్లి మాంజు.. ఇతర కుటుంబ సభ్యులు బోరున విలపిస్తూ కనిపించారు. హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం సెల్‌ఫోన్‌లో చూశామని, ఫొటో చూశాక హిడ్మానే అని పోలీసులకు చెప్పామని గ్రామస్థులు చెప్పారు. హిడ్మా మృతదేహం గురువారం తీసుకొస్తారని తెలిపారు.

## హిడ్మా దంపతులకు పోస్టుమార్టం పూర్తి

- మిగిలిన మృతదేహాలకు నేడు నిర్వహణ

రంపచోడవరం/రాజమహేంద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన హిడ్మా, ఆయన సతీమణి రాజే దంపతుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయింది. బంధువుల వద్ద నుంచి డీఎన్‌ఏ శాంపిళ్లను అధికారులు సేకరించారు. వీరితో పాటు మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మరో నలుగురు, బుధవారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. కాగా, హిడ్మా భౌతికకాయం కోసం ఆయన సోదరుడు ముయా బుధవారం అల్లూరి జిల్లా రంపచోడరం ఏరియా ఆసుపత్రికి చేరుకున్నాడు. అలాగే హిడ్మా సోదరి, పువర్తి గ్రామ సర్పంచ్, హిడ్మా భార్య రాజే సోదరుడు హెలిన్ కూడా వచ్చారు. కాగా, 'ఆపరేషన్ సంభవ్' పేరుతో ఈ నెల 17 నుంచి 19 వరకూ ఇక్కడి అడవుల్లో కూంబింగ్ నిర్వహించిన పోలీసులు మూడు రోజుల వ్యవధిలోనే హిడ్మా సహా 13 మంది మావోయిస్టులను మట్టుపెట్టారు. ఈ నేపథ్యంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా గురువారం రంపచోడవరం రానున్నట్టు సమాచారం.



### కుప్పకూలిన హిడ్మా తల్లి

హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మరణించిన సమాచారాన్ని బంధువులు చేరవేయడంతో ఆయన తల్లి పొజ్జే ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. నడిచే ఓపిక కూడా లేకపోవడంతో ఇంటి ఆరుబయటే ఒంటరిగా కూర్చుని రోదిస్తోంది. హిడ్మా కోసం వేట ముమ్మరమైన నాటి నుంచి పువర్తికి దూరంగా ఉండేవాడు. దీంతో చాలాకాలంగా తన కొడుకును పొజ్జే చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నెల 11న ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయశర్మ సూచనలతో హిడ్మాను ఇంటికి రమ్మని ప్రసార మాధ్యమాల ద్వారా పొజ్జే అభ్యర్థించింది. వారం రోజుల్లోనే ఇప్పుడు తన కొడుకు ఎన్‌కౌంటర్ అయ్యాడన్న వార్త ఆమె తీవ్రంగా కుంగదీసింది. బుధవారం ఉదయం నుంచి పువర్తిలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.